ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

శనివారం 26 సెప్టెంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 100 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు
సీజేపీ అల్టిమేటం
24 గంటల్లోగా వైదొలగకపోతే
అక్టోబర్ 2 నుంచి దేశవ్యాప్త నిరసనలు



2



2

ఈ-కేవైసీ పూర్తయితేనే
పీఎం కిసాన్ నిధులు
మూడు మార్గాల్లో పూర్తి చేసుకునే వెసులుబాటు



'ఓటు బ్యాంక్ రాజకీయాలపై కాదు
సామాజిక సంస్కరణలపై దృష్టి పెట్టండి
కార్యకర్తలకు మోదీ పిలుపు

12 ఏళ్లలో దేశంలోని నగరాలు, గ్రామాల మధ్య అంతరం గణనీయంగా తగ్గిందన్న ప్రధాని- గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఎంతో మెరుగుపడ్డాయని చెప్పిన నరేంద్ర మోదీ

ఓటు బ్యాంకు రాజకీయాలకు బదులుగా సామాజిక సంస్కరణలు, సానుకూల మార్పులపై దృష్టి సారించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బీజేపీ కార్యకర్తలకు శుక్రవారం పిలుపునిచ్చారు. వారణాసి నుంచి వాద్‌నగర్ వరకు సాగుతున్న సేవా యాత్ర (మోటార్ సైకిల్ ర్యాలీ)లో పాల్గొంటున్నవారితో వర్చువల్‌గా మాట్లాడారు.

- న్యూఢిల్లీ (సింగిడి)

మేక్ ఇన్ ఇండియాతో
మార్పు స్పష్టం
ప్రధాని మోదీ పోస్ట్- కాంగ్రెస్ పార్టీ కౌంటర్

2

ప్రశాంతంగా నిమజ్జనం
గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి

రాష్ట్రవ్యాప్తంగా లక్షన్నర విగ్రహాల నిమజ్జనం

హైదరాబాద్‌లో 25 వేల మంది పోలీసులతో భద్రత

డ్రోన్లతో నిఘా.. మంత్రి పొన్నంతో కలిసి డీజీపీ సీవీ ఆనంద్ ఏరియల్ సర్వే

పది రోజుల ఉత్సవాల్లో 13 మంది మృతి.. 26 మందికి గాయాలు



బాలాపూర్ లడ్డూకు రికార్డు ధర

2

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గణేశ్ నిమజ్జనోత్సవాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ముగిశాయి. రాష్ట్ర పోలీసు శాఖ తీసుకున్న పకడ్బందీ భద్రతా చర్యలు, కట్టుదిట్టమైన ట్రాఫిక్ నియంత్రణల కారణంగా నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగింది. హైదరాబాద్ నగరంతో పాటు ఆదిలాబాద్, నిర్మల్, నారాయణపేట సహా అన్ని జిల్లాల్లో లక్షలాది విగ్రహాలు గంగమ్మ ఒడికి చేరాయి. శుక్రవారం జరిగిన నిమజ్జన బందోబస్తు ఏర్పాట్లపై రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు.

- హైదరాబాద్, సెప్టెంబర్ 25 (సింగిడి)



2

రేవంత్ రెడ్డికి 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డు

కేరళకు చెందిన ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ పురస్కారం.. ప్రజా సంక్షేమ పాలనకు లభించిన జాతీయ గుర్తింపు

కేరళలోని నిలంబూర్‌లో నేడు అవార్డు ప్రదానోత్సవం... కార్యక్రమానికి హాజరయ్యేందుకు కేరళ వెళ్లిన సీఎం



2

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. కేరళకు చెందిన ప్రతిష్ఠాత్మక ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ అందజేస్తున్న 'ఆర్యదాన్ ముహమ్మద్ – 2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. తెలంగాణలో ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధతతో పాటు రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం ఆయన అమలు చేస్తున్న వినూత్న పథకాలు, దూరదృష్టి గల నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ ప్రకటించారు.

- త్రివేండ్రం, సెప్టెంబర్ 25 (సింగిడి)

స్విగ్గీ, జొమాటోకు
పోటీగా 'ఓన్లీ'
హైదరాబాద్ కు రాపిడో ఫుడ్ డెలివరీ

హైదరాబాద్‌లో 'ఓన్లీ' ఫుడ్ డెలివరీని ప్రారంభించిన రాపిడో

జీరో కమిషన్ మోడల్‌తో రెస్టారెంట్లకు పూర్తి ప్రయోజనం

కస్టమర్లకు ప్లాట్‌ఫామ్, సర్జ్ ఛార్జీల నుంచి మినహాయింపు

బెంగళూరులో విజయవంతం కావడంతో హైదరాబాద్‌లో విస్తరణ

రానున్న త్రైమాసికంలో ప్రధాన మెట్రో నగరాలకు విస్తరణ ప్రణాళిక

ప్రముఖ బైక్-ట్యాక్సీ సేవల సంస్థ రాపిడో, ఫుడ్ డెలివరీ రంగంలోకి తన వ్యాపార కార్యకలాపాలను విస్తరించింది. స్విగ్గీ, జొమాటో వంటి దిగ్గజ సంస్థలకు గట్టి పోటీనిచ్చే లక్ష్యంతో 'ఓన్లీ' (Ownly) పేరుతో హైదరాబాద్‌లో ఆహార పంపిణీ సేవలను ప్రారంభించింది.

- హైదరాబాద్, సెప్టెంబర్ 25 (సింగిడి)

2

హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం



2

నేడు ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి

గచ్చిబౌలిలో మాజీ ప్రధాని విగ్రహం ఏర్పాటు

మన్మోహన్ సింగ్ దేశానికి, తెలంగాణకు చేసిన సేవలను స్మరించుకున్న మంత్రి పొన్నం

ఆయన నాయకత్వంలోనే ఉపాధి హామీ, ఆర్టీఐ వంటి చట్టాలు వచ్చాయని వెల్లడి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ పాత్ర చారిత్రాత్మకమని కొనియాడిన ప్రభుత్వం

గోదావరిలో వరద పోతుంటే..
బురద రాజకీయాలేనా
వెంటనే మోటార్లు నడిపి జలాశయాలను నింపాలి

ఎల్‌నినోను కారణంగా చూపి బాధ్యత నుంచి తప్పించుకోవద్దు

నీళ్లు లేక సిద్దిపేటలో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నడవని పరిస్థితి

ఎండిన రిజర్వాయర్లకు కాంగ్రెస్ పాలన నిర్లక్ష్యమే కారణం

ఇప్పటికైనా కళ్లు తెరవండి.. మోటార్లు నడిపి గోదావరి నీటిని రిజర్వాయర్లకు మళ్లించండి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ

2





గోదావరి జలాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో కేసీఆర్ గారు కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవస్థను నిర్మించారు. ఇందులో భాగంగా 141 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లను ఏర్పాటు చేశారు. గోదావరిలో వరద వచ్చినప్పుడు ఆ నీటిని ఒడిసిపట్టి రిజర్వాయర్లను నింపితే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఒకవైపు వర్షాభావ పరిస్థితులు.. మరోవైపు గోదావరిలో భారీ వరద ప్రవాహం ఉన్నా, ఆ నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపడంలో మీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఆందోళన కలిగిస్తోంది. నీళ్లు అందక పంటలు ఎండిపోతుంటే మీరు మాత్రం ప్రాజెక్టుల మీద రాజకీయాలు చేస్తూ పంటలు ఎండగొడుతున్నారు. గోదావరి జలాలను లిఫ్ట్ చేయకుండా చోద్యం చూస్తున్నారు.

- హైదరాబాద్, (సింగిడి)



ఎన్నికల సంఘంలో విభేదాలపై
జగన్ ఆందోళన

2

ప్రస్తుత నియామక చట్టాన్ని సవరించాలని కేంద్రానికి డిమాండ్

ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా కమిటీలో ఉండాలి

ఈసీలో కమిషనర్ల అభ్యంతరాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి

ఏపీలో గతంలో తమ అభ్యంతరాలను పట్టించుకోలేదని ఆరోపణ

కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)లో అంతర్గత విభేదాలు ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనం రావడం, దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేగడంపై వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం జగన్ స్పందించారు. ఈసీ పనితీరు, నియామకాల పద్ధతిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం నిలబడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం ఉద్దేశించిన 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్, 2023'ను పునఃసమీక్షించి, సవరించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల జాతీయ మీడియాలో వచ్చిన కథనాలను జగన్ తన పోస్టులో ప్రస్తావించారు.

- న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 (సింగిడి)

'సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి'
దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు

2

అంతా అయిపోయింది బ్రదర్!

అప్రూవర్‌గా మారాలి: కాంగ్రెస్ డిమాండ్

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా శుక్రవారం నిరసనలు చేపట్టింది. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా, ఎస్ ఐఆర్ ప్రక్రియలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, సీఈసీ పదవి నుంచి ఆయనను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేసింది. జమ్మూకశ్మీర్, అస్సోం, ఉత్తరాఖండ్, బంగాల్, ఉత్తరప్రదేశ్, చండీగఢ్, మణిపుర్ తదితర రాష్ట్రాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా రాష్ట్రాల్లోని ఎన్నికల సంఘం కార్యాలయాల వైపు ర్యాలీ చేస్తూ సీఈసీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



సీఈసీకి వ్యతిరేకంగా సుప్రీంలో పిటిషన్

'జ్ఞానేశ్ తీసుకున్న నిర్ణయాలు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలి'

సిట్‌తో దర్యాప్తు జరపాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్

జాబితా నుంచి 13 కోట్ల మందిని తొలగించారనే దానిపై విచారణ జరపాలన్న పిటిషనర్

2

"ఓటు చోరీ చేస్తూ ఎన్నికల సంఘం బీజేపీ ప్రభుత్వాలను అధికారంలోకి తెస్తోంది. రాహుల్ గాంధీ ఈ విషయాన్ని గత మూడేళ్లుగా చెబుతూ వస్తున్నారు. ఈ రోజు అది వాస్తవమని రుజువైంది. రాహుల్ దృఢ సంకల్పానికి నేను సెల్యూట్ చేస్తున్నాను. ఇది దేశానికి ఎంతో మేలు చేస్తుంది. మాకు నిష్పక్షపాతమైన, స్వచ్ఛమైన ఎన్నికలు కావాలి" అని ఉత్తరాఖండ్ పీసీసీ అధ్యక్షుడు గణేశ్ గోడియాల్ అన్నారు.

- న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 (సింగిడి)

జనరల్ న్యూస్ సింగిడి

'మేక్ ఇన్ ఇండియాతో మార్పు స్పష్టంగా ఉంది'

భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో ప్రారంభమైన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ తాజాగా సోషల్ మీడియాలో ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 12 ఏళ్ల తర్వాత వివిధ రంగాల్లో వచ్చిన మార్పులను ఆయన తన పోస్ట్‌లో ప్రస్తావించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ, భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

'వివిధ రంగాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది'

అయితే 2014 సెప్టెంబర్ 25న ప్రధాని నరేంద్ర మోదీ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెట్టుబడులను ఆకర్షించడం, తయారీని పెంచడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, మౌలిక వసతులను బలోపేతం చేయడం ఆ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలు. "భారత్‌లో మరింత తయారీ. భారత్‌లో మరింత పెట్టుబడి. భారత్ నుంచి మరింత ఎగుమతులు. వివిధ రంగాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది" అని మోదీ పోస్టులో చెప్పారు. దేశం అభివృద్ధి చెందేందుకు అవసరమైన మౌలిక వసతులు, వ్యాపార అవకాశాలు, ఆవిష్కరణలను మేక్ ఇన్ ఇండియా ప్రోత్సహిస్తోందని చెప్పారు.



కాంగ్రెస్ ఏమంటోంది?

అయితే మేక్ ఇన్ ఇండియా విజయాలపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, ఆ కార్యక్రమం ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వలేదని విమర్శించారు. తయారీ రంగంలో వృద్ధి మొత్తం ఆర్థిక వ్యవస్థ వృద్ధితో పోలిస్తే చాలా సందర్భాల్లో తక్కువగానే ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ పెట్టుబడుల భారీ పెరుగుదల కనిపించలేదని, విస్తృత స్థాయిలో ఉద్యోగాల కల్పన కూడా జరగలేదని కాంగ్రెస్ ఆరోపించింది. తయారీ రంగం గణాంకాలను పరిశీలిస్తే మేక్ ఇన్ ఇండియా వల్ల ప్రత్యేకంగా కనిపించే అదనపు వృద్ధి ఇంకా స్పష్టంగా కనిపించడం లేదని జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

12 ఏళ్లలో ఏం మారింది?

ప్రభుత్వం ప్రకారం, మేక్ ఇన్ ఇండియా కేవలం దేశీయ అవసరాల కోసం వస్తువులు తయారు చేయడానికే పరిమితం కాలేదు. అంతర్జాతీయ మార్కెట్ల కోసం కూడా ఉత్పత్తులు తయారు చేసే స్థాయికి భారత్ ఎదుగుతోందని కేంద్రం చెబుతోంది. ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఫార్మా, స్టీల్, రైల్వేలు, రక్షణ రంగాల్లో ఉత్పత్తి సామర్థ్యం పెరిగిందని పేర్కొంది. ప్రస్తుతం మేక్ ఇన్ ఇండియా 2.0 కింద తయారీతో పాటు సేవల రంగాలను కలిపి మొత్తం 27 రంగాలపై దృష్టి పెట్టారు.

ఆ ప్రయాణంలో ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (PLI) పథకాలు కీలకంగా మారాయని ప్రభుత్వం చెబుతోంది. 14 కీలక రంగాల్లో అమలవుతున్న ఆ పథకాల కింద 2026 మార్చి నాటికి రూ.2.40 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. రూ.22.66 లక్షల కోట్లకు పైగా ఉత్పత్తి, అమ్మకాలు నమోదయ్యాయి. రూ.15.20 లక్షల కోట్లకు పైగా ఎగుమతులు జరిగాయి. ప్రత్యక్ష, పరోక్షంగా 14.15 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించినట్లు కేంద్ర గణాంకాలు చెబుతున్నాయి.

మొబైల్ మేకింగ్‌లో భారీ మార్పు

మేక్ ఇన్ ఇండియా ప్రభావాన్ని ఎలక్ట్రానిక్స్ రంగంలో స్పష్టంగా చూడొచ్చని కేంద్రం చెబుతోంది. 2014–15లో దేశంలో ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఉత్పత్తి విలువ సుమారు రూ.1.9 లక్షల కోట్లు ఉండగా, 2025–26లో అది రూ.13.11 లక్షల కోట్లకు చేరింది. అంటే దాదాపు ఏడు రెట్లు పెరిగింది. ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు కూడా రూ.38 వేల కోట్ల నుంచి రూ.4.24 లక్షల కోట్లకు పెరిగాయి. మొబైల్ ఫోన్ల తయారీలోనూ ఇదే స్థాయిలో మార్పు కనిపించింది. 2014–15లో సుమారు రూ.18 వేల కోట్ల విలువైన మొబైల్ ఫోన్లు తయారయ్యాయి. 2025–26 నాటికి ఆ విలువ రూ.6.27 లక్షల కోట్లకు చేరింది. మొబైల్ ఫోన్ ఎగుమతులు కూడా సుమారు రూ.1,500 కోట్ల నుంచి రూ.2.59 లక్షల కోట్లకు పెరిగాయి. ప్రస్తుతం భారత్‌లో ఉపయోగించే మొబైల్ ఫోన్లలో 99.2 శాతం దేశంలోనే తయారవుతున్నాయని ప్రభుత్వం తెలిపింది.

'ఓటు బ్యాంక్ రాజకీయాలపై కాదు.. సామాజిక సంస్కరణలపై దృష్టి పెట్టండి

గత 12 ఏళ్లలో దేశంలోని నగరాలు, గ్రామాల మధ్య అంతరం గణనీయంగా తగ్గిందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఎంతో మెరుగుపడ్డాయని మోదీ పేర్కొన్నారు. దేశంలో మహిళల్లో స్వయం సమృద్ధి కూడా పెరిగిందని ఆయన అన్నారు. "మహాత్మా గాంధీ జీవితాన్ని పరిశీలిస్తే, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడటం, స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించడంతో పాటు, ఆయన ఒక గొప్ప సామాజిక సంస్కర్తగా కూడా నిలిచారని మనకు అర్థమవుతుంది. సమాజంలో ఉన్న దురాచారాలకు వ్యతిరేకంగా ఆయన ఎల్లప్పుడూ కృషి చేశారు. కాబట్టి రాజకీయ కార్యకర్తలుగా మనం కూడా ఓటు బ్యాంకుల గురించి ఆలోచించకుండా, సామాజిక సంస్కరణ, సానుకూల మార్పు దిశగా కృషిని కొనసాగించాలి. సమాజానికి సేవ చేసేవారు గౌరవం పొందడానికి అర్హులు" అని మోదీ అన్నారు.

'అందుకే పాదాలు కడిగి ఆశీస్సులు'

అదే సమయంలో ప్రయాగ్‌రాజ్‌లో పారిశుధ్య పనులు చేపట్టిన వారిని ప్రధాన మంత్రి మోదీ ప్రశంసించారు. వారి కృషి వల్ల కుంభమేళా పరిశుభ్రత విషయంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, తద్వారా దేశ గౌరవం పెరిగిందని ఆయన పేర్కొన్నారు. అందుకే భారత్ గౌరవాన్ని ఇంతగా పెంచిన వారి పాదాలను కడిగి, వారి ఆశీస్సులు పొందాలని తాను భావించినట్లు చెప్పారు. తన వ్యక్తిగత జీవితంలో 'సేవా యాత్ర' చాలా ముఖ్యమైన పాత్ర పోషించిందని, దేశంలో తాను సందర్శించని జిల్లాలు దాదాపు లేవని మోదీ చెప్పారు. చాలా జిల్లాల్లో రాత్రిపూట బస చేసే అవకాశం తనకు లభించిందని చెప్పారు. ప్రతి ప్రయాణం, అందులో పొందిన ప్రతి అనుభవం నేటికీ తనకు గురువులా మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నాయని మోదీ తెలిపారు. ఆ ప్రయాణాలు తనకు ఎంతో నేర్పించాయని అన్నారు. మోదీ 76వ పుట్టినరోజున అంటే సెప్టెంబర్ 17న వాద్‌నగర్, వారణాసిలో మొత్తం రెండు బైక్ ర్యాలీలు ప్రారంభమయ్యాయి. అవి అక్టోబర్ 7న ముగుస్తాయి. ప్రధాన మంత్రి మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని వాద్‌నగర్ నుంచి వారణాసికి, వారణాసి నుంచి వాద్‌నగర్‌కు ఆ బైక్ ర్యాలీలు జరుగుతాయి. గుజరాత్‌లోని వాద్‌నగర్ మోదీ జన్మస్థలం కాగా, ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి 2014 నుంచి ఆయన ఎంపీగా ఎన్నికవుతున్నారు. సేవా భావాన్ని నేరుగా క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు ఆ రెండు ర్యాలీలు వివిధ పట్టణాలు, జిల్లాలు, గ్రామాల గుండా సాగుతున్నాయి. తన జీవితాన్ని తీర్చిదిద్దిన విలువలను వాద్‌నగర్ తనకు అందించిందని, ఆ విలువలకు కాశీ (వారణాసి) సేవా భావనతో కూడిన అనేక కోణాలను జోడించిందని మోదీ పేర్కొన్నారు. "యువ మిత్రులైన మీరందరూ కూడా సేవా భావనతో కూడిన అనేక కోణాలతో ఆ ప్రయాణాన్ని మరింత అర్థవంతం చేస్తుండటం నాకు సంతోషాన్నిస్తోంది. ఆ రెండు బైక్ ర్యాలీలు ప్రజా భాగస్వామ్యానికి సంబంధించిన అనేక అంశాలను అంటే 'సేవ', 'సంపర్క్' (అనుసంధానం), యువత భాగస్వామ్యం, సామాజిక సంక్షేమం, సాంస్కృతిక అనుసంధానం, సామాజిక చైతన్యం వంటి వాటిని ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తీసుకువెళుతున్నాయి" అని మోదీ తెలిపారు. సంఘ్ పరివార్ సిద్ధాంతకర్త దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళులు అర్పిస్తూ, సమాజం పట్ల బాధ్యతలను నెరవేర్చడానికి ఉపాధ్యాయ ఏడు సూత్రాలను వివరించారని, ఆ సూత్రాలు ప్రతి బీజేపీ కార్యకర్తలోనూ కొత్త ఉత్సాహాన్ని నింపుతాయని ప్రధాన మంత్రి అన్నారు. సేవా భావం, సమతుల్యత, ఆత్మనిగ్రహం, సమన్వయం, సానుకూల దృక్పథం, సున్నితత్వం, సంభాషణ అనేవి ఆ ఏడు సూత్రాలని ఆయన పేర్కొన్నారు. "అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించిన తర్వాతే మేము ఆగుతాం. ఈ భావన సేవా సంకల్ప యాత్రలో ప్రతిబింబిస్తోంది ఇది అన్ని చోట్లా కనిపిస్తోంది" అని ఆయన అన్నారు.

ఈ-కేవైసీ పూర్తయితేనే
పీఎం కిసాన్ నిధులు

న్యూఢిల్లీ (సింగిడి)

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 24వ విడతగా రూ.2,000 పొందాలంటే లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ (వఐజఅ) పూర్తి చేసుకోవాల్సిందేనని స్పష్టమైంది. గతంలో 23వ విడత సమయంలో ఈ ప్రక్రియ పూర్తి చేయని వారి ఖాతాల్లో నగదు జమ కాలేదు. ప్రస్తుతం అధికారిక పోర్టల్‌లో సాధారణ రైతులకు నేరుగా కేవైసీ చేసుకునే అవకాశం అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మూడు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఈ ప్రక్రియను ముగించవచ్చని అధికారులు వెల్లడించారు.సీఎస్‌సీ కేంద్రాల ద్వారా: గ్రామాల్లోని కామన్ సర్వీస్ సెంటర్ల (ఆఅ) పీఎల్‌ఈ లాగిన్ ద్వారా ఆధార్ కార్డు, పీఎం కిసాన్ రిజిస్ట్రేషన్ వివరాలు అందించి బయోమెట్రిక విధానంలో కేవైసీ చేసుకోవచ్చు. దీనికి ప్రభుత్వం నిర్దేశించిన నామమాత్రపు రుసుము మాత్రమే చెల్లించాలి.మొబైల్ ఫేస్ రికగ్నిషన్: స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ప్లేస్టోర్ నుంచి 'పీఎం కిసాన్'తో పాటు 'ఆధార్ ఫేస్ ఆర్‌డీ' యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. పీఎం కిసాన్ యాప్‌లో బెనిఫిషియరీగా లాగిన్ అయి, 'ఫేషియల్ ఈ-కేవైసీ' ఎంపిక చేసుకుని కెమెరా ద్వారా ముఖాన్ని స్కాన్ చేసి క్షణాల్లో కేవైసీ పూర్తి చేయవచ్చు. అధికారిక లాగిన్ల ద్వారా: క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ, స్థానిక ప్రభుత్వ సిబ్బంది వద్ద ఉండే అధికారిక స్పెషల్ లాగిన్ల సాయంతోనూ పెండింగ్ కేవైసీని పూర్తి చేసుకునే సదుపాయం ఉంది.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు సీజేపీ అల్టిమేటం

న్యూఢిల్లీ (సింగిడి)

ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ శనివారం లోగా(2సెప్టెంబర్ 26) తన పదవికి రాజీనామా చేయకపోతే అక్టోబర్ 2 నుంచి దేశవ్యాప్త నిరసనలు చేపడతామని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) శుక్రవారం ప్రకటించింది. గాంధీ జయంతి నాడు(అక్టోబర్ 2) ముంబైలో ఈ ఆందోళన ప్రారంభమై ఆ తర్వాత దేశవ్యాప్తంగా ఉన్న నగరాలకు విస్తరిస్తుందని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఎక్స్ వేదికగా తెలిపారు. రిగ్గింగ్ జరిగిన ఎన్నికల్లో పోటీ చేయడం ఆ ప్రక్రియకు చట్టబద్ధతను కల్పిస్తుందని, ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగాయనే భావాన్ని కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. తమ రాజకీయ ప్రాముఖ్యతను కోల్పోతామనే భయంతోనే విపక్ష పార్టీలు ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయా అని కూడా ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో రిగ్గింగ్ జరుగుతున్నదని విశ్వసిస్తుంటే ఎన్నికల్లో పోటీ చేయడం నిలిపివేయాలని ఆయన ప్రతిపక్షపార్టీలకు పిలుపునిచ్చారు. ఎన్నికల నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల విషయంలో సంబంధిత రాష్ట్రం లేదా రాజకీయ పార్టీని బట్టి కాకుండా ప్రతిపక్ష పార్టీలు స్థిరమైన వైఖరిని అవలంబించాలని కూడా ఆయన సూచించారు. తమ రాజకీయ మనుగడ కంటే దేశ ప్రయోజనాలు, ప్రజాస్వామ్య హితానికే ప్రాధాన్యత ఇవ్వాలని విపక్ష పార్టీలను ఆయన కోరారు.

'సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి'

యూపీలోని లఖ్‌నవూలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహించారు. హజ్రత్‌గంజ్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయాన్ని ముట్టడించేందుకు వారు ప్రణాళికలు వేస్తున్నట్లు సమాచారం. మణిపుర్‌లో కాంగ్రెస్ నేతలు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేసి, విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ లాంఫెల్‌పట్‌లోని ప్రధాన ఎన్నికల కార్యాలయంవైపు ర్యాలీ నిర్వహించారు. తర్వాత ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. తర్వాత ఈ నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారింది. దీనితో పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. కాంగ్రెస్ నిరసనల నేపథ్యంలో పోలీసులు జమ్మూకశ్మీర్‌లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే శ్రీనగర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శాసన సభ లోపల నిరసన ప్రదర్శనలు చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బ్యానర్లు ప్రదర్శించారు. అలాగే గువాహటి, చండీగఢ్, దేహ్రాదూన్, లఖ్‌నవూ, కోల్‌కతాల్లో కూడా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. మరోవైపు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) తమ రాష్ట్ర విభాగాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆయా రాష్ట్రాల్లోని ఎన్నికల సంఘాల కార్యాలయాల వరకు పాదయాత్రలు నిర్వహించాలని స్పష్టం చేసింది.

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 1,24,000 పైచిలుకు విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు డీజీపీ తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య 8,000 ఎక్కువ అని పేర్కొన్నారు. ఇక అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, వ్యక్తిగత గృహాల్లో ప్రతిష్ఠించిన చిన్న విగ్రహాలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య సులభంగా మూడున్నర లక్షల నుంచి నాలుగు లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. పోలీసు శాఖ ప్రత్యేకంగా రూపొందించిన ఇన్‌స్టాలేషన్ అండ్ ఇమర్షన్ పోర్టల్ ద్వారా మండపాల నిర్వాహకులు, పోలీస్ అధికారులు సమన్వయం చేసుకుని విగ్రహాల వివరాలను పక్కాగా నమోదు చేసినట్లు డీజీపీ వివరించారు. శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయానికే రాష్ట్రవ్యాప్తంగా 63,350 విగ్రహాల నిమజ్జనం పూర్తి కాగా, మరో 32 వేల విగ్రహాలు నిమజ్జనానికి క్యూలో ఉన్నాయని, శనివారం ఉదయం నాటికి ప్రక్రియ మొత్తం పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు.

25,000 మంది పోలీసులతో బందోబస్తు.. మంత్రి పొన్నంతో కలిసి ఏరియల్ సర్వే

హైదరాబాద్ నగరంలోనే నిమజ్జన బందోబస్తు కోసం సుమారు 25,000 మంది పోలీసులను మోహరించినట్లు డీజీపీ తెలిపారు. ఇందులో 15,000 మంది స్థానిక సిటీ పోలీసులు కాగా, మిగిలిన 10,000 మందిని జిల్లాల నుంచి ప్రత్యేకంగా రప్పించారు. హైదరాబాద్ నగర విస్తీర్ణం పెరిగిన దృష్ట్యా శంషాబాద్, రాజేంద్ర నగర్ లాంటి ప్రాంతాలకు అదనపు బలగాలను కేటాయించారు. సైబరాబాద్, మల్కాజిగిరి పరిధిలో కూడా అదనపు సివిల్, ఏపీఎస్‌పీ ఫోర్స్‌ను అందించారు. టీజీఎస్పీ బెటాలియన్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆర్ఏఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఆక్టోపస్, గ్రేహౌండ్స్‌తో పాటు మౌంటెడ్ పోలీసులు, డాగ్ స్క్వాడ్స్‌ను కూడా భద్రతా విధుల్లో వినియోగించారు. హైదరాబాద్ నగరంలో 13 డ్రోన్లను మోహరించి, కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా అధికారులకు బర్డ్ ఐ వ్యూ అందించారు. హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి డీజీపీ శుక్రవారం సాయంత్రం హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించి ఊరేగింపు రూట్లను, ట్యాంక్ బండ్ పరిసరాలను పరిశీలించారు. శుక్రవారం ప్రార్థనల కారణంగా ఆయా వర్గాల మనోభావాలను గౌరవిస్తూ ఉదయం ఊరేగింపులు కాస్త ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ, సాయంత్రానికి వేగం పుంజుకున్నాయని డీజీపీ తెలిపారు.

13 మంది మృతి.. 26 మందికి గాయాలు..

ఈ పది రోజుల ఉత్సవాల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో 13 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపిందని డీజీపీ ఆవేదన వ్యక్తం చేశారు. బందోబస్తు విధుల్లో ఉన్న కొత్తగూడెం ఎస్ఐ వెంకన్న హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోగా, సైబరాబాద్ పరిధిలోని పటాన్‌చెరు వద్ద జరిగిన ప్రమాదంలో ఆరుగురు యువకులు మృతి చెందారు. శుక్రవారం ఉదయం ఖైరతాబాద్ గణేశ్ వద్ద ఒకరు, నిర్మల్‌లో ఊరేగింపు సమయంలో మరొకరు గుండెపోటుతో మరణించారు. డీజేల విపరీతమైన శబ్ద కాలుష్యం కారణంగా కూడా కొందరు ఆరోగ్య సమస్యలు, గుండెపోటు బారిన పడినట్లు డీజీపీ నిర్ధారించారు. వివిధ సంఘటనల్లో రాష్ట్రవ్యాప్తంగా 26 మందికి గాయాలయ్యాయి, అందులో అత్యధికంగా మల్కాజిగిరి పరిధిలోనే 17 మంది గాయపడ్డారని వెల్లడించారు. మొత్తంగా, అన్ని వర్గాల సమన్వయం, పటిష్ఠమైన పోలీసు భద్రతా చర్యలతో గణేశ్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని డీజీపీ తెలిపారు.

బాలాపూర్ లడ్డూకు రికార్డు ధర

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (సింగిడి)

నగరంలోని బాలాపూర్‌లో గణేశుడి లడ్డూ వేలం పూర్తయింది. ఈసారి లడ్డూ రికార్డు ధర పలికింది. వనస్థలిపురంలోని సాహెబ్‌నగర్‌కు చెందిన సామ ప్రణీత్‌రెడ్డి సొంతమైంది. రూ.39లక్షలకు ఆయన దీన్ని సొంతం చేసుకున్నారు. వేలంలో పాల్గొనేందుకు 8 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా.. చివరికి ప్రణీత్‌రెడ్డిని లడ్డూ వరించింది. గతేడాది రూ.35 లక్షలు పలికింది. వినాయక ఉత్సవాల్లో బాలాపూర్‌కి ప్రత్యేక స్థానం ఉంది. స్వామివారికి సమర్పించే లడ్డూ ప్రసాదం ప్రత్యేక గుర్తింపు సాధించింది. నవరాత్రులు పూజలందుకునే స్వామివారి చేతిలోని 21 కిలోల లడ్డూను పొందడం ద్వారా శుభం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. అందుకే వేలంలో దక్కించుకునేందుకు పోటీ పడుతుంటారు.

రూ.450 నుంచి నుంచి రూ.39 లక్షల వరకు..

బాలాపూర్ వినాయకుడికి 45 ఏళ్ల ఘన చరిత ఉంది. లంబోదరుడిపై భక్తులకు ఉన్న విశ్వాసాన్ని ఇనుమడింపజేయాలన్న ఆలోచనతో మొట్టమొదటిసారిగా బాలాపూర్ ఉత్సవ సమితి 1994లో లడ్డూ వేలం నిర్వహించింది. మొదటిసారిగా లడ్డూ ప్రసాదాన్ని రూ.450కు కైవసం చేసుకున్న రైతు కొలను మోహన్‌రెడ్డి.. దాన్ని కుటుంబ సభ్యులు, బంధువులకు పంచి.. మిగతాది పొలాల్లో చల్లారు. భగవంతుడు సుఖసంతోషాలను అందించారనే నమ్మకంతో మరుసటి ఏడాదితో పాటు 1998, 2004, 2008లలోనూ ఆయన పోటీ పడి దక్కించుకున్నారు. లడ్డూ వేలంలో పాల్గొనేందుకు 15 ఏళ్ల పాటు స్థానికులకే అవకాశం కల్పించిన ఉత్సవ సమితి.. ఆ తర్వాత బయట వ్యక్తులనూ అనుమతించింది. అలా 2009లో సరిత అనే మహిళ రూ.5.10 లక్షలకు సొంతం చేసుకున్నారు. ఇప్పటివరకు 31 సార్లు వేలం వేయగా.. 2020లో కరోనా నేపథ్యంలో వేలం వేయకుండా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేశారు. 2024లో కొలను శంకర్‌రెడ్డి రూ.30.01లక్షలకు, గతేడాది లింగాల దశరథ్‌గౌడ్ రూ.35 లక్షలకు దక్కించుకున్నారు.

హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (సింగిడి)

మాజీ ప్రధానమంత్రి, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. నగరంలోని ఐటీ కారిడార్ అయిన గచ్చిబౌలి ఫ్లోర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం (సెప్టెంబరు 26) ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ విగ్రహం కేవలం ఒక స్మారక చిహ్నం కాదని, దేశ నిర్మాణంలో మన్మోహన్ సింగ్ పోషించిన పాత్ర, ఆయన ఆర్థిక దార్శనికత, నిస్వార్థ ప్రజాసేవ, నిరాడంబర నాయకత్వ లక్షణాలను భవిష్యత్ తరాలకు గుర్తుచేసే ఒక శాశ్వత ప్రతీక అని ఆయన అభివర్ణించారు. మన్మోహన్ సింగ్ పేరు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పొన్నం కొనియాడారు. 1991లో ఆర్థిక మంత్రిగా ఆయన ప్రారంభించిన సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు బాటలు వేశాయని గుర్తుచేశారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానమంత్రిగా దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఆర్థిక స్థిరత్వం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన హయాంలోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం వంటివి అమల్లోకి వచ్చాయని తెలిపారు.తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. 2009లో ప్రక్రియ ప్రారంభించాలని నాటి యూపీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం నుంచి 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు కేంద్రంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం చారిత్రాత్మక పాత్ర పోషించిందని ఆయన వివరించారు. రాష్ట్ర ఏర్పాటులో యూపీఏ ప్రభుత్వం, మన్మోహన్ సింగ్ పాత్రను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా గుర్తించిందని ఆయన తెలిపారు.

ఎన్నికల సంఘంలో విభేదాలపై
జగన్ ఆందోళన

ఎన్నికల సంఘం తీసుకున్న పలు నిర్ణయాలు, ఓటర్ల జాబితాల రూపకల్పన, ఈసీఐనెట్ నిర్వహణ వంటి అంశాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న వార్తలు ప్రజల్లో తీవ్రమైన ప్రశ్నలు, సందేహాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణల కంటే.. ఏయే అంశాలపై అభ్యంతరాలు నమోదయ్యాయి, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు, ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపులు, పునరుద్ధరణ ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరిగిందనే దానిపై ప్రజలకు స్పష్టత అవసరమని జగన్ నొక్కిచెప్పారు. ఈ విషయాలపై ప్రజలకు నమ్మకం కలిగించే చర్యలు తక్షణమే చేపట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో, గతంలో తాము కూడా మద్దతు ఇచ్చిన 2023 నాటి ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని జగన్ పేర్కొన్నారు. ఈ భయాలను తొలగించి, సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వమే ముందుకు రావాలని కోరారు. ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)లతో కూడిన త్రిసభ్య కమిటీ ద్వారానే ఎన్నికల కమిషనర్లను నియమించే పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. "పరీక్ష రాసే విద్యార్థే, తన ఎగ్జామినర్ ను నియమించుకుంటే, ఆ అధికారి ఎంత నిజాయతీపరుడైనా ఆరోపణలకు అస్కారం ఉంటుంది. ఆ స్థానంలో ఒక తటస్థ వ్యక్తి ఉంటేనే మేలు" అని జగన్ ఉదహరించారు. ఈ మార్పు ఎన్నికల సంఘంపై ప్రజల గౌరవాన్ని, విశ్వాసాన్ని కచ్చితంగా పునరుద్ధరిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో తమ పార్టీ ఎదుర్కొన్న అనుభవాలను కూడా జగన్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఏపీలో ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియ సమయంలో అధికార పార్టీ తన అధికారాన్ని దుర్వినియోగం చేసిందని, అనేక సందర్భాల్లో తమ విజ్ఞప్తులను పట్టించుకోలేదని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలోనూ డివిజన్ల పునర్విభజన తీరుపై ప్రతిపక్షంగా తాము లేవనెత్తిన అభ్యంతరాలను పక్కన పెట్టేశారని అన్నారు. ఇలాంటి చర్యలు ఎన్నికల ప్రక్రియపై ప్రజా విశ్వాసాన్ని బలహీనపరుస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండటమే కాదు, అవి ఉన్నట్టుగా కనిపించాలని, వాటిని కాపాడటమే రాజ్యాంగ సంస్థల ప్రాథమిక విధి అని జగన్ తన పోస్టులో స్పష్టం చేశారు.

గోదావరిలో వరద పోతుంటే..
బురద రాజకీయాలేనా

ఒకవైపు గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతుంటే, మరోవైపు అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్ రిజర్వాయర్

జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో... విద్యార్థులు రాణించడం అభినందనీయం

సిఆర్‌పిఎఫ్ స్కూల్ ప్రిన్సిపల్ డి. అపర్ణ

జవహర్ నగర్, సెప్టెంబర్ 25 (సింగిడి): జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిఆర్‌పిఎఫ్ విద్యార్థులు రాణించడం అభినందనీయమని చదువుతోపాటు క్రీడల్లో బాలబాలికలు నైపుణ్యం సాధించాలని ప్రిన్సిపాల్ డి. అపర్ణ పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ చంద్రపురి కాలనీ డివిజన్ అరుంధతి నగర్ సిఆర్‌పిఎఫ్ క్యాంపస్ ఆవరణలో గురువారం ప్రిన్సిపాల్ అపర్ణ ఆధ్వర్యం లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ విద్యార్థులు



చిన్నప్పటినుండే మంచి భవిష్యత్తును ఎంచుకొని ముందుకు సాగాలని ఆధునిక కాలంలో ఫోన్లకు స్వస్తి పలుకుతూ క్రీడా మైదానంలోకి అడుగు పెట్టాలని అన్నారు. సిఆర్‌పిఎఫ్ పాఠశాల క్రమశిక్షణకు నిలయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ క్రీడ పాఠశాలలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో 4 బంగారు, 3 వెండి 2 కాంస్య



బహుమతులు స్కూల్ క్రీడా ఫెడరేషన్ లో 2 బంగారు 2 సిల్వర్ ఒక బ్రాంజి బహుమతులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ హరిశంకర్, ఆశాజికుమార్, ఫిజికల్ డైరెక్టర్లు రాజశేఖర్, భాస్కర్ రెడ్డి, మన్మధరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సాధిద్దాం రండి

చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య పిలుపు
బెడిసి కొట్టిన అసమ్మతి వర్గీయుల పన్నాగం



వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 25 (సింగిడి): రాజకీయాలకు అతీతంగా మండలాన్ని అభివృద్ధి చేద్దాం కలిసి రావాలని చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రజా ప్రతినిధులకు పిలుపునిచ్చారు. జిల్లా పరిధిలోని ఎమ్మెల్యే స్వంత మండలం నవాబుపేట మండల సర్వసభ్య సమావేశం ప్రత్యేక అధికారి కవిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కొందరు రాజకీయ పరమైన విషయాలు దృష్టిలో పెట్టుకుని అభివృద్ధిని దూరం చేసుకుంటున్నారని అన్నారు. వారిని ఉద్దేశించి ఆయన ఈ విధంగా అన్నారు. అయితే కొన్ని విషయాలపై సర్వసభ్యసమావేశం వేదికగా ఎమ్మెల్యే ను తికమక పెట్టాలని భావించిన కొందరు సర్పంచ్ లు పన్నిన పన్నా గాన్ని అమలు చేయలేక పోయారు. సభ ఆయా అంశాలపై చర్చ కొనసాగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యేను అడగాలనుకున్న వారు సమావేశం చివరలో ఎమ్మెల్యే ప్రసంగించి సమావేశాన్ని ముగించిన నేపథ్యంలో అసమ్మతి వర్గం ఎమ్మెల్యే ను కదిలించే యత్నం చేయడంతో సమావేశం ముగిసిందని సమాధానమివ్వడంతో నిచ్చేస్తులైయ్యారు. వీరిని ఉద్దేశించి ఎమ్మెల్యే పై విధంగా మాట్లాడారు. కలిసి నడుద్దామని అభివృద్ధికి సహకరించాలని అన్నారు. రాజకీయాలు ఎన్నికల సమ యంలో చూసుకోవాలని పుణ్యకాలాన్ని ఆద్వినియోగం చేసుకోవాలని అన్నా రు. ఈ విషయం తెలుసున్న నిఘా వర్గాలు ముందస్తు చర్యలు తీసుకు న్నారు. పోలీసు అదనపు బాలగాన్ని గమనించిన అసమ్మతి వర్గం ముందుగా సహాసించలేక పోయారు. సమావేశం ముగిశాక నిలదీయాలని యత్నించిన ఫలితం లేకుండా పోయింది. ఇదిలా ఉండగా సర్వభ్యసమావేశంలో ముందుగా వ్యవసాయ శాఖ పై చర్చ జరిగింది. అధికారి జ్యోతి శాఖ పరమైనా వివరాలను వివరించారు. ప్రస్తు తం తెల్లకుసుమ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, శనగలు త్వరలో వస్తా యని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతు భీమా పై, రైతు భరోసా పై ఎమ్మెల్యే అధికారితో చర్చించారు. ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం అందించాలన్నారు. ఫార్మర్‌రిజిస్ట్రేషన్ తోనే రైతులకు ప్రతి ప్రతి ప్రయోజనం ఆధారపడి ఉంటుందని ప్రత్యేక అధికారిగా ఉన్న జిల్లా వ్యవసాయ అధికారి కవిత తెలిపారు. విద్యుత్ సరఫరా పై గుబ్బడిఫత్తేపూర్ సర్పంచ్ సామెల్, కుమ్మరి గూడ సర్పంచ్, శ్రీనివాస్ రెడ్డి లు పలు సమస్యలను శభాదృష్టికి తీసుకువచ్చారు. వాటిని త్వరగా పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే ఏ ఈ కి సూచించారు. విద్యా శాఖ చర్చ నిర్వహిం చారు. ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయుల కొరత, ఉపాధ్యాయుల పనితీరుపై సభ్యులు మాట్లాడారు. సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆరోగ్య శాఖ చర్చలో విద్యాధికారి రోహిత్ ఆసుపత్రి లో నిర్వహించిన వైద్యా సేవలను వివరించారు. పశుసంవర్ధక శాఖ చర్చలో ఎమ్మెల్యే యాదయ్యస్పంది స్తూ పశు సంపద, తదితర మౌళిక సదుపాయాలపై ఆరాదిశారు. శిశు సంక్షేమ శాఖ చర్చలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీ భవనాలు, సిబ్బంది ఆంశాలపై ఆరాదీశారు. ఆయా గ్రామాల్లో అంగన్వాడీ టీచర్స్, ఆయాల ఖాళీలు ఉన్నట్లు సీ డిపివో తెలిపారు. అయితే ఖాళీల వివరాలు, స్వంత భవనం లేని కేంద్రాల వివ రాలు ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. వాటి పరిస్కారం కోసం కృషి చేయను న్నట్లు చెప్పారు. వీబిజి రామ్ జీ పథకం పై ఏ పీ వో లక్ష్మీ వివరించారు. పంచాయతీ రాజ్ శాఖ, మహిళా సమాఖ్య, ఆర్ అండ్ బి శాఖచర్చలో రోడ్ల అంశంపై ఎమ్మెల్యే ఆరాదిశారు. రోడ్ల పనులు వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని ఆయన సూచించారు. ఉద్యానవన శాఖ, ఆటవి శాఖ, నీటి పారుదల శాఖ ఆంశాలో ఆయా గ్రామాల చెరువులపై ఎమ్మెల్యే ఆరాదిశారు. అదేవిధంగా మండలంలో ప్రసిద్ధి శివాలయం ఎల్లకొండ పై ఉన్న పుష్కరిని ని పరిశీలించాలని పూడిక తీయడం తదితర పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ ఏ ఈ కి సూచించారు. రెవిన్యూ శాఖ వివరాలను ఉప తహసీల్దార్ నవీన్ కుమార్ రెడ్డి వివరించారు. సర్ నోటీసులు అందుకున్న వారు త్వరగా సంబంధించిన పత్రాలను జతచేసి ఇవ్వాలని కోరారు. సాంఘిక సంక్షేమ శాఖ వివరాలు వార్డెన్లు వివరించారు. గృహనిర్మాణశాఖ చర్చలో ఇందిరమ్మ ఇళ్ళ ప్రస్థావనను ఎమ్మెల్యే తీసుకొని అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరవుతోందన్నారు. అర్హులైన వారు ఏలాంటి రాజకీయాలకు తావులేకుండా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే చెప్పారు. చేవెళ్ళ క్యాంపు కార్యాలయం వద్ద దరఖాస్తులకోసం ప్రత్యేక బాక్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అర్హులు నిర్భయంగా దరఖాస్తులు ఇవ్వవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో 22 ఆంశాల పై చర్చ జరిపారు. ఈ సామావేశంలో మండల ప్రత్యేక అధికారి కవిత,ఎం పీ డి వో అనురాధ, ఏ ఎం సీ చైర్మన్ గీతాసింగ్, సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు బలవంత్ రెడ్డి, కొండల్ యాదవ్, సర్పంచ్ లు, గ్రామ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 30 నాటికి డిజిటల్ క్రాప్ సర్వే పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ బి.చంద్రారెడ్డి



ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 25 (సింగిడి): వ్యవసాయ రంగానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే, రైతు నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) ప్రక్రియలను సెప్టెంబర్ 30 నాటికి వంద శాతం పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ, సివిల్ సప్లైస్, మీసేవ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమా వేశం నిర్వహించారు. అక్టోబర్ 1వ తేదీ నుండి జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారం భం కానున్నందున గడువులోగా క్రాప్ సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం గుర్తించిన 7 సన్న వరి లోకాలకు మాత్రమే క్వింటాలుకు రూ. 500 బోనస్ లభిస్తుంది. ఇందుకు క్రాప్ సర్వే డేటా అత్యంత కీలకమన్నారు. ప్రభుత్వ రాయితీలు, పథకాలు పొందడానికి మరియు ఎరువుల కొనుగోలు యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవడానికి రైతు నమోదు సంఖ్య, ప్రతి గ్రామంలో మీసేవ, సీఎస్‌సీల ద్వారా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, చాటింపు, ఫ్లెక్సీల ద్వారా రైతన్నలకు విస్తృత ప్రచారం కల్పించాలి. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం.సుజాత, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ ఎస్. స్వర్ణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హరితవనం కాలనీలో 50 లక్షలతో రోడ్డు అభివృద్ధి పనులకు శ్రీకారం

పనులు ప్రారంభించిన కొలను హనుమంత రెడ్డి



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 25 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ హరితవనం కాలనీ కె ఆర్ సి ఆర్ ఆర్కేడ్/హరితవనం కమాన్ వద్ద సిఎంసి నిధుల ద్వారా మంజూరైన 50 లక్షలతో రోడ్డు అభివృద్ధి పనులను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలకు మెరుగైన రహదారులు, అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, మైనారిటీ నాయకులు సయ్యద్ షఫీ, కాలనీ సభ్యులు సందీప్ వర్మ, సురేష్ నాయుడు, శివకృష్ణ, విక్రమ్ రెడ్డి, నవరాజు, నాగరాజు, కోటయ్య నాయక్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగారం సాయి ధరణి కాలనీలో లడ్డు కైవసం చేసుకున్న ఎంబడి ఉమేష్ రేఖ

కీసర, సెప్టెంబర్ 25 (సింగిడి): ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్ పరిధి సాయి ధరణి కాలనీ ఫేస్ వన్లో అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాధుని లడ్డూ వేలం పాట 2,16,000 రూపాయలకు ఎంబడి ఉమేష్ రేఖ దక్కించుకున్నారు. అలాగే చిన్న లడ్డు మాదాసు కుమార్ పద్మ 1,44,000 రూపాయలకు దక్కించుకోవడం జరిగింది. అదేవిధంగా లక్కీడ్రాలో శ్రీకాంత్, లిఖిత అదృష్టం వరించడం జరిగింది. ఈ యొక్క లడ్డు వేలం పాటలో మాజీ కౌన్సిలర్ గూడూరు అంజన్న, కాలనీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ అక్బర్ బాషా, కాలనీ జనరల్ సెక్రెటరీ బిఆర్ఎస్ పార్టీ 16 వార్డ్ ప్రెసిడెంట్ ములుగురు శ్రీనివాస్ గౌడ్, కాలనీ సభ్యులు, మహిళలు, పిల్లలు సాంస్కృతి కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం



చిన్నారులకు మెమొంటోస్ అందించడం జరిగింది.

ఇప్పుడున్న స్థలంలోనే నూతన బస్టేషన్ నిర్మించాలి

ఊరికి దూరమైతే.. ప్రజలకు ఇబ్బందులే!
ప్రభుత్వం నిర్ణయాన్ని పునరాలోచించాలి
సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి గంటి సురేష్‌కుమార్



కొడంగల్, సెప్టెంబర్ 25 (సింగిడి): కొడంగల్ పట్టణంలో నూతనంగా నిర్మించే నూతన బస్టేషన్ ఇప్పుడున్న స్థలంలోనే నిర్మించాలని, ఊరిచివరన బస్టేషన్ నిర్మిస్తే ప్రయాణికులకు, చిరువ్యాపారులకు అంతరాయం ఏర్పడుతుందని సిపిఐ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జీ గంటి సురేష్ కుమార్ అన్నారు. బస్టాండ్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ప్రతిపాదిత స్థలంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని సీపీఐ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంటి సురేష్‌కుమార్ అన్నారు. ప్రస్తుతం ఉన్న బస్టాండ్ ప్రాంతంలోనే కాంప్లెక్స్ నిర్మించి, బస్టాండ్ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని ఆయన సూచించారు. హైదరాబాద్ రూట్‌లో పట్టణానికి చివరన నూతన బస్టాండ్ నిర్మించాలనే ప్రతిపాదన వల్ల ప్రయాణికులతో పాటు స్థానిక ప్రజలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. బస్టాండ్ చుట్టూ ఏర్పడే రాకపోకలే పట్టణంలోని చిన్న వ్యాపారాలు, చిరు వ్యాపారులకు ప్రధాన ఆధారమని తెలిపారు. ప్రస్తుత అంబేద్కర్ చౌరస్తా ప్రాంతంలో ప్రయాణికుల రాకపోకలతో అనేక చిన్న దుకాణాలు, చిరు వ్యాపారాలు కొనసాగుతున్నాయని సురేష్‌కుమార్ అన్నారు. ప్రయాణికులు కొనుగోలు చేయడం ద్వారా కొన్ని కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. బస్టాండ్‌ను పట్టణానికి దూరంగా తరలిస్తే ఆయా వ్యాపారాలకు గిరాకీ తగ్గి ఉపాధి అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. బస్టాండ్ ఒకచోట, పట్టణంలోని ప్రధాన వ్యాపార ప్రాంతాలు మరోచోట ఉంటే ప్రజలు రాకపోకలకు అదనపు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. స్థలం సరిపోవడం లేదనే కారణంతో బస్టాండ్‌ను పట్టణానికి దూరంగా తరలించడం సరైన నిర్ణయం కాదని ఆయన అన్నారు. ప్రస్తుత బస్టాండ్‌కు సమీపంలోనే అందుబాటులో ఉన్న స్థలాన్ని పరిశీలించి నూతన బస్టాండ్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే ముందు ప్రజల అవసరాలు, స్థానిక వ్యాపారుల ఉపాధి, పట్టణ భవిష్యత్ రాకపోకలను దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదిత స్థలాన్ని మరోసారి పరిశీలించాలని గంటి సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు.

తాగునీరు సరఫరా చేసే గోదావరి పైప్‌లైన్లు పగిలి రోడ్ల పాలవుతున్న నీరు

రోజుల తరబడి రోడ్లపై తాగునీరు ప్రవహిస్తున్న పట్టించుకోని జలమండలి అధికారులు.
ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకోవడం అంటే ఇదేనా?



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 25 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం షాపూర్ నగర్ జలమండలి పరిధిలోని గాజులరామారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలోని రొడామేస్త్రి నగర్ సమీపం అపోలో ఫార్మసీకి ఎదురుగా తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్ పగిలి భారీ స్థాయిలో గోదావరి జలాలు రోడ్లపాలవు తున్నాయి. జలమండలి కార్యాలయం కి కూత వేటు దూరంలో ఉన్న పైప్లైన్ పగిలి భారీ స్థాయిలో గృహ అవసరాలకు ఉపయోగపడే గోదావరి జలాలు రోడ్ల వెంట పరుగులు పెడుతున్న పట్టిం చుకున్న నాథుడు కరువడంతో (జలమండలి అధి కారులు) స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 300 కిలోమీటర్ల దూరం నుండి వందల కోట్ల రూపాయల ప్రజాధ నాన్ని వెచ్చించి హైదరాబాద్ పట్టణ వాసుల కోసం తాగునీటి అవసరాలను తీర్చుటకు తీసుకు వచ్చే గోదావరి జలాలు రోజుల తరబడి రోడ్ల పాలవుతున్న పట్టించుకోవడానికి పాలకుల నిర్లక్ష్యం కారణమా, అధికారుల అలసత్వం పుణ్య మా అంటూ స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేసు న్నారు. ఇంటి అవసరాల కోసం సరఫరా చేస్తున్నా రు గోదావరి జలాలు గృహ వసరాలకు సరిపోవ డం లేదు, మరో 15 నిమిషాలు పెంచమని స్థానిక ప్రజలు అధికారులను ప్రాధేయపడినా కనికరిం చని జలమండలి అధికారులు రోజుల తరబడి గోదావరి జలాలు రోడ్లపై పారుతున్న నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరించడ వారి విధులకు నిదర్శనమని అధికారుల తీరును తప్పు పడుతు న్నారు. ఈ సంవత్సరము అరకొర వర్షాల కారణం గా ప్రాజెక్టులు, చెరువులలో సరి అయిన నీరు చేరకపోవడంతో నీటి కటకట ప్రారంభమయ్యే పరిస్థితి దాపురించిందని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి కరువు పరిస్థితు లలో సైతం ఎంతో విలువైన గోదావరి జలాలను పైపులు పగిలిపోయి రోడ్లపై పారుతున్న పగిలిన పైపులైన్లకు మరమ్మత్తులు చేపట్టి నీటి దుర్వినియోగాన్ని నివారించడంలో జలమండలి అధికారులు పూర్తిగా వైఫల్యం పొందారని అధికారుల తీరును తప్పుబడుతున్నారు. గృహాలకు సరఫరా చేసే గోదావరి జలాలు దుర్వినియోగం చేస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన శిక్షలు అమలు చేస్తామని హెచ్చరిస్తున్న జలమండలి అధికారుల హెచ్చరికలను ప్రభుత్వం ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టుకోవాలి, నీరు వృధా కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రులు ఆదే శాలు జారీ చేస్తున్న జలమండలి అధికారులు నిర్ల క్ష్యం వహించడంలో ఆంతర్యమేమిటి అని ప్రశ్నిస్తున్నారు. గోదావరి జిల్లాల సరఫరా చేసే పైపులు పగిలి నీరు రోడ్లపై పారుతున్న వాటి మం మ్మతులు చేపట్టడంలో, నీటి వృధాను అరికట్ట డంలో అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయ లోపమా! నిర్లక్ష్యమా? అంతు చిక్కుడం లేదని ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారు లు అప్రమత్తంగా ఉంటూ నీటిని సరఫరా చేసే పైపులైన్లు ఎక్కడ పగిలిపోయిన సత్వరమే చర్యలు తీసుకొని నీటి వృధాను వెంటనే అరికట్టేలా చర్యలు తీసుకోవాలని, లేనిచో జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు.

మణికొండ కేపీఆర్ కాలనీలో ఘనంగా గణేష్ లడ్డూ వేలం

6,15,116లకు దక్కించుకున్న గుంటూరు మల్లికార్జున్



రాజేంద్రనగర్, సెప్టెంబర్ 25 (సింగిడి): కేపీఆర్ కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన గణేష్ నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ముగి శాయి. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్వామివారి విశిష్ట లడ్డూ వేలం పాట స్థానికుల్లో తీవ్ర ఆసక్తిని, ఉత్సాహాన్ని నింపింది. పోటీపడి మరీ వేలంలో పాల్గొన్న భక్తుల నడుమ కేపీఆర్ కాలనీకి చెందిన గుంటూరు మల్లికార్జున్ రూ. 6,15,116 ల కు పలికి స్వామివారి ప్రసాదాన్ని దక్కించుకున్నా రు. లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకోవడం తన పూర్వజన్మ సుకృతమని, స్వామివారి ఆశీస్సులతో తమ కుటుంబానికి, కాలనీవాసులకు సకల శు భాలు కలుగుతాయని ఈ సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేశారు. లడ్డూను దక్కించుకున్న గుంటూరు మల్లికార్జున్ కాలనీ ప్రెసిడెంట్ ఈ. గంగాధర్ రావు, అసోసియేషన్ సభ్యులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్ . గంగాధర్ రావు మాట్లాడుతూ... "ప్రతి ఏటా మన కేపీఆర్ కాలనీలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను కాలనీవాసులందరి సహకారంతో ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నాం. ఈసారి లడ్డూ వేలం పాటకు విశేష స్పందన రావడం చాలా సంతోషక రం. ఈ వేలం ద్వారా వచ్చిన నిధులను కాలనీ అభివృద్ధికి, ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తాం" అని పేర్కొన్నారు.

ప్రాథమిక పరిశోధనను ప్రజోపయోగంగా మార్చాలి

గీతం ఆతిథ్య ఉపన్యాసంలో శాస్త్రవేత్త డాక్టర్ బిపిన్ కుమార్ గుప్తా



పటాన్చెరు, సెప్టెంబర్ 25 (సింగిడి): ప్రాథమిక పరిశోధనను ప్రజోపయోగంగా మార్చాలిన ఆవశ్య కత ఎంతైనా ఉందని, పరిశోధన, అభివృద్ధి, ఆవిష్క రణల మధ్య సంబంధాన్ని బలోపేతం చేయాలని న్యూఢిల్లీలోని సీఐఎస్ఆర్–జాతీయ భౌతిక శాస్త్ర ప్రయోగశాల శాస్త్రవేత్త డాక్టర్ బిపిన్ కుమార్ గుప్తా అన్నారు. శాస్త్రీయ జిజ్ఞాసను పెంపొందించుకో వాలని, లక్ష్యాలను పట్టుదలతో సాధించాలని, భారతదేశ సాంకేతిక స్వావలంబనను బలోపేతం చేయగల స్వదేశీ సాంకేతికతల అభివృద్ధికి దోహ దపడాలని విద్యార్థులను ప్రోత్సహించారు. హైదరా బాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఆత్మని ర్భర్ భారత్ కోసం కొత్తగా అభివృద్ధి చెందుతున్న నానో/క్వాంటం పదార్థాల రూపకల్పన, ఆవిష్కరణ, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి అనే అంశంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశా రు. సెమీకండక్టర్, క్వాంటం సాంకేతికతల కేంద్రం సహకారంతో, స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని ఈఈసీఈ విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ంది. డాక్టర్ గుప్తా విద్యార్థులకు నానోపదార్థాలు, అభివృద్ధి చెందుతున్న టుడీ (ద్విమితీయ) పదార్థాలు, క్వాంటం పదార్థాలను ప్రాథమికంగా పరిచయం చేస్తూ, వాటి పరిమాణంపై ఆధారపడిన లక్షణాలు, సంభావ్య అనువర్తనాలను వివరిం చారు. క్వాంటం పదార్థాల పరిశోధన పరిణామ క్రమాన్ని ఆయన వివరిస్తూ, నానో/క్వాంటం సాంకేతికతలలోని పురోగతులు ఆరోగ్య సంరక్షణ, బయోమెడికల్ ఇమేజింగ్, ఫార్మాస్యూటికల్స్, కమ్యూనికేషన్స్, ప్రజాభద్రత, నకిలీ నిరోధక సాంకే తికతలకు ఎలా దోహదపడతాయో వివరించారు. స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రశాంతరెడ్డి ముడిమాల, అతిథికి స్వాగతం పలికి, విద్యార్థులకు ఆయనను పరిచయం చేసి, సత్క రించారు. ఈఈసీఈ విభాగానికి చెందిన డాక్టర్ శాంతను సాహా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

గీతంలో పరిశ్రమ–ఆధారిత అభ్యాసం

డేటా సైన్స్ ఆచరణాత్మక శిక్షణపై రెండు రోజుల కార్యశాల ప్రారంభం హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం, డేటా సైన్స్ ఆచరణాత్మకం గా వినియోగించడంపై దృష్టి సారించి, విద్యార్థు లకు పరిశ్రమ–ఆధారిత అభ్యాస అనుభవాన్ని అందించేందుకు గాను 'డేటా సైన్స్: ఆచరణాత్మక శిక్షణ' పేరిట రెండు రోజుల కార్య శాలకు గురు వారం శ్రీకారం చుట్టింది. డేటా సైన్స్ సాధనాలు, డేటా విశ్లేషణ, ప్రీప్రాసెసింగ్, మెషిన్ లెర్నింగ్, టాబ్లో ఉపయోగించి డేటా విజువలైజేషన్, వాస్తవ ప్రపంచ కేస్ స్టడీస్, పరిశ్రమ అను వర్తనాలపై ఆచరణాత్మక అనుభవాన్ని అందించడం ద్వారా, విద్యాపరమైన అభ్యాసానికి, పరిశ్రమ పద్ధతులకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చేలా ఈ కార్యశాలను రూపొందించారు. హబ్ల్ ముఖ్య కార్యనిర్వహణా ధికారి, వ్యవస్థాపకుడు, ఏఐస్ సాఫ్ట్ టెక్ యొక్క టెక్ లీడ్, టాబ్లో రాయబారి దేవాంశు తాయల్ ప్రధాన శిక్షకుడిగా వ్యవహరించి, ఆచరణాత్మక సెషన్లు, పరిశ్రమ–కేంద్రీకృత అంత ర్దృష్టుల ద్వారా విద్యా ర్థులను నిమగ్నం చేశారు. బి.టెక్. మూడవ, నాల్గవ ఏడాది, ఎం.టెక్. విద్యా ర్థులు ఈ కార్యశాలలో చురుకుగా పాల్గొంటూ, డేటాను అర్థవంతమైన అంతర్దృష్టులుగా, ప్రభా వంగా మారుస్తూ, నేర్చుకో వడానికి, అన్వేషిం చడానికి, విశ్లేషించడానికి, దృశ్య మానం చేయడాని కి, ఆవిష్కరించడానికి ఒక అవకాశాన్ని పొందారు. సీఎస్ఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ మహబూబ్ షేక్ బాషా ప్రారంభోత్సవ కార్యక్రమానికి సభాధ్య క్షత వహించారు. కార్య క్రమ నిర్వాహకురాలు ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్, ప్రధాన శిక్షకుడిని ఆహ్వానించి, విద్యార్థులకు పరి చయం చేశారు. జ్యోతి బంకపల్లి, డాక్టర్ యు. శ్రీని వాస్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

బాధితులకు పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలి
రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య



సంగారెడ్డి బ్యూరో , సెప్టెంబర్ 25 (సింగిడి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య జిల్లా

ఎడిటోరియల్

Editorial

ప్రపంచ సంక్షోభాల మధ్య భారత్..

ఆర్థిక స్వావలంబనకు ఇదే పరీక్షా సమయం
యుద్ధం ఎక్కడ జరిగినా ప్రభావం మన వంటింటి వరకు వస్తుందా?

ప్రపంచ మార్కెట్‌లో ముడిచమురు ధర పెరిగితే సామాన్యుడి జీవితంపై దాని ప్రభావం ఎంత? వాతావరణ మార్పులు వ్యవసాయాన్ని దెబ్బతీస్తే దేశ ఆర్థిక వ్యవస్థను ఎలా కాపాడాలి?
ఇవి ఇప్పుడు కేవలం ఆర్థికవేత్తల చర్చలుగా మిగలడం లేదు. ప్రపంచ పరిణామాలు నేరుగా భారత ఆర్థిక వ్యవస్థను, రైతును, వినియోగదారుడిని, మధ్యతరగతిని ప్రభావితం చేస్తున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ముడిచమురు ధరలు పెరగడం, అంతర్జాతీయంగా వడ్డీ రేట్లపై అనిశ్చితి కొనసాగడం భారత మార్కెట్లపై ఒత్తిడిని పెంచుతున్నాయి. సెప్టెంబర్ 24న రూపాయి డాలర్‌తో పోలిస్తే 95. 96 వద్ద ముగియగా, 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ ఈల్డ్ 7. 11 శాతానికి చేరింది. మార్కెట్లపై ముడిచమురు, ద్రవ్యోల్బణ భయాలు, అంతర్జాతీయ పరిణామాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే భారత్ ముందున్న సవాలు కేవలం చమురు ధరలతో ముగియదు.

వాతావరణం మరో పెద్ద సవాలు

2026 రుతుపవనాలపై ఇప్పటికే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉండవచ్చన్న అంచనాలు వ్యవసాయ ఉత్పత్తి, ఆహార ధరలు, గ్రామీణ ఆదాయాలపై ప్రశ్నలు లేవనెత్తాయి.
రైతుకు వర్షం అంటే కేవలం వాతావరణం కాదు---అది పెట్టుబడి, పంట, ఆదాయం, అప్పు, కుటుంబ భవిష్యత్తు అన్నీ.
అందుకే భవిష్యత్తు వ్యవసాయం కేవలం "ఎంత వర్షం పడింది?" అనే ప్రశ్నతో కాకుండా ఎంత నీటిని నిల్వ చేసుకున్నాం? ఎంత సమర్థవంతంగా వినియోగించాం? పంటల వైవిధ్యం ఎంత పెంచాం? మార్కెట్ ప్రమాదాలను ఎలా తగ్గించాం? అనే ప్రశ్నలతో చూడాలి.

స్వావలంబన అంటే ప్రపంచం నుంచి దూరం కావడం కాదు

ప్రపంచ దేశాలతో వాణిజ్యం చేయకుండా భారత్ స్వయం సమృద్ధి సాధించలేదు. అసలు స్వావలంబన అంటే ప్రపంచంతో సంబంధాలు తెంచుకోవడం కాదు; అవసరమైన సమయంలో ఇతర దేశాలపై అతిగా ఆధారపడకుండా దేశీయ సామర్థ్యాలను పెంచుకోవడం.
సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, రక్షణ ఉత్పత్తులు, ఇంధన రంగం, ఔషధాలు, ఆహార భద్రత వంటి వ్యూహాత్మక రంగాల్లో దేశీయ ఉత్పత్తి సామర్థ్యం పెంచుకోవడం అందుకే కీలకం. ప్రపంచ సరఫరా గొలుసుల్లో అంతరాయాలు పెరుగుతున్న నేపథ్యంలో భారత్ వ్యూహాత్మక రంగాల్లో స్వదేశీ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని ఆర్థిక వ్యవహారాల శాఖ కూడా ప్రస్తావించింది.
రైతు బలపడితేనే ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది
దేశ ఆర్థిక వృద్ధి గణాంకాలు ఎంత ఆకర్షణీయంగా ఉన్నా గ్రామీణ కుటుంబ ఆదాయం పెరగకపోతే ఆ వృద్ధి పూర్తి అర్థాన్ని పొందదు.
రైతుకు విత్తనం నుంచి మార్కెట్ వరకు భద్రత అవసరం. నీటి నిర్వహణ, నిల్వ సదుపాయాలు, కోల్డ్‌చెయిన్లు, ప్రాసెసింగ్ యూనిట్లు, మార్కెట్ సమాచారం, పంటల బీమా, ఆధునిక సాంకేతికత---ఇవి అన్నీ వ్యవసాయాన్ని వాతావరణ ప్రమాదాల నుంచి కొంతవరకు రక్షించగలవు.

ఇక గ్రామీణ ప్రాంతాల్లో చిన్న పరిశ్రమలు, ఆహార ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులు పెరిగితే రైతు పంట అమ్మే వ్యక్తి నుంచి విలువ సృష్టించే భాగస్వామిగా మారే అవకాశం ఉంటుంది.

ూ× నుంచి ఉపాధి వరకు మరో మార్పు

ఇదే సమయంలో కృత్రిమ మేధస్సు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త అవకాశాలతో పాటు కొత్త ప్రశ్నలను కూడా తెస్తోంది. ప్రభుత్వ గణాంక వ్యవస్థల్లో కూడా ూ× ఆధారిత విశ్లేషణలు విశ్వసనీయమైన, ధృవీకరించిన డేటాపైనే ఆధారపడాలని నిపుణులు సూచిస్తున్నారు. AI ఉద్యోగాలను పూర్తిగా భర్తీ చేస్తుందా అనే భయం కంటే,ూ×ని ఉపయోగించగల నైపుణ్యాలు కలిగిన ఉద్యోగులు ఎంతమంది తయారవుతారు? అనేదే మరింత ముఖ్యమైన ప్రశ్న.
భారత్‌కు యువ జనాభా ఒక గొప్ప అవకాశం. కానీ నైపుణ్యాలు లేకపోతే అదే జనాభా అవకాశంగా కాకుండా సవాలుగా మారవచ్చు.

ముందున్న అసలు పరీక్ష

ప్రపంచంలో ఒకేసారి అనేక సంక్షోభాలు చోటుచేసుకుంటున్నాయి..యుద్ధాలు, ఇంధన ధరలు, వాణిజ్య ఉద్రిక్తతలు, వాతావరణ మార్పులు, సరఫరా గొలుసుల సమస్యలు, సాంకేతిక పరివర్తన.
ఆసియా అభివృద్ధి బ్యాంకు తాజా అంచనా ప్రకారం 2026లో అభివృద్ధి చెందుతున్న ఆసియా-పసిఫిక్ ప్రాంత వృద్ధి 5 శాతంగా ఉండవచ్చని అంచనా వేసింది. అదే సమయంలో పశ్చిమాసియా ఘర్షణలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇంధన ధరల అస్థిరత, బలమైన ఎల్‌నినో వంటి అంశాలు ఆర్థిక వ్యవస్థలకు ప్రమాదాలను పెంచుతున్నాయని పేర్కొంది.
ఇలాంటి పరిస్థితుల్లో భారత్ ముందున్న మార్గం స్పష్టంగా కనిపిస్తోంది.

ఇంధన భద్రత పెరగాలి.

వ్యవసాయం వాతావరణ ప్రతికూలతలకు తట్టుకునేలా మారాలి. దేశీయ తయారీ బలపడాలి. యువతకు నైపుణ్యాలు పెరగాలి. సాంకేతికతను బాధ్యతాయుతంగా ఉపయోగించాలి.
ప్రపంచ వాణిజ్యంలో భాగస్వామ్యాన్ని కొనసాగిస్తూనే వ్యూహాత్మక రంగాల్లో ఆధారపడే పరిస్థితిని తగ్గించాలి. ప్రపంచం మారుతున్న వేగం గతంలో ఎన్నడూ లేనంత ఎక్కువగా ఉంది. ఒక దేశం తన భవిష్యత్తును కేవలం ఇతర దేశాల నిర్ణయాలపై ఆధారపెట్టుకోలేని కాలం ఇది. అందుకే భారత్‌కు అసలు స్వావలంబన అంటే గోడలు కట్టుకోవడం కాదు...ప్రపంచంతో కలిసి నడుస్తూనే, అవసరమైనప్పుడు తన కాళ్లపై తాను నిలబడగల ఆర్థిక బలం సాధించడం.
అదే రాబోయే దశాబ్దంలో భారత ఆర్థిక ప్రయాణానికి అసలైన పరీక్ష.

-ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440287170.

మానవతావాది చిలకమర్తి లక్ష్మినరసింహం

సంఘ సంస్కర్త చిలకమర్తి జయంతి

సాధారణంగా పుస్తకాలలో చదవడం కన్నా, దృశ్య శ్రవణ రూపంలో చూపిస్తే, వినిపిస్తే, అవలీలగా అందరికీ చేరి, ఎప్పటికీ గుర్తుండి పోతుంది. ఈ విషయాన్ని ఎప్పుడో గ్రహించిన పూర్వీకులు ప్రయోగాత్మకంగా చేసి సఫలీ కృతులైనారు. నాటి నాటకాలు, వీధి భాగోతాలు, హరికథలు, బుర్రకథలు, ముఖ్యంగా మన పౌరాణికాలు, ప్రబంధాలు సామాన్య ప్రజలకు అతి సులువుగా అర్థమయ్యేటట్లు చేశారు. అలాంటి ప్రజానాడి తెలిసి తదనుగుణంగా సామెతలు, నుడికారాలు, లోకోక్తులను, జాతీ యాలను తన నాటక రచనలలో చొప్పించి, ఆయా పాత్రల ద్వారా సగటు ప్రేక్షకునికి ఎంతో అనుభూతిని అందచేసిన మహా రచయిత, మానవతా వాది, దాదాపు పాతిక వరకు నాటకాలను సృష్టించిన సంఘ సంస్కర్త, జాతీయ, అంతర్జాతీయ సాహితీ పండితుల మన్ననలను పొందిన మహనీయుడు చిలకమర్తి. చిలకమర్తి లక్ష్మీనరసింహం (సెప్టెంబరు 26, 1867 - జూన్ 17, 1946) కవి, రచయిత, నాటక కర్త, పాత్రికేయుడు, సంఘ సంస్కరణ వాది, విద్వాంసుడు. 19వ శతాబ్దం చివర, 20వ శతాబ్దం ఆరంభ కాలంలో తెలుగు సాహిత్యం అభివృద్ధికి, తెలుగు నాట ఆధునిక భావాల వికాసానికి పట్టుకొమ్మలైన వారిలో చిలకమర్తి ఒకరు. మహాకవి, కళాప్రపూర్ణ ఆయన బిరుదులు. ఇరవై రెండేళ్ళ వయస్సప్పుడు ఆయన రచించిన "గయోపాఖ్యానం" అనే నాటకం "ప్రతులు లక్ష"కి పైబడి అమ్ముడు పోవట మనేది తెలుగు సాహిత్య చరిత్రలో అరుదైన విషయం. లక్ష్మీ నరసింహం 1867 సెప్టెంబర్ 26 న పశ్చిమ గోదావరి జిల్లా, పెరవలి మండలము లోని ఖండవల్లి గ్రామములో ఒక బ్రాహ్మణ కుటుంబములో వెంకయ్య, రత్నమ్మ దంపతులకు జన్మించారు. ఆయన ప్రాథమిక విద్య వీరవాసరం, నరసాపురం పట్టణాలలో సాగింది. 1889లో రాజమండ్రి హైస్కూలులో పట్టం చేత పట్టుకొన్నారు. 1889 లో రాజమండ్రి ఆర్య పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా చేరారు. తరువాత ఇన్నీసు పేట స్కూలు లోనూ, మునిసిపల్ హైస్కూలు లోనూ విద్యాబోధన సాగించారు. తరువాత ఒక సంవత్సరం "సరస్వతి పత్రిక" సంపాదకునిగా పని చేశారు. ఆపై ఉద్యోగం విరమించి 1899లో హిందూ లోయర్ సెకండరీ స్కూల్ స్థాపించి 9 సంవత్సరాలు నడిపారు. తరువాత ఆ పాఠశాల వీరేశలింగం ఉన్నత పాఠశాలగా మార్చు బడింది. పాఠశాలలో ఉన్నపుడే పద్యాలు వ్రాయడం ప్రారంభించిన లక్ష్మీ నరసింహం ఎన్నో రచనలు చేశారు. "కీచక వధ" ఆయన మొదటి నాటకం. తరువాత ద్రౌపదీ పరిణయం, గయోపాఖ్యానం, శ్రీరామ జననం, సీతా కళ్యాణం, పారిజాతాపహరణం వంటి నాటికలు రచించారు. గయోపాఖ్యానం నాటకంలో "టంగుటూరి ప్రకాశం పంతులు అర్జునుడి వేషం" వేసేవారు. ఆయన వ్రాసిన నవలలలో రామచంద్ర విజయం, హేమలత, అహల్యాబాయి, సుధా శరచ్చంద్రము ముఖ్యమైనవి. సరస్వతి పత్రిక సంపాదకునిగా ఉన్నపుడు సౌందర్య తిలక, పార్వతీ పరిణయం వ్రాశారు. ఇంకా అనేక రచనలు చేశాడు.అటు తెనుగు సాహిత్య, నాటక రంగాలకు, ఇటు సంఘ సంస్కరణోద్యమానికి మహోన్నత సేవలను అందించిన అపూర్వ వ్యక్తి కళా ప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీ నరసింహం. వీరు రచించిన "గయోపాఖ్యానం" నాటక పద్యాలు, "వందేళ్ళ" నుండి తెలుగు వారి నోట వినిపిస్తూ ఉన్నాయి. నాటక సమాజం ఉన్న ప్రతీ ఊరులోనూ ఈ నాటకాన్ని ప్రదర్శించారు. 1943 నాటికి లక్ష ప్రతులు (కాపీలు) అమ్ముడు పోయినాయి అంటే అది ఎంత గొప్ప రచనో చెప్పకనే తెలుస్తోంది.



1908లో ఒక ప్రెస్ స్థాపించారు. 1916 లో మనోరమ, పత్రిక అనే పత్రిక స్థాపించారు. దీని ద్వారా గణపతి, రాజరత్నము, రఘుకుల చరిత్ర (కాళిదాసు రచన రఘు వంశానికి అనువాదం), సిద్ధార్థ చరిత్ర వంటివి ప్రచురించారు. 21 అధ్యాయాల్లో రాసిన స్వీయ చరిత్రములో, ఆయన జీవిత కృషి మొత్తం వివరించ బడింది. బాల్యం, నర్సాపురంలో చదువు, రాజమండ్రిలో విద్యాభ్యాసం, ఉద్యోగం. గ్రంథరచన, నాటక సమాజం, వివాహం, మండల సభల్లో పాల్గొనడం, రామమోహన పాఠశాల ఏర్పాటు, నిర్వహణ, ఉన్నత పాఠశాల ప్రారంభం, కుటుంబ సమస్యలు, కష్టాలు, టంగుటూరి ప్రకాశం ఇంగ్లండ్ యాత్ర, హితకారిణి సమాజ స్థాపన, అచ్చు యంత్రాన్ని నెలకొల్పడం, భారత జాతీయ కాంగ్రెస్ సభకు హాజరవడం, పత్రికా సంపాదకత్వం, నిర్వహణ -- యివన్నీ సవివరంగా రాశారు. చిలకమర్తి ఏకసంధాగ్రాహి మాత్రమే కాదు, అద్భుతమైన జ్ఞాపక శక్తి కలిగి, స్వీయ చరిత్రలో, తన జీవిత కాలంలో జరిగిన ఘటనలను, సూక్ష్మాంశాలతో సహా చిత్రించారు. చారిత్రక ఘటనలను సమతూకం తోనూ, వ్యక్తుల గూర్చి రాస్తున్నప్పుడు రాగద్వేషాల కతీతంగా, స్పష్టంగా, క్లుప్తంగా రాశాడు. నిత్యనైమిత్తకాల గూర్చి రాస్తున్నా, వాటినొక అంతర్ దృష్టితో పరికించారు. లక్ష్మీ నరసింహం మొదటి తరం సంఘ సంస్కర్త. 1909 లో సామాజికంగా వెనుక బడిన వర్గాలకోసం ఒక పాఠశాల (రామమోహన పాఠశాల) స్థాపించారు. నిమ్న జాతుల వారి గురించి ప్రత్యేకంగా ఒక పాఠశాలను స్థాపించిన ఘనత ఆంధ్ర దేశంలో చిలకమర్తి వారికి దక్కుతుంది. ఎందుకంటే అంతకు మునుపు ప్రభుత్వంచే నడుప బడుతున్న ఒకటి రెండు పాఠశాలలు తప్ప దళితుల కోసం ప్రత్యేకమైన పాఠశాలలను ఎవరూ స్థాపించ లేదు. కేవలం తన పుస్తకాల నుండి వచ్చిన రాబడితోనే, తన స్వంత ధనంతో ఆ రామమోహన పాఠశాలను 13 సంవత్సరాలు నడిపి హైయ్యర్ ఎలిమెంటరీ స్కూల్ గా చేసారు.
బ్రహ్మసమాజం, హితకారిణీ సమాజం వంటి సంస్కరణ దృక్పథం గల సంఘాల కార్య కలాపాలలో పాలు పంచుకొన్నారు. దేశమాత అనే వారపత్రిక ద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వ్యాసాలు వ్రాశారు. గాంధీజీ భారత రాజకీయ పటంలోకి రాక మునుపే హరిజన బాలులకు చదువు చెప్పేందుకు " రాజారామోహన రాయి పాఠశాలను " నడిపించి తనలో నిక్షిప్తమై ఉన్న సంస్కరణా భిమానాన్ని చాటి చెప్పారు. ఇన్ని సుగుణాల సమాహారం మన చిలకమర్తి లక్ష్మీనరసింహం. తనకు మార్గదర్శకుడైన వీరేశలింగం పంతులు గారితో కలసి, రాజమహేంద్ర వరంలో హితకారిణీ సంస్థ నడిపించారు. కనుచూపు కోల్పోయినా, పరిస్థితులకు ఎదురొడ్డి నిలచి, పోరాడి, జీవితాంతం తెలుగు సాహిత్య నాటక రంగాలకు, సాంఘిక సంస్కరణలకు తన జీవిత కాలం ధారపోశారు. ఓ సుప్రసిద్ధ నాటక కర్తగా, హాస్య రచయితగా, పద్య, గద్య రత్నాకరుడిగా, నవలా రచయితగా తన రచనలతో సామాజిక ప్రయోజనాన్ని ఆశించి సాధించారు. "గురజాడ వారి కన్యాశుల్కం, వేదం వారి ప్రతాప రుద్రీయం, శ్రీపాద గారి బొబ్బిలి యుద్ధం, చిలకమర్తి వారి గయోపాఖ్యానం" తెలుగు నాటక మణి రత్నాలు. అనేక తెలుగు పద్య, గద్య రచనలు కావించారు చిలకమర్తి. వీటిలో అత్యధికాదరణలు పొందినవి 'గయోపాఖ్యానం', 'గణపతి'.
1943లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనను కళాప్రపూర్ణ పురస్కారంతో సత్కరించింది.
1946, జూన్ 17న లక్ష్మీనరసింహం మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

పెట్రోల్ బంకు నుంచి సూర్యుడి దాకా!

సోలార్-ఈవీతో ఇంధన ఖర్చుకు కొత్త దారి..

కప్పుడు వాహనంలో పెట్రోల్ పోయించుకోవాలంటే "పెట్రోల్ బంకు ఎక్కడుంది?" అని అడిగేవాళ్లం. కాలం మారేకొద్దీ ఎల్‌పీజీ, సీఎన్‌జీ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలు రవాణాలోకి వచ్చాయి. దీంతో అవసరాన్ని బట్టి ఎల్‌పీజీ, సీఎన్‌జీ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ ఎక్కడుంది? అని వెతికే పరిస్థితి వచ్చింది. ఇప్పుడు విద్యుత్ వాహనాల కాలంలో "ఛార్జింగ్ స్టేషన్ ఎక్కడుంది?" అని అడుగుతున్నాం. తరం మారింది. వాహనం మారింది. ఇంధనం మారుతోంది. సాంకేతికత పరుగులు పెడుతోంది. మరి మన ఆలోచన కూడా మరో అడుగు ముందుకు వేయాల్సిన సమయం రాలేదా? అసలు ప్రశ్న ఛార్జింగ్ కేంద్రం ఎక్కడుందన్నది మాత్రమే కాదు.. వాహనానికి అవసరమైన విద్యుత్తును మనమే ఎంతవరకు ఉత్పత్తి చేసుకోగలం? అన్నదే.

పెట్రోల్, డీజిల్ కోసం చెల్లించే డబ్బులో గణనీయమైన భాగం దిగుమతుల రూపంలో దేశ సరిహద్దులు దాటుతుంది. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ముడిచమురు వినియోగదారు. వార్షిక ముడిచమురు దిగుమతి బిల్లు దాదాపు 144 బిలియన్ డాలర్లు, అంటే సుమారు రూ. 13 లక్షల కోట్లు. అంతర్జాతీయ ధరలు, సరఫరా అంతరాయాలు, భౌగోళిక రాజకీయ పరిణామాలు మారినప్పుడల్లా దిగుమతులపై ఆధారపడే దేశాలకు ప్రభావం తప్పదు.

అందుకే విద్యుత్ వాహనాల వైపు మారడం ఒక దశ మాత్రమే. ఆ విద్యుత్తు ఎక్కడి నుంచి వస్తోంది? అన్నదే తదుపరి ప్రశ్న. బొగ్గు, గ్యాస్ తదితర వనరులతో ఉత్పత్తి చేసిన విద్యుత్తుతో ఈవీని నడపడం ఒక మార్పు. అదే విద్యుత్తులో పెరుగుతున్న భాగాన్ని సూర్యుడి నుంచి పొందగలిగితే మరో మెట్టు. ఇంటి పైకప్పుపై సౌర విద్యుత్ ప్యానెళ్లు, ఇంటి వద్ద ఈవీ ఛార్జర్, అవసరమైతే బ్యాటరీ నిల్వ, స్మార్ట్ మీటర్--ఇవన్నీ ఒకే వ్యవస్థగా పనిచేసే రోజులు దూరంలో లేవు. ఇప్పటికే ఆ దిశలో పునాది పడుతోంది. 2026 ఆగస్టు 12 నాటికి 'పీఎం సూర్య ఘర్' పథకం కింద 51.58 లక్షల కుటుంబాలు రూఫ్‌టాప్ సోలార్ ద్వారా లబ్ధి పొందుతున్నాయి. 14.8 గిగావాట్ల సామర్థ్యం ఏర్పాటు కాగా, దాదాపు 19 లక్షల కుటుంబాలకు సున్నా విద్యుత్ బిల్లులు వస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

మరోవైపు ఈవీ రంగం కూడా వేగంగా విస్తరిస్తోంది. అంతర్జాతీయ ఇంధన సంస్థ 'ఐఈఏ' ప్రకారం 2025లో ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలు 2 కోట్లను దాటాయి. కొత్తగా అమ్ముడైన ప్రతి నాలుగు కార్లలో ఒకటి ఎలక్ట్రిక్ కారు. ఈ వాహనాల వినియోగం 2025లో రోజుకు సుమారు 12 లక్షల బ్యారెళ్ల చమురు అవసరాన్ని భర్తీ చేసినట్లు ఐఈఏ అంచనా వేసింది. భారత్‌లో 2025లో ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలు 75 శాతం పెరిగి 1.65 లక్షలకు చేరాయి. మొత్తం కార్ల విక్రయాల్లో వాటా దాదాపు నాలుగు శాతం. వీటిలో సుమారు 60 శాతం దేశీయంగా టాటా, మహీంద్రా సంస్థలు తయారు చేసినవేనని ఐఈఏ పేర్కొంది. పీఎం ఈ--డ్రైవ్ పథకం కింద 2026 జూలై 22 నాటికి 23,22,878 ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహకాలు అందించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ప్రజా ఈవీ ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు రూ. 2,000 కోట్లు కేటాయించగా, 6,562 ఛార్జర్ల ఏర్పాటుకు రూ. 689 కోట్లు ఆమోదించింది.

ఇక్కడే తదుపరి ఆలోచన మొదలవ్వాలి. పెట్రోల్ బంకు నుంచి ఛార్జింగ్ కేంద్రానికి వచ్చాం. ఇక ఛార్జింగ్ కేంద్రం నుంచి సూర్యుడి దాకా వెళ్లాలి. ప్రతి ఈవీపై తప్పనిసరిగా సౌర ప్యానెళ్లు అమర్చాలన్నది ఆలోచన కాదు. వాహనం కదులుతూనే సూర్యకాంతితో విద్యుత్తు ఉత్పత్తి చేసుకునే సాంకేతికతపై పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే వాహనం పైకప్పుపై పరిమిత స్థలం, ప్యానెళ్ల బరువు, ఉష్ణోగ్రత, దుమ్ము, వర్షాలు, నీడ, తయారీ వ్యయం వంటి సవాళ్లు ఉన్నాయి. అందుకే ప్రయోగశాల ఫలితాలను వెంటనే సామూహిక వినియోగానికి సిద్ధమైన సాంకేతికతగా చూడకుండా, భారత వాతావరణ పరిస్థితుల్లో దీర్ఘకాలిక పరీక్షలు, ఖర్చు--ప్రయోజన విశ్లేషణ, మన్నిక పరీక్షలు జరపాలి. వాహనం మీద ప్యానెల్ పెట్టకపోయినా సూర్యుడి విద్యుత్తును వాహనానికి అందించవచ్చు. అపార్ట్‌మెంట్ల పార్కింగ్ ప్రదేశాలు, కార్యాలయాలు, మార్కెట్లు, పాఠశాలలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, హైవే పక్కన ఉన్న పార్కింగ్ ప్రాంతాల్లో సోలార్ కార్‌పోర్టులు ఏర్పాటు చేసి పగటిపూట ఉత్పత్తి చేసిన విద్యుత్తుతో వాహనాలను ఛార్జ్ చేయవచ్చు. అవసరమైన చోట బ్యాటరీ నిల్వను జత చేయవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ--ఆటోలు, చిన్న సరకు వాహనాలు, వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగించే విద్యుత్ వాహనాలకు స్థానిక సౌర విద్యుత్తుతో చిన్న ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయవచ్చు. సూర్యుడు పగటిపూట ఉన్నా వాహనం అవసరం రాత్రి రావచ్చు కాబట్టి బ్యాటరీ నిల్వ కూడా కీలకం. రూఫ్‌టాప్ సోలార్, బ్యాటరీ నిల్వ, ఈవీ ఛార్జింగ్, స్మార్ట్ మీటరింగ్, స్థానిక విద్యుత్ గ్రిడ్ సామర్థ్యాన్ని సమన్వయం చేయాలి. భవిష్యత్తులో వాహనం నుంచి ఇంటికి లేదా గ్రిడ్‌కు విద్యుత్తు పంపే ద్విముఖ ఛార్జింగ్ సాంకేతికత కూడా ఉపయోగపడే అవకాశం ఉంది. సౌర విద్యుత్‌లోనూ పరిశోధన వేగంగా సాగుతోంది. సిలికాన్‌తో పాటు పెరోవ్‌స్కైట్ ఆధారిత టాండమ్ సౌర కణాలు అధిక సామర్థ్యాన్ని సాధిస్తున్నాయి. అయితే ప్రయోగశాలలో సాధించిన సామర్థ్యం, తక్కువ ఖర్చుతో దీర్ఘకాలం పనిచేసే వాణిజ్య ఉత్పత్తి ఒకటే కాదు. మన్నిక, భారీ స్థాయి తయారీ, వ్యయం, భారత వాతావరణ పరిస్థితుల్లో పనితీరు వంటి అంశాలపై మరింత పరిశోధన



అవసరం. అందుకే మన దృష్టి కేవలం "ఎన్ని ఈవీలు అమ్ముడయ్యాయి?" అనే లెక్కపైనే ఉండకూడదు. "ఎన్ని ఈవీలకు దేశీయంగా ఉత్పత్తి చేసిన సౌర విద్యుత్తు అందుతోంది?" అనే ప్రశ్న కూడా భవిష్యత్తు విధాన చర్చలో భాగం కావాలి. ఈవీ తయారీతో పాటు సోలార్ ప్యానెళ్లు, బ్యాటరీలు, ఛార్జర్లు, విద్యుత్ నియంత్రణ పరికరాలు, నిల్వ వ్యవస్థల దేశీయ తయారీ పెరిగితే కొత్త పరిశ్రమలకు, ఉపాధికి అవకాశాలు ఏర్పడవచ్చు. ఇంటి పైకప్పుపై ఉత్పత్తి చేసిన విద్యుత్తులో కొంత భాగాన్ని ఇంటి అవసరాలకు, కొంత భాగాన్ని వాహన ఛార్జింగ్‌కు వినియోగించగలిగితే కొనుగోలు చేసే విద్యుత్తు లేదా పెట్రోల్--డీజిల్‌పై ఆధారపడే వ్యయం తగ్గే అవకాశం ఉంటుంది. అయితే వాహనం ఉచితంగా నడుస్తుందనడం సరికాదు. వాహన కొనుగోలు, బ్యాటరీ, బీమా, టైర్లు, నిర్వహణ, ఛార్జింగ్ పరికరాలు వంటి ఖర్చులు ఉంటాయి. లక్ష్యం ప్రయాణాన్ని ఉచితం చేయడం కాదు; శక్తి కోసం బయటకు వెళ్లే డబ్బును సాధ్యమైనంతవరకు దేశంలోనే ఉంచడం.

విధానపరంగా రూఫ్‌టాప్ సోలార్‌తో ఈవీ ఛార్జింగ్‌ను అనుసంధానించే పట్టణ, గ్రామీణ ప్రయోగాత్మక ప్రాజెక్టులు చేపట్టవచ్చు. అపార్ట్‌మెంట్లు, కార్యాలయాలు, ప్రజా పార్కింగ్ ప్రాంతాల్లో సోలార్ కార్‌పోర్టులు, బ్యాటరీ నిల్వ, స్మార్ట్ ఛార్జింగ్ వ్యవస్థలను ప్రోత్సహించవచ్చు. వాహనాలపై సౌర విద్యుత్తు ఉత్పత్తి, అధిక సామర్థ్య సౌర కణాలు, తక్కువ ఖర్చు బ్యాటరీలు, ద్విముఖ ఛార్జింగ్ వంటి రంగాల్లో భారతీయ పరిశోధనా సంస్థలు--వాహన తయారీదారులు కలిసి దీర్ఘకాలిక పరిశోధన చేయవచ్చు. ప్రతి వాహనం వెంటనే ఈవీగా మారడం సాధ్యం కాదు. విమానాలు, భారీ రవాణా, నౌకాయానం వంటి రంగాలకు వేర్వేరు శక్తి పరిష్కారాలు అవసరం. అందుకే విద్యుదీకరణతో పాటు ఇతర ప్రత్యామ్నాయ ఇంధన సాంకేతికతల అభివృద్ధి కూడా కొనసాగాలి. వాహనం మారితే మాత్రమే రవాణా స్వావలంబనం రాదు. వాహనానికి శక్తినిచ్చే మూలం కూడా మారాలి. ఒకప్పుడు పెట్రోల్ బంకు కోసం వెతికాం. తర్వాత ఎల్‌పీజీ, సీఎన్‌జీ వంటి ఇంధనాల కోసం ఫిల్లింగ్ కేంద్రాలను వెతికాం. ఇప్పుడు ఛార్జింగ్ కేంద్రం కోసం వెతుకుతున్నాం. రేపు ఇంటి పైకప్పు, కార్యాలయ పార్కింగ్, గ్రామంలోని సౌర కేంద్రం నుంచే వాహనానికి శక్తి అందే పరిస్థితి రావచ్చు. అప్పుడు వాహనం కేవలం రవాణా సాధనం కాదు.. ఇంటి శక్తి వ్యవస్థలో ఒక భాగం అవుతుంది.

భారత్ వచ్చే పదేళ్లను శక్తి స్వావలంబన దిశగా మలచగలిగితే, దిగుమతి చమురుపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు సౌర విద్యుత్తు, బ్యాటరీలు, ఈవీలు, ఛార్జింగ్ మౌలిక వసతులు, పరిశోధన, దేశీయ తయారీ రంగాల్లో తన సామర్థ్యాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంటుంది. ప్రపంచంలో ముందంజలో నిలవాలన్న భారత లక్ష్యానికి ఇలాంటి శక్తి మార్పు ఒక బలమైన పునాది కావచ్చు. పెట్రోల్ బంకును మూసేయడం లక్ష్యం కాదు. పెట్రోల్ బంకుపై ఆధారపడాల్సిన అవసరాన్ని తగ్గించడం లక్ష్యం. పెట్రోల్ బంకు నుంచి ఛార్జింగ్ కేంద్రానికి వచ్చాం. ఇక ఛార్జింగ్ కేంద్రం నుంచి సూర్యుడి దాకా వెళ్లాలి

- శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్టు, 9133947176

రెయిన్ బో ఎలక్ట్రానిక్స్ షోరూం ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

- నాణ్యమైన వస్తువులను వినియోగదారులకు విక్రయించాలి
- మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్





జమ్మికుంట, సెప్టెంబర్ 25 (సింగిడి): కరీంనగర్ జిల్లాలోనే అతిపెద్ద వ్యాపార కేంద్రమైన జమ్మికుంట రోజు రోజుకు వ్యాపారరంగంలో అభివృద్ధి చెందుతుందని ప్రజల అవసరాల మేరకు రకరకాల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను పట్టణంలో ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలో శేఖర్ ఏర్పాటుచేసిన రెయిన్బో ఎలక్ట్రానిక్స్ షో రూమ్ ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ మున్సిపల్ వైస్ చైర్మన్ జావేద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొన్నగంటి మల్లయ్య మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి లు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ పరిసర ప్రాంత వాసులకు అధునాతన టెక్నాలజీతో రెయిన్బో ఎలక్ట్రానిక్స్ ప్రారంభించడం చాలా సంతోషకరం అని తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను విక్రయించాలని నాణ్యతతో సేవలు అందిస్తే ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని క్వాలిటీ విషయంలో రాజీపడకుండా వారికి సేవలు అందించాలని యజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ శ్రీలం శ్రీనివాస్,చందా రాజు,చింతల శ్రీనివాస్,దిడ్డి రాము, గడ్డం దీక్షిత్, పోనగంటి మల్లయ్య, రాజు పలువురు రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

వ్యాపారి బచ్చు భాస్కర్‌కు ఘన సన్మానం

జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బచ్చు భాస్కర్ ఇటీవల జిల్లా కాటన్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్. శుక్రవారం బచ్చు భాస్కర్ కాటన్ మిల్ లో చైర్మన్ ప్రశాంత్ కుమార్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని మీ సేవలు పట్టణ ప్రజలకు ఎంతో అవసరమని మీకు అండగా పాలకవర్గం ఉంటుందని మీరు అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జావీద్ కౌన్సిలర్లు చింతల శ్రీనివాస్ చందారాజు దిద్ది రాము తదితరులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి దిగజారుడు మాటలు మానుకో

దేవుడితో ఆటలు నీకు మంచిది కాదు

నియోజకవర్గానికి ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యం..

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నేరెళ్ల మహేందర్ గౌడ్



జమ్మికుంట, సెప్టెంబర్ 25 (సింగిడి): హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దిగజారుడు మాటలు మానుకోవాలని దేవుడితో ఆటలాడితే తగిన శాస్తి జరుగుతుందని హుజురాబాద్ కు త్వరలో ఉప ఎన్నిక తప్పదని నియోజకవర్గానికి ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నేరెళ్ల మహేందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేందర్ గౌడ్ మాట్లాడుతూ, గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో గణపతి ఉత్సవాలు నిర్వహించుకున్నారని ఈ కార్యక్రమాలకు కనీసం ఒక్క పూట కూడా కౌశిక్ రెడ్డి నియోజకవర్గానికి వచ్చి వినాయకుడిని దర్శించుకున్న పాపాన పోలేదని ఆయన మండిపడ్డారు. నియోజకవర్గానికి వస్తే మండప నిర్వాహకులు చందాలు అడుగుతారని అందుకే ఇటువైపు కన్నెత్తి చూడలేదని ఆయన అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గాన్ని గాలికి వదిలేసి కల్వకుంట్ల కుటుంబానికి కాపలదారుడిగా కౌశిక్ రెడ్డి ప్రవర్తిస్తున్నాడని ఆయన మండిపడ్డారు. హుజురాబాద్ మునిసిపల్ చైర్పర్సన్ ఒక మహిళా అయినప్పటికీ ఎంతో జాగ్రత్తగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిమజ్జనానికి సర్వం సిద్ధం చేశారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. భక్తిని అడ్డం పెట్టుకొని ఆ సందర్భంగా మాట్లాడడం సిగ్గుచేటు అని ఎథిక్స్ కమిటీ ముందు తన సభ్యత్వం పోతుందని ఇలాంటి చిల్లర రాజకీయాలు చేస్తున్నాడని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ బాబు చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చేసినట్లు చెప్పుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై ఇకనుండి చిల్లర రాజకీయాలు మాట్లాడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ పట్టణ అధ్యక్షుడు తిరుపతి జిల్లా చేనేత సెల్ అధ్యక్షుడు సదానందం మహిళా అధ్యక్షురాలు పుల్ల రాధ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాజీపేట శ్రీనివాస్ ములుగు రాధ మైనార్టీ నాయకులు ఇమ్రాన్ సేవాదళ్ అధ్యక్షుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత దీన్ దయాల్ ఉపాధ్యాయ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం నివాళి



కరీంనగర్, సెప్టెంబర్25(సింగిడి): అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత, దేశభక్తికి ప్రతిరూపమైన పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఆశయాలు నేటి తరానికి ఆదర్శమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం అన్నారు. భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పార్లమెంట్ కార్యాలయంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాయిని మల్లేశం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజాభివృద్ధే ధ్యేయంగా దీన్ దయాల్ ఉపాధ్యాయ తన జీవితాన్ని కొనసాగించారని అన్నారు. దేశానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ప్రతిపాదించిన 'ఏకాత్మ మానవతావాదం' భావజాలం సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న చివరి వ్యక్తికి సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో ఆయన చూపిన మార్గాన్ని, ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయ సాధన కోసం, ప్రజాసేవలో కార్యకర్తలంతా నిరంతరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి, జిల్లా నాయకులు అప్పని తిరుపతి, దూలం కిరణ్, మియపురం లక్ష్మణాచారి, సొన్నకుల శ్రీనివాస్,మండల ప్రధాన కార్యదర్శిలు భాషబోయిన ప్రదీప్ యాదవ్, శీలం కుమార్ యాదవ్ మండల ఉపాధ్యక్షులు మీసా రమణయ్య , కొండ్ర సురేష్, అరెపెల్లి సునంద్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ నుంచే ఏఐ అప్‌షిఫ్ట్‌కు శ్రీకారం

విద్యాసంస్థలు, పరిశ్రమల అనుసంధానంతో యువతకు నైపుణ్యాల నుంచి ఉపాధి అవకాశాల వరకు మార్గం

వీటీఏ టెక్నాలజీస్ వ్యవస్థాపకులు, సీఈఓ విజయ్‌కుమార్ జక్కుల



కరీంనగర్, సెప్టెంబర్25(సింగిడి): ది ఏఐ స్కూల్ ఆధ్వర్యంలో వీటీఏ టెక్నాలజీస్ సహకారంతో 'ఏఐ అప్‌షిఫ్ట్, సదస్సు--2026'ను కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి చిత్రా మిశ్రా, ఐఏఎస్ తరపున శిక్షణలో ఉన్న కలెక్టర్ పి. హరి ప్రసాద్, ఐఏఎస్ విశిష్ట అతిథిగా పాల్గొనగా, శాతవాహన విశ్వవిద్యాలయం ప్రతినిధిగా ప్రొఫెసర్ వి. నమ్రత, ట్రినిటీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు.కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు. విద్యాసంస్థల్లో బాధ్యతాయుతంగా కృత్రిమ మేధ వినియోగం, అధ్యాపకుల శిక్షణ, ఆచరణాత్మక ప్రాజెక్టులు, శిక్షణా అవకాశాలు, పరిశ్రమలతో భాగస్వామ్యాలపై చర్చించారు.కళాశాలలను కృత్రిమ మేధ ఆధారిత ప్రాంగణాలుగా తీర్చిదిద్దడం, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఏఐ వినియోగాన్ని విస్తరించడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై వక్తలు వివరించారు. నైపుణ్యాలు--ప్రతిభకు నిదర్శనం--అవకాశాలు--ఆదాయం అనే క్రమంలో యువత అభివృద్ధికి కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్యానెల్ చర్చలో వాగేశ్వరి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు చెందిన శ్రీనివాస్ రెడ్డి, మనైర్ మీట్ మార్ట్ డైరెక్టర్ శ్రీ శ్రీనివాస్ రెడ్డి, ఐటీ, విద్యా రంగ నిపుణుడు మహేష్ కుమార్, ఔషధ పరిశ్రమ పారిశ్రామికవేత్త శ్రీ ప్రభు పాల్గొన్నారు. వీటీఏ టెక్నాలజీస్ వ్యవస్థాపకులు, సీఈఓ విజయ్ కుమార్ జక్కుల మాట్లాడుతూ, కరీంనగర్‌లో ఏఐ అప్‌షిఫ్ట్ జిల్లా స్థాయి ప్రయాణాన్ని ప్రారంభించడం గర్వకారణమన్నారు. విద్యాసంస్థలు, పరిశ్రమలను అనుసంధానించి యువతకు నైపుణ్యాల నుంచి అవకాశాల వరకు మార్గం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ఏఐ అప్‌షిఫ్ట్ కార్యక్రమాన్ని దేశాలు, రాష్ట్రాలు, జిల్లాలకు విస్తరించడంతో పాటు కళాశాలల భాగస్వామ్యాలు, అధ్యాపకుల శిక్షణ, పరిశ్రమల సమస్యలపై ప్రాజెక్టులు, మార్గదర్శకత్వం, యువతకు ఆచరణాత్మక అవకాశాలను కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దుబ్బాసి కుమార్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

- దళిత సామాజిక అంశాలపై చర్చించిన నాయకులు
- పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్న దుబ్బాసి



కరీంనగర్, సెప్టెంబర్25(సింగిడి): కొత్తపల్లి మండలానికి చెందిన డీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన దుబ్బాసి కుమార్‌ను జిల్లా దళిత సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మర్యాద పూర్వకంగా కలిశారు. డీసీసీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కనకం విద్యాసాగర్ ఆధ్వర్యంలో దళిత సామాజిక వర్గానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా దుబ్బాసి కుమార్ మాట్లాడుతూ, దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో దళిత సామాజిక వర్గానికి అండగా ఉంటామని, సమాజంలో అసాంఘిక కార్యకలాపాలను సహించబోమని పేర్కొన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అన్ని వర్గాల నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొయ్యడ వినోద్ కుమార్, సుంకే ప్రవీణ్ కుమార్, కందుకూరి నితీష్ తదితరులు పాల్గొని దుబ్బాసి కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా సాయికృష్ణ

- అధికారికంగా ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం



జమ్మికుంట, సెప్టెంబర్ 25 (సింగిడి): వీర నారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ గా హుజురాబాద్ పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు నిమ్మటూరి సాయికృష్ణ నియామకమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాల నిర్వహణ కోసం బీసీ సంక్షేమ శాఖ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర స్థాయి అధికారిక ఉత్సవ కమిటీలో మొత్తం 30 మంది కన్వీనర్లకు ప్రభుత్వం స్థానం కల్పించింది. ఈ కమిటీలో నిమ్మటూరి సాయి కృష్ణకు స్థానం కల్పించడంపై పట్టణానికి చెందిన ప్రముఖులు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాయి కృష్ణ మాట్లాడుతూ.. వీరనారి చాకలి ఐలమ్మ 131 వ జయంతి ఉత్సవాలను ఈనెల 26 న హైదరాబాదులోని రవీంద్ర భారతి లో ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించేలా కృషి చేస్తానని తెలిపారు. తననియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు ఉత్సవ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, లకు కృతజ్ఞతలు తెలిపారు. సాయి కృష్ణ నియామకం పట్ల హుజురాబాద్ రజక సంఘం పట్టణ అధ్యక్షుడు కొండపాక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్, సీనియర్ రజక సంఘం నాయకులు కొలిపాక సారయ్య, కొలిపాక పోచయ్య. కొలిపాక శంకర్, బోరింగ్ వెంకటరజం, గోపు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, బిజెపి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

స్వచ్ఛమైన నేతి మిఠాయిలకు కేరాఫ్ బాలాజీ స్వీట్ హౌస్



- బాలాజీ స్వీట్ హౌస్ ప్రారంభించిన పింగళి రమేష్

జమ్మికుంట, సెప్టెంబర్ 25 (సింగిడి): స్వచ్ఛమైన నేతి మిఠాయిలను తయారుచేసి అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన బాలాజీ స్వీట్ హౌస్ ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఇల్లంతకుంట మండలం మర్రివానిపల్లి గ్రామానికి చెందిన అల్లకొండ రాజు స్వచ్ఛమైన మిఠాయిలు తయారు చేయడంలో ఎంతో అనుభవం ఉందని ప్రస్తుతం తానే స్వయంగా ఒక మిఠాయి షాపు ప్రారంభించడం సంతోషకరమైన విషయమని తెలిపారు. జమ్మికుంట పట్టణంలో స్వచ్ఛమైన రుచికరమైన మిఠాయిలను తయారుచేసి ప్రజలకు విక్రయించాలని నాణ్యతతో కూడిన మిఠాయిలు విక్రయిస్తూ వినియోగదారుల నుండి ప్రశంసలు పొందాలని యజమాన్యానికి సూచించారు. బాలాజీ స్వీట్ హౌస్ లో నాణ్యమైన మిఠాయిలు లభిస్తాయని దీనిని పట్టణ ప్రజలతోపాటు చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కొండూరు కాంప్లెక్స్ పరిధిలోని ఐసిఐసిఐ బ్యాంక్ సమీపంలో బాలాజీ మిఠాయి దుకాణం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ షాపులో స్వచ్ఛమైన స్వీట్స్ లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్రివానిపల్లి మాజీ సర్పంచ్ కలాల రాజిరెడ్డి తోపాటు పలువురు గ్రామస్తులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు



మానకొండూర్, సెప్టెంబర్25(సింగిడి): పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా శుక్రవారం మానకొండూర్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు.దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల నాయకులు మాట్లాడుతూ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ప్రతిపాదించిన "అంత్యోదయ", "ఏకాత్మ మానవతావాదం" సిద్ధాంతాలు నేటి సమాజంలో ప్రతి వర్గం అభ్యున్నతికి, దేశ ప్రగతికి ఎంతగానో మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు. సమాజంలో చివరి వరుసలో ఉన్న వ్యక్తికి సైతం ఫలాలు అందాలనేదే అంత్యోదయ ఆశయమని గుర్తుచేశారు. పేదలు, వెనుకబడిన, అణగారిన వర్గాల సంక్షేమం కోసం ఆయన చూపిన మార్గాన్ని, ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయ సాధన కోసం, ప్రజాసేవలో కార్యకర్తలంతా నిరంతరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి, జిల్లా నాయకులు అప్పని తిరుపతి, దూలం కిరణ్, మియపురం లక్ష్మణాచారి, సొన్నకుల శ్రీనివాస్,మండల ప్రధాన కార్యదర్శిలు భాషబోయిన ప్రదీప్ యాదవ్, శీలం కుమార్ యాదవ్ మండల ఉపాధ్యక్షులు మీసా రమణయ్య , కొండ్ర సురేష్, అరెపెల్లి సునంద్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలు ఆదర్శనీయం

ఘనంగా జయంతి వేడుకలు, నివాళులర్పించిన బీజేపీ నాయకులు

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు



కరీంనగర్, సెప్టెంబర్25 (సింగిడి): భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్త, మహనీయుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను కరీంనగర్‌లోని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శిబిర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ, దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన 'ఏకాత్మ మానవతావాదం', 'అంత్యోదయ' సిద్ధాంతాలు నేటికీ ఆదర్శనీయమని అన్నారు. సమాజంలోని చివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో ఆయన చూపిన బాటలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ప్రజాప్రతి నిధులు, వివిధ మోర్చాల నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ సంగీత పోటీల్లో పారమిత విద్యార్థికి మూడో స్థానం

క్యాషియో, మాస్టర్ మ్యూజిక్ నిర్వహించిన పోటీల్లో కె.చరణ్ ప్రతిభ



కరీంనగర్, సెప్టెంబర్ 25(సింగిడి): క్యాషియో, మాస్టర్ మ్యూజిక్ సంస్థలు ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి ఆన్‌లైన్ సంగీత పోటీల్లో పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల 8వ తరగతి విద్యార్థి కె.చరణ్ మూడో స్థానం సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ కె.హన్మంతరావు తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన చరణ్‌తో పాటు సంగీత ఉపాధ్యాయురాలు జితుమణి శర్మను పారమిత విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రష్మిత, రాకేష్, వి.యు.యం. ప్రసాద్, వినోద్‌రావు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యతో పాటు సంగీతం, క్రీడలు తదితర రంగాల్లో ప్రతిభను పెంపొందిస్తూ సమగ్ర అభివృద్ధికి పాఠశాల కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ, సమన్వయకర్తలు రవీంద్రపాత్రో, భవానీ, నిఖిత, సంగీత ఉపాధ్యాయురాలు జితుమణి శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ



జమ్మికుంట, సెప్టెంబర్ 25 (సింగిడి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ మైనారిటీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గత రెండు మాసాల క్రితం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపాలున్న 38 మంది విద్యార్థులను గుర్తించగా వారికి కళ్లద్దాలు శుక్రవారం ఆర్ బి ఎస్ కే వైద్య బృందం హుజురాబాద్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రభుదాస్ చేతుల మీదుగా విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు క్లుప్తంగా వివరించడం జరిగింది,మంచి పోషకాలతో నిండిన సమతుల్య ఆహారం తీసుకోవాలని,తగినంత నిద్ర పోవాలని,వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మొబైల్ ఫోన్ కు దూరంగా ఉండాలని ఎవరికైనా కంటిలో డబుల్ దృష్టి, మబ్బుగా ఉన్న దృశ్యం,ఎరుపు కళ్ళు, కాంతి వెలుగులు, కళ్ళు లేదా కనురెప్పల వాపు వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని కంటిని సంరక్షించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ బి ఎస్ కె వైద్యాధికారి డాక్టర్ మొగిలి,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్,గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అశ్విని, ఫార్మసిస్ట్ పుష్పాంజలి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రానీయొద్దు

- సమస్యలను సత్వరం పరిష్కరించాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

కరీంనగర్, సెప్టెంబర్25(సింగిడి): జిల్లా ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా నీరు, పారిశుధ్య మిషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ భారత్ మిషన్, భూగర్భజలాలు, తాగునీటి నిర్వహణ, క్లోరినేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీలు, రైతు వేదికలు, ప్రభుత్వ ఆసుపత్రులకు నిరంతర నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ అందించడంతో పాటు నీటి నిల్వ ట్యాంకులను తప్పనిసరిగా శుభ్రం చేయాలని ఆదేశించారు.

జలసిరి పనులు వేగవంతం చేయాలి...

వీబీజీ రాంజీ పథకం కింద చేపట్టిన జలసిరి కార్యక్రమం పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల సమన్వయంతో వ్యవసాయక్షేత్రాల్లో నీటి నిల్వకుంటలు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ పనులు చేపట్టాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పించి వారు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్యజైనీ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి రాజగోపాల్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కాళేశ్వరంలో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



మహాదేవపూర్ సెప్టెంబర్ 25 (సింగిడి): జయశంకర్ భూపాలపల్లిజిల్లాకాళేశ్వరంసిరువంచ అంతర్ రాష్ట్ర బ్రిడ్జిపై ఏర్పాటు చేస్తున్న వినాయక నిమజ్జన ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి నిమజ్జనానికి వినాయకులు వస్తాయని, నిమర్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు చోటు చేసుకోకుండా గోదావరి నది వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని, క్రేన్లను, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ మల్లికార్జున్ రెడ్డి, ఎంపీడీవో రవీంద్రనాథ్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఎరువుల దుకాణాలు

నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం

ఏడిఏ శ్రీపాల్



మహాదేవపూర్ సెప్టెంబర్ 25 (సింగిడి): నిబంధనలకు విరుద్ధంగా ఎరువుల దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ వ్యవసాయ శాఖ ఏడిఏ శ్రీపాల్ అన్నారు. మండలంలోని అన్నారంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అన్నారం–2 డీసీఎంఎస్ ఎరువుల దుకాణంలో ఫర్టిలైజర్ అమెండ్ మెంట్‌చేయకపోవడంతో ఆషాపు యజమానికి స్టాప్ సేల్స్ ఇచ్చారు. ఎరువుల దుకాణాలలో ఎలాంటి అవకతవకలు జరిగిన కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ వ్యవసాయ శాఖ ఎం ఏ ఓ శ్రీజ, వ్యవసాయ విస్తరణ అధికారులు ధర్మేందర్, రాంబాబు, తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

మై హోమ్‌లో ఘనంగా అన్నదాన కార్యక్రమం



కోదాడ, సెప్టెంబర్ 25 (సింగిడి): మై హోమ్ ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు, ఎస్టేట్ సిబ్బంది పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో మై హోమ్ ఎస్టేట్ వైస్ చైర్మన్ వినోద్‌రావు, జీఎం రాజశేఖర్, మాజీ ఎడమ కాలువ చైర్మన్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, కందుల కోటేశ్వరరావు, పీఎస్‌టీ మేనేజర్ లక్ష్మారెడ్డి, ఎస్టేట్ మేనేజర్ విష్ణువర్ధన్ రావు, అశోక్, ఎనేపల్లి శ్రీనివాసరావు, కొండలరావు, బాలు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ జిల్లా, మండల, డివిజన్ పదవులకు దరఖాస్తుల స్వీకరణ

జిల్లా ఓబీసీ ఇంచార్జ్ జిల్లాపల్లి పరమేష్



వరంగల్, సెప్టెంబర్ 25 (సింగిడి): వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం జిల్లా, మండల, డివిజన్ స్థాయి పదవులకు ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ఓబీసీ రాష్ట్ర నాయకులు, జిల్లా ఓబీసీ విభాగం ఇన్‌చార్జ్ శ్రీ జిల్లాపల్లి పరమేష్‌ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్సీ శ్రీ బస్వరాజు సారయ్య గారు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ మహమ్మద్ అయూబ్ గారి సమక్షంలో పలువురు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర నాయకులు బొమ్మగాని విక్రమ్ గౌడ్, పగిళ్ల రాజు, తోట మురళి ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నల్లోండ రమేష్, మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్ తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఓబీసీ పదవుల ఆశావహులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రోటోకాల్ పాటిస్తూ సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్, సెప్టెంబర్ 25(సింగిడి): ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జరగనున్న కరీంనగర్ జిల్లా నూతన కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చిన్నపాటి లోపానికీ తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శుక్రవారం రాత్రి అదనపు కలెక్టర్ రెవెన్యూ డి. శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నూతన కలెక్టరేట్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ చాంబర్, సమావేశ మందిరం, అదనపు కలెక్టర్ల గదులు, మంత్రుల సమీక్ష సమావేశాల కోసం ఏర్పాటు చేసిన హాళ్లు తదితర ప్రాంతాలను పరిశీలించి అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ప్రారంభోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేలా భవనాన్ని సుందరంగా అలంకరించాలని, కార్యక్రమం ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచేలా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీసు అధికారులు, ఇతర



ఉన్నతాధికారుల పర్యటన నేపథ్యంలో ప్రోటోకాల్‌ను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. అతిథుల సమన్వయం కోసం లైజనింగ్ అధికారులను ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టరేట్ ప్రారంభోత్సవంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు కూడా పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. వేదిక, మీడియా ప్రతినిధులు, అతిథులు, ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని, సమావేశ మందిరంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారుల సీటింగ్‌ను ముందుగానే ఖరారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో చివరి నిమిషంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి అంశాన్ని ముందుగానే పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రెవెన్యూ డి. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, ఆర్డీవో షర్మిల, ఏవో సుధాకర్, ఆర్‌అండ్‌బీ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన తీర్థాల పనులను వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

మహాదేవపూర్ సెప్టెంబర్ 25 (సింగిడి): రాబోయే గోదావరి పుష్కరాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరిగే అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రంలో నూతన తీర్థాల అభివృద్ధి పనులను , పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పనకు అవసరమైన రహదారి నిర్మాణ పనులను వీర్వంతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. సిరోంచ అంతర్రాష్ట్ర బ్రిడ్జి నుంచి ప్రధాన ఘాట్ వరకు సుమారు రెండు కిలోమీటర్లు, సరస్వతి ఘాట్ నుంచి పక్షితీర్థం వరకు 0.8 కిలోమీటర్ల పరిధిలో నూతనంగా ఏర్పాటు చేయుచున్న ఐదు తీర్థాల ప్రతిపాదిత స్థలాలను ఆయన పరిశీలించారు. అవసరమైన మౌలిక వసతులు, రహదారి సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. ఆదిముక్తిశ్వర దేవాలయం





నుంచి సరస్వతి ఘాట్ వరకు భూసేకరణ పూర్తయిన శాశ్వత రహదారి నిర్మాణ స్థలాన్ని పరిశీలించి, రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం నిమజ్జన ప్రాంతంలో భద్రత ఏర్పాట్లను పరిశీలించి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు చోటు చేసుకోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రీ సర్వే పనులపై కన్నెపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి రిసర్వ్ పనులను వేగవంతంగా నిర్వహిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సర్వే సిబ్బందికి స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ తహసిల్దార్ సత్యనారాయణ స్వామి, మండల సర్వేయర్ తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

11,289 మందికి స్మార్ట్ రేషన్‌కార్డులు

- ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట
- పథకాల ప్రయోజనాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి
- కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

కోదాడ, సెప్టెంబర్ 25 (సింగిడి): అనంతగిరి మండల పరిధిలో 11,289 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రారంభించారు. అనంతగిరి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి,



ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాల ద్వారా వివిధ వర్గాలకు ప్రయోజనం కల్పిస్తున్నట్లు వివరించారు. స్మార్ట్ రేషన్ కార్డులతో అర్హులైన కుటుంబాలకు రేషన్ సరుకులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కమలాకర్, మండల అధ్యక్షులు ముసుకు శ్రీనివాస్ రెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలేరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

ఆలేరు, సెప్టెంబర్ 25 (సింగిడి): ఆలేరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జూకంటి పౌలు డిమాండ్ చేశారు. ఆలేరు మండల కమిటీ సమావేశం బొమ్మకంటి లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ



మండలంలోని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేని చోట్ల వెంటనే నియమించి ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని కోరారు. మంతపురి, సాయిగూడెం గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. పని కోసం ఎదురుచూస్తున్న వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం వెంటనే ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. దళిత, గిరిజన కుటుంబాలకు అంబేద్కర్ పథకం కింద రూ. 12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పనుల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల నాయకులు, జిల్లా కమిటీ సభ్యులు మిట్ట శంకరయ్య, పారుపల్లి సత్తయ్య, చౌడబోయిన అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

ఆలేరు, సెప్టెంబర్ 25 (సింగిడి): గణేష్ నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ఆలేరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు మేనేజర్ బి.జగన్‌మోహన్ సిబ్బందితో కలిసి నిమజ్జన ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లను తనిఖీ చేశారు. నిమజ్జన ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. రద్దీ ప్రాంతాల్లో భద్రతను నిరంతరం పర్యవేక్షించేలా కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అని తనిఖీ చేశారు. రాత్రివేళ భక్తులకు ఇబ్బందులు కలగకుండా వీధి దీపాలు, ప్రత్యేక ఎల్‌ఈడీ లైట్లను పరిశీలించారు. భక్తులు, వినాయక విగ్రహాలతో వచ్చే నిర్వాహకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా,



సురక్షితంగా విజయవంతమయ్యేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మేనేజర్ జగన్‌మోహన్ సూచించారు.

గణనాథుడికి ఘన వీడ్కోలు

పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా నిమజ్జన కార్యక్రమం



కరీంనగర్, సెప్టెంబర్ 25(సింగిడి): కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో గణేష్ నవరాత్రుల సందర్భంగా ప్రతిష్ఠించిన గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పు చప్పుళ్ల నడుమ గణనాథుడిని నిమజ్జనానికి ఘనంగా సాగనంపారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ వెంకటరమణతో పాటు కమిషనరేట్ అధికారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి కౌన్సిలర్ ఆర్థికసాయం



వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 25 (సింగిడి): వనపర్తి జిల్లా కేంద్రంలోని 22వ వార్డు ఉప్పరి లచ్చన్న కాలనీలో ఈశ్వరయ్య చారి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ ఏర్వ అరుణ మెకానిక్ శ్రీను శుక్రవారం వారి ఇంటికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తీవ్ర విషాదంలో ఉన్న ఆ కుటుంబానికి అండగా ఉంటామని కౌన్సిలర్ భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబ పరిస్థితులను గుర్తించి తన వంతు సహాయంగా రూ.5,000 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రభుత్వ పరంగా కూడా ఆ కుటుంబానికి అవసరమైన సహాయం అందేలా చూస్తామని ఈ సందర్భంగా కౌన్సిలర్ తెలిపారు.

కోదాడకు బుల్లెట్ రైలు వస్తే.. వైద్య సేవలకు ఊతం

అత్యవసర వైద్యం కోసం హైదరాబాద్, చెన్నైకి వేగంగా చేరుకునే అవకాశం

ప్రాంతీయ అభివృద్ధికి బుల్లెట్ రైలు మార్గం కీలకం

తెలంగాణ ఉద్యమకారుడు, ఎం.ఎస్. సర్జన్ డాక్టర్ దశరథ్



కోదాడ, సెప్టెంబర్ 25 (సింగిడి): హైదరాబాద్--చెన్నై బుల్లెట్ రైలు మార్గాన్ని కోదాడ మీదుగా ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు, ఎం.ఎస్. సర్జన్ డాక్టర్ దశరథ్ కోరారు. కోదాడలో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన బుల్లెట్ రైలు సాధన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోదాడ మీదుగా బుల్లెట్ రైలు నడిస్తే ఈ ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతోపాటు అత్యవసర వైద్య సేవలు మరింత అందుబాటులోకి వస్తాయన్నారు. తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లోని ప్రత్యేక వైద్య సేవలను తక్కువ సమయంలో పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. బుల్లెట్ రైలు మార్గం ఏర్పాటుతో కోదాడకు పారిశ్రామిక, వాణిజ్య, విద్యా రంగాల్లోనూ ప్రయోజనం కలిగే అవకాశం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కోదాడ మీదుగా మార్గం ఏర్పాటుపై దృష్టి సారించాలని కోరారు.

ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులు

ఓపెన్ యూనివర్సిటీలో విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం



ఆలేరు, సెప్టెంబర్ 25 (సింగిడి): విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులు, విద్యా విధానాలను అమలు చేస్తున్నట్లు యూనివర్సిటీ ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ బి.ధర్మనాయక్ తెలిపారు. ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో కౌన్సిలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మనాయక్ మాట్లాడుతూ 2026 విద్యాసంవత్సరానికి యూజీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానం ద్వారా విద్యను అందిస్తున్నామని, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన కోర్సులను రూపొందిస్తున్నట్లు తెలిపారు. విద్యతో పాటు విద్యార్థుల్లో వ్యాపార అభివృద్ధి, ఆవిష్కరణలు, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించేలా మార్గదర్శకత్వం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగావకాశాలతో పాటు స్వయం ఉపాధి దిశగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఓపెన్ యూనివర్సిటీ ద్వారా చదువుకోవాలనుకునే విద్యార్థులు ప్రవేశ గడువును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జే.రాజారామ్, కోఆర్డినేటర్ ఎస్.జ్యోతి, జాక్ట్ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు నేలవాలిన పత్తి, వరి పంటలు

తీవ్ర ఇబ్బందుల్లో రైతాంగం

పంట నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులను ఆదుకోవాలి

రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చేల్పూరి రాము



జమ్మికుంట, సెప్టెంబర్ 25 (సింగిడి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని అధికారులు రైతులు నష్టపోయిన పత్తి వరి పంటలను పరిశీలించి నష్టపరిహారం అందించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాము ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం రాము మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో సరైన సమయంలో వర్షాలు కురవక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న కరీంనగర్ జిల్లా రైతాంగం, ఎట్టకేలకు వర్షాలు కురవడంతో పంటలు సాగు చేసింది. అయితే గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురుగాలులు రైతులను మరోసారి తీవ్ర ఆందోళనకు గురిచేశాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పత్తి చేనులు, వరి పొలాలు నేలవాలడం తో రైతులు నష్టాలను చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటూ రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేశారు. పత్తి, వరి పంటల కోసం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీలకు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టారు. పంటలు చేతికందే దశకు చేరుకున్న సమయంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురవడంతో పలు ప్రాంతాల్లో పంటలు నేలమట్టమయ్యాయి. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు దెబ్బతినడంతో పాటు దిగుబడులు తగ్గే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికే వాతావరణ పరిస్థితుల కారణంగా సాగులో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు తాజా వర్షాలు మరింత నష్టాన్ని కలిగించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు నేల వాలడంతో నష్టం ఎంతమేర జరిగిందనే దానిపై ప్రభుత్వం తక్షణమే సమగ్రంగా అంచనా వేయాల్సిన అవసరం ఉందని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

క్షేత్రస్థాయిలో పంట నష్టాలను పరిశీలించాలి

భారీ వర్షాలు, ఈదురుగాలులతో దెబ్బతిన్న పత్తి, వరి పంటలను రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలంగాణ రైతు సంఘం కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి చేల్పూరి రాము డిమాండ్ చేశారు.

అతివ Athiva

సింగిడి

నిమ్మ తొక్కతో ఇంట్లో..
ఈ పనులు చేసి డబ్బు ఆదా చేయొచ్చు..!

వంట పాత్రలపై పేరుకుపోయిన మొండి జిడ్డును వదిలించడానికి నిమ్మ తొక్క బేకింగ్ సోడా మిశ్రమం అద్భుతంగా పనిచేస్తుంది. బేకింగ్ సోడాపై కొన్ని చుక్కల నిమ్మరసం పిండి, ఆ మిశ్రమాన్ని పాత్రలపై రాసి 10 నిమిషాల తర్వాత అదే తొక్కతో రుద్దితే జిడ్డు మాయమవుతుంది. అలాగే, నల్లగా మారిన ఇత్తడి విగ్రహాలు లేదా రాగి పాత్రలను మెరిపించడానికి నిమ్మ తొక్కపై కొద్దిగా ఉప్పు చల్లి రుద్దండి. ఖరీదైన పాలిష్‌లు లేకుండానే అవి కొత్తవాటిలా మెరిసిపోవడం మీరు గమనిస్తారు. చివరగా గోరువెచ్చని నీటితో కడిగితే చాలు.





కుక్కర్ మరకలు తొలగించే 'సోకింగ్' పద్ధతి

ప్రెషర్ కుక్కర్ లోపల లేదా టీపాట్‌ల అడుగున ఏర్పడే తెల్లటి మరకలను రుద్ది వదిలించడం కష్టమైన పని. అటువంటి సందర్భాలలో మురికి పాత్రలో నీరు పోసి, అందులో 2-3 నిమ్మ తొక్కలను వేసి 5-10 నిమిషాల పాటు మరిగించాలి. నిమ్మరసం నీటిలో కరిగి లోపలి మురికిని మెత్తబరుస్తుంది. ఆ తర్వాత పాత్రను తేలికగా రుద్దితే లోపలి భాగం తళతళలాడుతుంది. ఈ పద్ధతి వల్ల మీ శ్రమ తగ్గడమే కాకుండా పాత్రలు కూడా సురక్షితంగా ఉంటాయి.



సహజసిద్ధమైన మల్టీ-పర్పస్ క్లీనర్ స్ప్రే

నిమ్మ తొక్కలను వెనిగర్‌తో కలిపి ఒక శక్తివంతమైన నేచురల్ క్లీనర్‌ను తయారు చేసుకోవచ్చు. ఒక స్ప్రే బాటిల్‌లో సమాన పరిమాణంలో వెనిగర్ నీటిని తీసుకుని, అందులో నిమ్మ తొక్కలను వేసి 2-3 రోజులు పక్కన పెట్టాలి. ఈ ద్రావాన్ని కిచెన్ కౌంటర్‌టాప్‌లు, సింక్ డ్రెయిన్‌లు ట్రైల్స్‌పై స్ప్రే చేసి తుడుచుకోవచ్చు. ఇది కేవలం శుభ్రపరచడమే కాకుండా, రసాయనాల వాసన లేకుండా మీ వంటగదిని నిమ్మకాయ సువాసనతో తాజాగా ఉంచుతుంది. నిమ్మ తొక్కలను పారేయకుండా ఇలా ఉపయోగించడం వల్ల డబ్బు ఆదా అవ్వడమే కాకుండా, మీ ఇల్లు రసాయన రహితంగా మారుతుంది. పర్యావరణానికి కూడా ఇది ఎంతో మేలు చేస్తుంది

హల్వాతో బోర్ కొట్టిందా? ఇలా ట్రై చేయండి..



కావలసిన పదార్థాలు:

1 కప్పు బొంబాయి రవ్వ
2 కప్పుల పాలు
1 కప్పు పంచదార
1 కప్పు దేశీ నెయ్యి
1/2 టీస్పూన్ యాలకుల పొడి
జీడిపప్పు, బాదం, పిస్తా (తరిగినవి)

తయారీ విధానం..

మొదటగా ఒక గిన్నెలో బొంబాయి రవ్వను తీసుకుని, పాలు పోసి బాగా కలపాలి. దీనిని కనీసం ఒకటి నుండి రెండు గంటల పాటు నాననివ్వాలి. ఇలా చేయడం వల్ల రవ్వ పాలను పీల్చుకుని ఉబ్బుతుంది. ఆ తర్వాత మందపాటి అడుగు ఉన్న బాణలిలో నెయ్యి వేసి వేడి చేయాలి. అందులో పంచదార వేసి తక్కువ మంట మీద కలుపుతూ ఉండాలి. పంచదార పూర్తిగా కరిగి, లేత గోధుమ రంగులోకి (Caramelize) మారిన వెంటనే, ముందుగా పాలలో నానబెట్టుకున్న రవ్వ మిశ్రమాన్ని ఇందులో కలపాలి.

రవ్వను కలిపినప్పుడు మిశ్రమం మొదట గట్టిగా అనిపించినా, కలుపుతూ ఉంటే నెయ్యిలో కలిసి మెత్తబడుతుంది. మధ్యస్థ మంట మీద నిరంతరం కలుపుతూ ఉంటే, అంచుల నుండి నెయ్యి వేరుపడి హల్వా గరుకుగా మారుతుంది. చివరిగా యాలకుల పొడి, డ్రై ఫ్రూట్స్ వేసి రెండు నిమిషాలు ఉంచి స్టవ్ ఆపివేయాలి. పంచదారను మరీ ఎక్కువగా మరిగిస్తే చేదు వచ్చే అవకాశం ఉంది, కాబట్టి రంగు మారగానే రవ్వ కలపడం ముఖ్యం. నెయ్యిని ఉదారంగా వాడటం వల్ల హల్వాయి స్టైల్ రుచి వస్తుంది. సాధారణ హల్వా కంటే భిన్నమైన ఆకృతి, క్యారమెల్ సువాసన మఖండీ హల్వాను ప్రత్యేకంగా చేస్తాయి. ఈ కొత్త రెసిపీతో మీ ఇంటిల్లిపాదికీ తీపి గుర్తులను అందించండి.



చమురు షాక్ తప్పదు..
గోల్డ్‌మన్ శాక్స్



ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాక్స్ కూడా చమురు ధరలు నాలుగో త్రైమాసికానికి పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. బ్రెంట్ 90 డాలర్ల వద్ద, డబ్ల్యూటీఐ 83 డాలర్ల వద్ద ఉండొచ్చని పేర్కొంది. పశ్చిమాసియాలో చమురు ఉత్పత్తి తగ్గొచ్చని తెలిపింది. దీనికితోడు శుద్ధి చేసిన చమురు ఉత్పత్తుల ధరలు భారీగా ఉండటం కూడా అధిక ధరకు ఓ కారణమని పేర్కొంది. పశ్చిమాసియా సంక్షోభానికి షాకులు తోడవుతాయని వెల్లడించింది.

పెరిగిన ధరలు: ముడి చమురు ధరలు మళ్లీ పెరిగాయి. నేడు బ్రెంట్ క్రూడ్ ధర 2 శాతం ఎగబాకి 107.49 డాలర్లకు చేరింది. ఏప్రిల్ తర్వాత ఇదే అత్యధిక ధర. ఇక అమెరికాకు చెందిన వెస్ట్ టెక్సస్ ఇంటర్మీడియట్ కూడా 1.77 డాలర్లు ధర పెరిగి 96.17 డాలర్ల వద్దకు చేరింది.

లాభాల్లో దేశీయ మార్కెట్ సూచీలు

దేశీయ మార్కెట్ సూచీలు ఈ వారం లాభాల్లో ట్రేడింగ్ మొదలుపెట్టాయి. ఉదయం 9.19 గంటల సమయంలో సెన్సెక్స్ 392 పాయింట్లు పెరిగి 77,056 వద్ద, నిఫ్టీ 126 పాయింట్లు పెరిగి 24,024 వద్ద ట్రేడవుతున్నాయి. ఇక డాలర్‌తో రూపాయి మారకం విలువ 11 పైసలు పడిపోయి రూ. 94.27 వద్ద ట్రేడవుతోంది.

లాభాల్లో ముగిసిన సూచీలు..
24 వేల ఎగువకు నిఫ్టీ



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అమెరికా-ఇరాన్ మలి విడత చర్చలపై మళ్లీ ఆశలు చిగురించడంతో మూడు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ వేస్తూ సూచీలు నేడు పరుగులు తీశాయి. హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు అమెరికా ముందు ఇరాన్ కొన్ని ప్రతిపాదనలు ఉంచిందన్న వార్తలతో సెంటిమెంట్ బలపడింది. ముఖ్యంగా ఫార్మా, రియల్టీ, ఐటీ స్టాక్స్ రాణించడం కలిసొచ్చింది. దీంతో నిఫ్టీ మళ్లీ 24 వేల ఎగువన ముగిసింది.

సెన్సెక్స్ ఉదయం 76,856.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,664.21) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 77,420.04 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 639.42 పాయింట్ల లాభంతో 77,303.63 వద్ద ముగిసింది. నిఫ్టీ 194.75 పాయింట్ల లాభంతో 24,092.70 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.18గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, రిలయన్స్, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా స్టాక్స్ లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, బీఈఎల్, ట్రెంట్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎటర్నల్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4702 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

ఎస్‌బీఐలో కేవలం రూ.1 లక్ష డిపాజిట్ చాలు
రూ.42,524 వడ్డీ.. అద్భుతమైన స్కీమ్



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారతదేశపు అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) అతిపెద్ద కస్టమర్ బేస్‌ను కలిగి ఉండటమే కాకుండా, దేశవ్యాప్తంగా అత్యంత విస్తృతమైన శాఖల నెట్‌వర్క్‌ను కూడా కలిగి ఉంది.

దేశంలోని ఈ అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు తన ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఖీణ) పథకాల ద్వారా తన కస్టమర్లకు ఆకట్టుకునే రాబడులను అందిస్తోంది. ఈ ప్రభుత్వ రంగ బ్యాంకు ప్రస్తుతం తన కస్టమర్ల ఎఫ్‌డీ ఖాతాలపై 3.05% నుండి 7.15% వరకు బంపర్ వడ్డీ రేట్లను అందిస్తోంది. ఇక్కడ కేవలం రూ.1 లక్ష డిపాజిట్‌పై రూ.42,524 వరకు స్థిర వడ్డీ రాబడిని అందించగల ఒక నిర్దిష్ట ఎస్‌బిఐ ఎఫ్‌డీ పథకాన్ని పరిశీలిద్దాం.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కనీసం 7 రోజుల నుండి గరిష్ఠంగా 10 సంవత్సరాల కాలపరిమితితో ఎఫ్‌డీ ఖాతాను తెరవవచ్చు. సాదీ× 7-రోజుల ఖీణ పథకాలపై 3.05% నుండి 3.65% వరకు; 46 నుండి 179 రోజుల కాలపరిమితి గల పథకాలపై 4.90% నుండి 5.50% వరకు; అలాగే 180 నుండి 210 రోజుల కాలపరిమితి గల పథకాలపై 5.65% నుండి 6.25% వరకు వడ్డీ రేట్లను అందిస్తుంది. అంతేకాకుండా, ఈ ప్రభుత్వ రంగ బ్యాంకు 5 నుండి 10 సంవత్సరాల కాలపరిమితి గల ఎఫ్‌డీ ఖాతాలపై 6.05% నుండి గరిష్ఠంగా 7.15% వరకు వడ్డీ రేట్లను అందిస్తుంది.

ఒక సాధారణ పౌరుడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 5 సంవత్సరాల ఎఫ్‌డీ పథకంలో రూ.1 లక్ష జమ చేస్తే, మెచ్యూరిటీ సమయంలో వారికి మొత్తం రూ.1,35,018 లభిస్తుంది. ఇందులో రూ.35,018 వడ్డీ భాగం ఉంటుంది. మీరు సీనియర్ సిటిజన్ అయి ఉండి, సాదీ× 5 సంవత్సరాల ఎఫ్‌డీ పథకంలో రూ.1 లక్ష జమ చేస్తే, మెచ్యూరిటీ సమయంలో మీకు మొత్తం రూ.1,41,826 లభిస్తుంది. ఇందులో రూ.41,826 వడ్డీ ఉంటుంది. అదేవిధంగా మీరు సూపర్ సీనియర్ సిటిజన్ అయి ఉండి ఎస్‌బీఐ 5 సంవత్సరాల ఎఫ్‌డీ పథకంలో రూ.1 లక్ష జమ చేస్తే, మెచ్యూరిటీ సమయంలో మీకు మొత్తం రూ.1,42,524 లభిస్తుంది. ఇందులో రూ.42,524 వడ్డీ ఉంటుంది.

8 శాతం పతనమై
కోలుకున్న పేటీఎం షేర్లు!

పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ షేర్లు నేడు భారీగా పతనమయ్యాయి. పేటీఎం పేమెంట్స్ బ్యాంకింగ్ లైసెన్స్‌ను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రద్దు చేసిన నేపథ్యంలో ఆ ప్రభావం సంస్థ షేర్లపై కనిపించింది. సోమవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో కంపెనీ స్టాక్ ఓ దశలో 8 శాతానికి పైగా పతనమై తర్వాత కోలుకుంది. మార్కెట్ ప్రారంభమైన కాసేపటికే పేటీఎం షేరు విలువ ఎన్ఎస్ఈ సూచీలో దాదాపు 8.38 శాతానికి పైగా పడిపోయి రూ.1,051.10కి చేరింది. సెన్సెక్స్‌లో సైతం 8.37 శాతం మేర క్షీణించి రూ.1,051కు చేరుకొని ఆపై కోలుకుంది. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఒక శాతం నష్టంతో రూ.1,127.85 వద్ద కదలాడుతోంది. అయితే, ఆర్‌బీఐ పేమెంట్స్ బ్యాంకింగ్ లైసెన్స్ రద్దు చేసినప్పటికీ ఆర్థికంగా తమ కంపెనీపై అది ఎలాంటి ప్రభావం చూపబోదని వన్97 కమ్యూనికేషన్స్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది.



ప్రభాతనవ సింగిడి SINGIDI తెలుగు దినపత్రిక ప్రతి రంగూ ఓ నిజం

సింగిడి

జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో... విద్యార్థులు రాణించడం అభినందనీయం

సిఆర్‌పిఎఫ్ స్కూల్ ప్రిన్సిపల్ డి. అపర్ణ





జవహర్ నగర్, (సింగిడి): జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిఆర్‌పిఎఫ్ విద్యార్థులు రాణించడం అభినందనీయమని చదువుతోపాటు క్రీడల్లో బాలబాలికలు నైపుణ్యం సాధించాలని ప్రిన్సిపాల్ డి. అపర్ణ పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్‌నగర్ చంద్రపురికాలనీ డివిజన్ అరుంధతి నగర్ సిఆర్‌పిఎఫ్ క్యాంపస్ ఆవరణలో గురువారం ప్రిన్సిపాల్ అపర్ణ ఆధ్వర్యం లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటినుండే మంచి భవిష్యత్తును ఎంచుకొని ముందుకు సాగాలని ఆధునిక కాలంలో ఫోన్లకు స్వస్తి పలుకుతూ క్రీడా మైదానంలోకి అడుగు పెట్టాలని అన్నారు. సిఆర్‌పిఎఫ్ పాఠశాల క్రమశిక్ష ణకు నిలయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ క్రీడ పాఠశాలలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో 4 బంగారు, 3 వెండి 2 కాంస్య బహుమతులు స్కూల్ క్రీడా ఫెడరేషన్‌లో 2 బంగారు 2 సిల్వర్ ఒక బ్రాంజి బహుమతులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ హరిశంకర్, ఆశాజికుమార్, ఫిజికల్ డైరెక్టర్లు రాజశేఖర్, భాస్కర్ రెడ్డి, మన్మధరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సాధిద్దాం రండి

చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య పిలుపు
బెడిసి కొట్టిన అసమ్మతి వర్గీయుల పన్నాగం



వికారాబాద్ ప్రతినిధి, (సింగిడి): రాజకీయాలకు అతీతంగా మండలాన్ని అభివృద్ధి చేద్దాం కలిసి రావాలని చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రజా ప్రతినిధులకు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా పరిధిలోని ఎమ్మెల్యే స్వంత మండలం నవాబుపేట మండల సర్వసభ్య సమావేశం ప్రత్యేక అధికారి కవిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కొందరు రాజకీయ పరమైన విషయాలు దృష్టిలో పెట్టుకుని అభివృద్ధిని దూరం చేసుకుంటున్నారని అన్నారు. వారిని ఉద్దేశించి ఆయన ఈ విధంగా అన్నారు. అయితే కొన్ని విషయాలపై సర్వసభ్యసమావేశం వేదికగా ఎమ్మెల్యే ను తికమక పెట్టాలని భావించిన కొందరు సర్పంచ్ లు పన్నిన పన్నా గాన్ని అమలు చేయలేక పోయారు. సభ ఆయా ఆంశాలపై చర్చ కొనసాగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యేను అడగాలనుకున్న వారు సమావేశం చివరలో ఎమ్మెల్యే ప్రసంగించి సమావేశాన్ని ముగించిన నేపథ్యంలో అసమ్మతి వర్గం ఎమ్మెల్యే ను కదిలించే యత్నం చేయడంతో సమావేశం ముగిసిందని సమాధానమివ్వడంతో నిచ్చేస్తులైయ్యారు. వీరిని ఉద్దేశించి ఎమ్మెల్యే పై విధంగా మాట్లాడారు. కలిసి నడుద్దామని అభివృద్ధికి సహకరించాలని అన్నారు. రాజకీయాలు ఎన్నికల సమ యంలో చూసుకోవాలని పుణ్యకాలాన్ని ఆదివినియోగం చేసుకోవాలని అన్నా రు. ఈ విషయం తెలుసున్న నిఘా వర్గాలు ముందస్తు చర్యలు తీసుకు న్నారు. పోలీసు అదనపు బాలగాన్ని గమనించిన అసమ్మతి వర్గం ముందుగా సహాసించలేక పోయారు. సమావేశం ముగిశాక నిలదీయాలని యత్నించిన ఫలితం లేకుండా పోయింది. ఇదిలా ఉండగా సర్వసభ్యసమావేశంలో ముందుగా వ్యవసాయ శాఖ పై చర్చ జరిగింది. అధికారి జ్యోతి శాఖ పరమైనా వివరాలను వివరించారు. ప్రస్తు తం తెల్లకుసుమ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, శనగలు త్వరలో వస్తా యని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతు భీమా పై, రైతు భరోసా పై ఎమ్మెల్యే అధికారితో చర్చించారు. ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం అందించాలన్నారు. ఫార్మర్రిజిస్ట్రేషన్ తోనే రైతులకు ప్రతి ప్రతి ప్రయోజనం ఆధారపడి ఉంటుందని ప్రత్యేక అధికారిగా ఉన్న జిల్లా వ్యవసాయ అధికారి కవిత తెలిపారు. విద్యుత్ సరఫరా పై గుబ్బడిఘత్తేపూర్ సర్పంచ్ సామెల్, కుమ్మరి గూడ సర్పంచ్, శ్రీనివాస్ రెడ్డి లు పలు సమస్యలను శభాదృష్టికి తీసుకువచ్చారు. వాటిని త్వరగా పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే ఏ ఈ కి సూచించారు. విద్యా శాఖ చర్చ నిర్వహిం చారు. ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయుల కొరత, ఉపాధ్యాయుల పనితీరుపై సభ్యులు మాట్లాడారు. సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆరోగ్య శాఖ చర్చలో విద్యాధికారి రోహిత్ ఆసుపత్రి లో నిర్వహించిన వైద్యా సేవలను వివరించారు. పశుసంవర్ధక శాఖ చర్చలో ఎమ్మెల్యే యాదయ్యస్పందిస్తూ పశు సంపద, తదితర మౌళిక సదుపాయాలపై ఆరాదిశారు. శిశు సంక్షేమ శాఖ చర్చలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీ భవనాలు, సిబ్బంది ఆంశాలపై ఆరాదీశారు. ఆయా గ్రామాల్లో అంగన్వాడీ టీచర్స్, ఆయాల ఖాళీలు ఉన్నట్లు సీ డిపివో తెలిపారు. అయితే ఖాళీల వివరాలు, స్వంత భవనం లేని కేంద్రాల వివ రాలు ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. వాటి పరిస్కారం కోసం కృషి చేయను న్నట్లు చెప్పారు. వీబిజి రామ్ జీ పథకం పై ఏ పీ వో లక్ష్మీ వివరించారు. పంచాయతీ రాజ్ శాఖ, మహిళా సమాఖ్య, ఆర్ అండ్ బి శాఖచర్చలో రోడ్ల అంశంపై ఎమ్మెల్యే ఆరాదిశారు. రోడ్ల పనులు వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని ఆయన సూచించారు. ఉద్యానవన శాఖ, ఆటవి శాఖ, నీటి పారుదల శాఖ ఆంశాల్లో ఆయా గ్రామాల చెరువులపై ఎమ్మెల్యే ఆరాదిశారు. అదేవిధంగా మండలంలో ప్రసిద్ధి శివాలయం ఎల్లకొండ పై ఉన్న పుష్కరిని ని పరిశీలించాలని పూడిక తీయడం తదితర పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ ఏ ఈ కి సూచించారు. రెవిన్యూ శాఖ వివరాలను ఉప తహసీల్దార్ నవీన్ కుమార్ రెడ్డి వివరించారు. సర్ నోటీసులు అందుకున్న వారు త్వరగా సంబంధించిన పత్రాలను జతచేసి ఇవ్వాలని కోరారు. సాంఘిక సంక్షేమ శాఖ వివరాలు వార్డెన్లు వివరించారు. గృహనిర్మాణశాఖ చర్చలో ఇందిరమ్మ ఇళ్ళ ప్రస్థావనను ఎమ్మెల్యే తీసుకొని అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరవుతోందాన్నారు. అర్హులైన వారు ఏలాంటి రాజకీయాలకు తావులేకుండా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే చెప్పారు. చేవెళ్ళ క్యాంపు కార్యాలయం వద్ద దరఖాస్తులకోసం ప్రత్యేక బాక్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అర్హులు నిర్భయంగా దరఖాస్తులు ఇవ్వవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో 22 ఆంశాల పై చర్చ జరిపారు. ఈ సామావేశంలో మండలప్రత్యేక అధికారికవిత,ఎంపీ డి వో అనురాధ, ఏ ఎంసీ చైర్మన్ గీతాసింగ్, సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు బలవంత్ రెడ్డి, కొండల్ యాదవ్, సర్పంచ్ లు, గ్రామ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 30 నాటికి డిజిటల్ క్రాప్ సర్వే పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ బి.చంద్రారెడ్డి



ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో(సింగిడి):: వ్యవసాయ రంగానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే, రైతు నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) ప్రక్రియలను సెప్టెంబర్ 30 నాటికి పంద శాతం పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. చంద్రారెడ్డి అధికారులను ఆదేశించా రు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, సివిల్ సప్లైస్, మీసేవ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమా వేశం నిర్వహించారు. అక్టోబర్ 1వతేదీనుండి జిల్లాలో పరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారం భం కానున్నందున గడువులోగా క్రాప్ సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం గుర్తించిన 7 సన్న వరి లోకాలకు మాత్రమే క్వింటాలుకు రూ. 500 బోనస్ లభిస్తుంది. ఇందుకు క్రాప్ సర్వే డేటా అత్యంత కీలకమన్నారు. ప్రభుత్వ రాయితీలు, పథకాలు పొందడానికి మరియు ఎరువుల కొనుగోలు యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవడానికి రైతు నమోదు సంఖ్య, ప్రతి గ్రామంలో మీసేవ, సీఎస్‌సీల ద్వారా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, చాటింపు, ఫ్లెక్సీల ద్వారా రైతన్నలకు విస్తృత ప్రచారం కల్పించాలి. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం.సుజాత, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ ఎస్. స్వర్ణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హరితవనం కాలనీలో 50 లక్షలతో రోడ్డు అభివృద్ధి పనులకు శ్రీకారం

పనులు ప్రారంభించిన కొలను హనుమంత రెడ్డి



కుత్బుల్లాపూర్, (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ హరితవనం కాలనీ కె ఆర్‌సి ఆర్ ఆర్కేడ్/హరితవనం కమాన్ వద్ద సిఎంఐ నిధుల ద్వారా మంజూరైన 50 లక్షలతో రోడ్డు అభివృద్ధి పనులను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలకు మెరుగైన రహదారులు, అవసరమైన సౌకర్యాలు కల్పించేం దుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, మైనారిటీ నాయకులు సయ్యద్ షఫీ, కాలనీ సభ్యులు సందీప్ వర్మ, సురేష్ నాయుడు, శివకృష్ణ, విక్రమ్ రెడ్డి, నవరాజు, నాగరాజు, కోటయ్య నాయక్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగారం సాయి ధరణి కాలనీలో లడ్డు కైవసం చేసుకున్న ఎంబడి ఉమేష్ రేఖ



చిన్నారులకు మెమొంటోస్ అందించడం జరిగింది.

కీసర, (సింగిడి):: ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్ పరిధి సాయి ధరణి కాలనీ ఫేస్ వన్లో అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాధుని లడ్డూ వేలం పాట 2,16,000 రూపాయలకు ఎంబడి ఉమేష్ రేఖ దక్కించుకున్నారు. అలాగే చిన్న లడ్డు మాదాసు కుమార్ పద్మ 1,44,000 రూపాయలకు దక్కించుకోవడం జరిగింది. అదేవిధంగా లక్కీడ్రాలో శ్రీకాంత్, లిఖిత అదృష్టం వరించడం జరిగింది. ఈ యొక్క లడ్డు వేలం పాటలో మాజీ కౌన్సిలర్ గూడూరు అంజన్న, కాలనీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ అక్బర్ బాషా, కాలనీ జనరల్ సెక్రెటరీ బిఆర్ఎస్ పార్టీ 16 వార్డ్ ప్రెసిడెంట్ ములుగురు శ్రీనివాస్ గౌడ్, కాలనీ సభ్యులు, మహిళలు, పిల్లలు సాంస్కృతి కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం

ఇప్పుడున్న స్థలంలోనే నూతన బస్టేషన్ నిర్మించాలి

ఊరికి దూరమైతే..
ప్రజలకు ఇబ్బందులే!
ప్రభుత్వం నిర్ణయాన్ని
పునరాలోచించాలి
సీపీఐ నియోజకవర్గ
ఇన్‌చార్జి గంటి సురేష్‌కుమార్



కొడంగల్, (సింగిడి): కొడంగల్ పట్టణంలో నూతనంగా నిర్మించే నూతన బస్టేషన్ ఇప్పుడున్న స్థలంలోనే నిర్మించాలని, ఊరిచివరన బస్టేషన్ నిర్మిస్తే ప్రయాణికులకు, చిరువ్యాపారులకు అంతరాయం ఏర్పడుతుందని సిపిఐ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జీ గంటి సురేష్ కుమార్ అన్నారు. బస్టాండ్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ప్రతిపాదిత స్థలంపై రాష్ట్రప్రభుత్వం పునరాలోచించాలని సీపీఐ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంటి సురేష్‌కుమార్ అన్నారు. ప్రస్తుత ఉన్న బస్టాండ్ ప్రాంతంలోనే కాంప్లెక్స్ నిర్మించి, బస్టాండ్ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని ఆయన సూచించారు. హైదరాబాద్ రూట్‌లో పట్టణానికి చివరన నూతన బస్టాండ్ నిర్మించాలనే ప్రతిపాదన వల్ల ప్రయాణికులతో పాటు స్థానిక ప్రజలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. బస్టాండ్ చుట్టూ ఏర్పడే రాకపోకలే పట్టణంలోని చిన్న వ్యాపారాలు, చిరు వ్యాపారులకు ప్రధాన ఆధారమని తెలిపారు. ప్రస్తుత అంబేద్కర్ చౌరస్తా ప్రాంతంలో ప్రయాణికుల రాకపోకలతో అనేక చిన్న దుకాణాలు, చిరు వ్యాపారాలు కొనసాగుతున్నాయని సురేష్‌కుమార్ అన్నారు. ప్రయాణికులు కొనుగోలు చేయడం ద్వారా కొన్ని కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. బస్టాండ్‌ను పట్టణానికి దూరంగా తరలిస్తే ఆయా వ్యాపారాలకు గిరాకీ తగ్గి ఉపాధి అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. బస్టాండ్ ఒకచోట, పట్టణంలోని ప్రధాన వ్యాపార ప్రాంతాలు మరోచోట ఉంటే ప్రజలు రాకపోకలకు అదనపు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. స్థలం సరిపోవడం లేదనే కారణంతో బస్టాండ్‌ను పట్టణానికి దూరంగా తరలించడం సరైన నిర్ణయం కాదని ఆయన అన్నారు. ప్రస్తుత బస్టాండ్‌కు సమీపంలోనే అందుబాటులో ఉన్న స్థలాన్ని పరిశీలించి నూతన బస్టాండ్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే ముందు ప్రజల అవసరాలు, స్థానిక వ్యాపారుల ఉపాధి, పట్టణ భవిష్యత్ రాకపోకలను దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదిత స్థలాన్ని మరోసారి పరిశీలించాలని గంటి సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు.

తాగునీరు సరఫరా చేసే గోదావరి
పైప్‌లైన్లు పగిలి రోడ్ల పాలవుతున్న నీరు

రోజుల తరబడి రోడ్లపై తాగునీరు ప్రవహిస్తున్న పట్టించుకోని జలమండలి అధికారులు. ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకోవడం అంటే ఇదేనా?



కుత్బుల్లాపూర్, (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం షాపూర్ నగర్ జలమండలి పరిధిలోని గాజులరామారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలోని రొడామేస్త్రి నగర్ సమీపం అపోలో ఫార్మసీకి ఎదురుగా తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్ పగిలి భారీ స్థాయిలో గోదావరి జలాలు రోడ్లపాలవు తున్నాయి. జలమండలి కార్యాలయం కి కూత వేటు దూరంలో ఉన్న పైప్లైన్ పగిలిభారీస్థాయిలో గృహ అవసరాలకు ఉపయోగపడే గోదావరి జలాలు రోడ్ల వెంట పరుగులు పెడుతున్న పట్టిం చుకున్న నాథుడు కరువడంతో(జలమండలి అధి కారులు) స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 300 కిలోమీటర్ల దూరం నుండి వందల కోట్ల రూపాయల ప్రజాధ నాన్ని వెచ్చించి హైదరాబాద్ పట్టణ వాసుల కోసం తాగునీటి అవసరాలను తీర్చుటకు తీసుకు వచ్చే గోదావరి జలాలు రోజుల తరబడి రోడ్ల పాలవుతున్న పట్టించుకోవడానికి పాలకుల నిర్లక్ష్యం కారణమా, అధికారుల అలసత్వం పుణ్య మా అంటూ స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేసు న్నారు. ఇంటి అవసరాల కోసం సరఫరా చేస్తున్నా డు గోదావరి జలాలు గృహ వసరాలకు సరిపోవ డం లేదు, మరో 15 నిమిషాలు పెంచమని స్థానిక ప్రజలు అధికారులను ప్రాధేయపడినా కనికరిం చని జలమండలి అధికారులు రోజుల తరబడి గోదావరి జలాలు రోడ్లపై పారుతున్న నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడ వారి విధులకు నిదర్శనమని అధికారుల తీరును తప్పు పడుతు న్నారు. ఈ సంవత్సరము అరకొర వర్షాల కారణ ంగా ప్రాజెక్టులు, చెరువులలో సరి అయిన నీరు చేరకపోవడంతో నీటి కటకట ప్రారంభమయ్యే పరిస్థితి దాపురించిందని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి కరువు పరిస్థితు లలో సైతం ఎంతో విలువైన గోదావరి జలాలను పైపులు పగిలిపోయి రోడ్లపై పారుతున్న పగిలిన పైపులైన్లకు మరమ్మత్తులు చేపట్టి నీటి దుర్వినియోగాన్ని నివారించడంలో జలమండలి అధికారులు పూర్తిగా వైఫల్యం పొందారని అధికారుల తీరును తప్పుబడుతున్నారు. గృహాలకు సరఫరా చేసే గోదావరి జలాలు దుర్వినియోగం చేస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన శిక్షలు అమలు చేస్తామని హెచ్చరిస్తున్న జలమండలి అధికారుల హెచ్చరికలను ప్రభుత్వం ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలి, నీరు వృధా కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేస్తున్న జలమండలి అధికారులు నిర్లక్ష్యం వహించడంలో ఆంతర్యమేమిటి అని ప్రశ్నిస్తున్నారు. గోదావరి జిల్లాల సరఫరా చేసే పైపులు పగిలి నీరు రోడ్లపై పారుతున్న వాటి మంమ్మతులు చేపట్టడంలో, నీటి వృధాను అరికట్ట డంలో అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయ లోపమా! నిర్లక్ష్యమా? అంతు చిక్కడం లేదని ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారు లు అప్రమత్తంగా ఉంటూ నీటిని సరఫరా చేసే పైపులైన్లు ఎక్కడ పగిలిపోయిన సత్వరమే చర్యలు తీసుకొని నీటి వృధాను వెంటనే అరికట్టేలా చర్యలు తీసుకోవాలని, లేనిచో జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు.

మణికొండ కేపీఆర్ కాలనీలో ఘనంగా గణేష్ లడ్డూ వేలం

6,15,116లకు దక్కించుకున్న
గుంటూరు మల్లికార్జున్



రాజేంద్రనగర్, (సింగిడి): పీఆర్ కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన గణేష్ నవరాత్రి వేడుకలు గురువారం అత్యంత వైభ వంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ముగి శాయి. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్వామివారి విశిష్ట లడ్డూ వేలం పాట స్థానికుల్లో తీవ్ర ఆసక్తిని, ఉత్సాహాన్ని నింపింది. పోటీపడి మరీ వేలంలో పాల్గొన్న భక్తుల నడుమ కేపీఆర్ కాలనీకి చెందిన గుంటూరు మల్లికార్జున్ రూ. 6,15,116 ల కు పలికి స్వామివారి ప్రసాదాన్ని దక్కించుకున్నా రు. లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకోవడం తన పూర్వజన్మ సుకృతమని, స్వామివారి ఆశీస్సులతో తమ కుటుంబానికి, కాలనీవాసులకు సకల శు భాలు కలుగుతాయని ఈ సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేశారు. లడ్డూను దక్కించుకున్న గుంటూరు మల్లికార్జున్ కాలనీ ప్రెసిడెంట్ ఈ. గంగాధర్ రావు, అసోసియేషన్ సభ్యులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్ . గంగాధర్ రావు మాట్లాడుతూ... "ప్రతి ఏటా మన కేపీఆర్ కాలనీలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను కాలనీవాసులందరి సహకారంతో ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నాం. ఈసారి లడ్డూ వేలం పాటకు విశేష స్పందన రావడం చాలా సంతోషక రం. ఈ వేలం ద్వారా వచ్చిన నిధులను కాలనీ అభివృద్ధికి, ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తాం" అని పేర్కొన్నారు.

ప్రాథమిక పరిశోధనను ప్రజోపయోగంగా మార్చాలి

గీతం ఆతిథ్య ఉపన్యాసంలో
శాస్త్రవేత్త డాక్టర్ బిపిన్ కుమార్ గుప్తా





పటాన్చెరు, (సింగిడి): ప్రాథమిక పరిశోధనను ప్రజోపయోగంగా మార్చాలిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల మధ్య సంబంధాన్ని బలోపేతం చేయాలని న్యూఢిల్లీలోని సీఐఎస్ఆర్-జాతీయ భౌతిక శాస్త్ర ప్రయోగశాల శాస్త్రవేత్త డాక్టర్ బిపిన్ కుమార్ గుప్తా అన్నారు. శాస్త్రీయ జిజ్ఞాసను పెంపొందించుకో వాలని, లక్ష్యాలను పట్టుదలతో సాధించాలని, భారతదేశ సాంకేతిక స్వావలంబనను బలోపేతం చేయగల స్వదేశీ సాంకేతికతల అభివృద్ధికి దోహ దపడాలని విద్యార్థులను ప్రోత్సహించారు. హైదరా బాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఆత్మని ర్భర్ భారత్ కోసం కొత్తగా అభివృద్ధి చెందుతున్న నానో/క్వాంటం పదార్థాల రూపకల్పన, ఆవిష్కరణ, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి అనే అంశంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశా రు. సెమీకండక్టర్, క్వాంటం సాంకేతికతల కేంద్రం సహకారంతో, స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని ఈఈసీఈ విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ంది. డాక్టర్ గుప్తా విద్యార్థులకు నానోపదార్థాలు, అభివృద్ధి చెందుతున్న టుడీ (ద్విమితీయ) పదార్థాలు, క్వాంటం పదార్థాలను ప్రాథమికంగా పరిచయం చేస్తూ, వాటి పరిమాణంపై ఆధారపడిన లక్షణాలు, సంభావ్య అనువర్తనాలను వివరిం చారు. క్వాంటం పదార్థాల పరిశోధన పరిణామ క్రమాన్ని ఆయన వివరిస్తూ, నానో/క్వాంటం సాంకేతికతలలోని పురోగతులు ఆరోగ్య సంరక్షణ, బయోమెడికల్ ఇమేజింగ్, ఫార్మాస్యూటికల్స్, కమ్యూనికేషన్స్, ప్రజాభద్రత, నకిలీ నిరోధక సాంకే తికతలకు ఎలా దోహదపడతాయో వివరించారు. స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రశాంతరెడ్డి ముడిమాల, అతిథికి స్వాగతం పలికి, విద్యార్థులకు ఆయనను పరిచయం చేసి, సత్క రించారు. ఈఈసీఈ విభాగానికి చెందిన డాక్టర్ శాంతను సాహా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

గీతంలో పరిశ్రమ-ఆధారిత అభ్యాసం

డేటా సైన్స్ ఆచరణాత్మక శిక్షణపై రెండు రోజుల కార్యశాల ప్రారంభం హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం, డేటా సైన్స్ ఆచరణాత్మకం గా వినియోగించడంపై దృష్టి సారించి, విద్యార్థు లకు పరిశ్రమ-ఆధారిత అభ్యాస అనుభవాన్ని అందించేందుకు గాను 'డేటా సైన్స్: ఆచరణాత్మక శిక్షణ' పేరిట రెండు రోజుల కార్య శాలకు గురు వారం శ్రీకారం చుట్టింది. డేటా సైన్స్ సాధనాలు, డేటా విశ్లేషణ, ప్రీప్రాసెసింగ్, మెషిన్ లెర్నింగ్, టాబ్లో ఉపయోగించి డేటా విజువలైజేషన్, వాస్తవ ప్రపంచ కేస్ స్టడీస్, పరిశ్రమ అను వర్తనాలపై ఆచరణాత్మక అనుభవాన్ని అందించడం ద్వారా, విద్యాపరమైన అభ్యాసానికి, పరిశ్రమ పద్ధతులకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చేలా ఈ కార్యశాలను రూపొందించారు. హబ్ల్ ముఖ్య కార్యనిర్వహణా ధికారి, వ్యవస్థాపకుడు, ఏఐస్ సాఫ్ట్ టెక్ యొక్కటెక్ లీడ్, టాబ్లో రాయబారి దేవాంశు తాయల్ ప్రధాన శిక్షకుడిగా వ్యవహరించి, ఆచరణాత్మక సెషన్లు, పరిశ్రమ-కేంద్రీకృత అంత ర్దృష్టుల ద్వారా విద్యా ర్థులను నిమగ్నం చేశారు. బి.టెక్. మూడవ, నాల్గవ ఏడాది, ఎం.టెక్. విద్యా ర్థులు ఈ కార్యశాలలో చురుకుగా పాల్గొంటూ, డేటాను అర్థవంతమైన అంతర్దృష్టులుగా, ప్రభా వంగా మారుస్తూ, నేర్చుకో వడానికి, అన్వేషిం చడానికి, విశ్లేషించడానికి, దృశ్య మానం చేయడాని కి, ఆవిష్కరించడానికి ఒక అవకాశాన్ని పొందారు. సీఎస్ఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ మహబూబ్ షేక్ బాషా ప్రారంభోత్సవ కార్యక్రమానికి సభాధ్య క్షత వహించారు. కార్య క్రమ నిర్వాహకురాలు ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్, ప్రధాన శిక్షకుడిని ఆహ్వానించి, విద్యార్థులకు పరి చయం చేశారు. జ్యోతి బంకపల్లి, డాక్టర్ యు. శ్రీని వాస్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను
త్వరితగతిన పరిష్కరించాలి

బాధితులకు పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలి
రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య



నంగారెడ్డి బ్యూరో, (సింగిడి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ,

ప్రభాతనవ సింగిడి SINGIDI తెలుగు దినపత్రిక ప్రతి రంగూ ఓ నిజం

సింగిడి

వయోవృద్ధుల హక్కులు సంక్షేమంపై

విస్తృత అవగాహన కల్పించాలి

ఎస్పీ సునీత రెడ్డి



వనపర్తి ప్రతినిధి, (సింగిడి): వయోవృద్ధుల హక్కులు, సంక్షేమంపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ డి.సునీత రెడ్డి సూచించారు. అక్టోబర్ 1వ తేదీన నిర్వహించనున్న అంతర్జా తీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా గురువారం వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాల యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీత రెడ్డి చేతుల మీదుగా "వయోవృద్ధుల సమాచార సంచిక" పుస్తకంతో పాటు తల్లిదండ్రులు, వయోవృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టం–2007 కు సంబంధించిన పుస్తకాలను విడుదల చేశారు. అదేవిధంగా వయోవృద్ధుల హక్కులు, సంక్షేమం, వారికి లభించే ప్రభుత్వ సేవలు, చట్టపరమైన రక్షణకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచేలా పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేయ నున్న డిస్ప్లే బోర్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వయోవృద్ధుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, చట్టపరమైన రక్షణ తదితర అంశాలపై వయోవృద్ధులు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వయోవృద్ధులు తమకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు, చట్టపరమైన హక్కులను వినియోగించుకునేలా అవసరమైన సమాచారం అందించాలని, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీ ఎం హెచ్ ఓ భాస్కర్ నాయక్, డిఆర్డిఓ రామ మహేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు, సిడిపిఓ లు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిని వేగవంతం చేయాలి

జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు



యాదాద్రి ప్రతినిధి, (సింగిడి): యాదాద్రి భువనగిరి జిల్లా లోని ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూమ్ (2బీఎఖ) ఇండ్ల నిర్మాణ ప్రగతిపై గురువారం జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు సంబంధిత అధికా రులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతి, లబ్ధిదారుల ఎంపిక, మంజూరులు, నిధుల విడుదల తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలు సుకున్నారు. జిల్లాలోని అర్హులైన గుడిసెదారులందరినీ గుర్తించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పనులను వేగవంతం చేసి, నిర్దిష్ట సమయంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు. ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత మంజూరుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని సూచించారు. ఇండ్ల మంజూరు, నిధుల విడుదలలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను అధిగమించేందుకు 3 స్థాయి నుంచి 1 స్థాయికి సడలింపు కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. దీనివల్ల అర్హులైన లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రయోజనాలు వేగంగా అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన నిర్వహించి, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ అలివేలు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో వ్యక్తిత్వ వికాసం



సూర్యాపేట ప్రతినిధి,(సింగిడి): జాతీయ సేవ పథకంతో విద్యార్థులలో వ్యక్తిత్వవికాసం అభివృద్ధి చెందుతుందని ఎస్ వి డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ ప్రొఫెసర్ వి. వెంకటేషులు అన్నారు. గురువారం ఎన్ ఎస్ ఎస్ ఆవిర్భావ దినోత్స వం సందర్భంగా కళాశాలలో అధ్యాపకులతో కలిసి ఎన్ఎస్ఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సమాజ సేవలో పాల్గొనాలనే ఉద్దేశంతో జాతీయ సేవ పథకా న్ని స్థాపించడం జరిగిందని ప్రతి ఏటా సెప్టెం బర్ 24 న జాతీయ సేవ పథకం దినోత్సవాన్ని జరుపుకుంటామని అన్నారు. దేశ రక్షణలో సెకండ్ లైన్ అఫ్ ఆర్మీగా ఎన్ఎస్ఎస్ వాలం టీర్లు పిలువబడతారని గ్రామాలలో వివిధ రకాల వ్యాధుల పట్ల అవగాహన కల్పించడం లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల కృషి అభినందనీ యమని తెలిపారు. వారంలో రెండు పర్యా యాలు కళాశాల ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. ప్రోగ్రాం ఆఫీసర్లు ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యత ఉపయోగాలను వివరించి విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించా రు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపా ల్ ఎన్ఎస్ఆర్ శాస్త్రి ప్రోగ్రాం ఆఫీసర్లు సింగ్ మధు,,అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్‌గా చంద్రయ్య



చింతపల్లి, (సింగిడి): 2026–27 విద్యా సంవత్సరానికి గాను ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ గా ఎంపికైన జె. చంద్రయ్య ను పీఈటీఏ టీఎస్, దేవరకొండ డివిజన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని కురుమేడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్న జంగిటి చంద్రయ్య విద్యార్థులను కబడ్డీ, వాలీబాల్ వంటి క్రీడల్లో తీర్చిదిద్దుతూ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలతో పాటు జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా శిక్షణ ఇవ్వడంతోపాటు మార్గదర్శిగా కృషి చేయ డం అభినందనీయమన్నారు.ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తిం చి ఎస్ఏఐ స్పోర్ట్స్ హాస్టళ్లలో చేరేలా ప్రోత్సహిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తు కు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అలాగే నల్గొండ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, కాంప్లెక్స్ సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు తదితర అవకాశాల కల్పనకు సహకరించడం జరుగుతుందని తెలిపారు.విద్యార్థుల క్రీడా ప్రతిభకు పదును పెట్టిన కోచ్‌గా, మంచి మార్గదర్శిగా చంద్రయ్య చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఉత్తమ అవార్డు లభించడం అభినందనీయమని పీఈటీఏ టీఎస్ దేవరకొండ డివిజన్ ప్రతినిధులు పేర్కొన్నారు. అదేవిధంగా మండల పిఆర్టియు అధ్యక్షుడు పాల్యాయి వాసుదేవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బెక్కం యాదయ్య, మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు చంద్రయ్యకు శుభాకాంక్షలు అందజేశారు.

ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా వైద్య శిబిరం



యాదాద్రి ప్రతినిధి, (సింగిడి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని హోమియోపతి ఆసుపత్రిలో "ఆయుష్" ఆధ్వర్యంలో 11వ ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధన్వం తరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లా ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ లక్ష్మణ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యశాస్త్రం అతి పురాతనమైన చికిత్సా విధానమని ఆయన అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అల్లోపతీ, హోమియోపతి మరియు ఆయుర్వేద వైద్య విధానంలో రోగులను పరీక్షించి చికిత్స చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆహార నియమాలు పాటించి , నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోగలరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ జిల్లా ఇంచార్జి డాక్టర్ వి. విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సు, వైద్య శిబిరంలో జిల్లా ఆసుపత్రి ఆర్ ఎం ఓ డాక్టర్ చక్రధర్, జిల్లా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దుర్గా ప్రకా ష్, సామాజిక కార్యకర్తలు మాటూరి బాలేశ్వర్, జంపాల అంజయ్య, హోమియోపతి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ భారతి, డాక్టర్ సంధ్య, డాక్టర్ అరుణ, ఫార్మాసిస్టు మంజుల, ఆసుపత్రి సిబ్బంది బాల లక్ష్మి, సంధ్యా రాణి, అజీమ్, రమేష్, పలువురు రోగులు పాల్గొన్నారు.

భూసేకరణలో రైతులకు అన్యాయం జరగొద్దు

అర్హులకు పరిహారం, పునరావాస ప్రయోజనాలు అందాలి



జయశంకర్ /భూపాలపల్లి బ్యూరో, (సింగిడి): అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోతున్న రైతుల హక్కులకు భంగం కలగకుండా భూసేకరణ ప్రక్రియను చట్టబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ రెవెన్యూ అధికారు లను ఆదేశించారు. భూసేకరణలో చిన్నపాటి పొరపాటు కూడా రైతుల కు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉన్నందున రికార్డుల పరిశీలన నుంచి పరిహారం చెల్లింపు వరకు ప్రతి దశలో అధికారులు అప్రమ త్తంగా వ్యవహరించాలని సూచించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో భూసేకరణ చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులపై రెవెన్యూ అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీలో ఓఎస్డీగా విధులు నిర్వహిస్తున్న మనోహర్ ఈ శిక్షణలో పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. నీటిపారుదల, సింగరేణి, జెన్‌కో, జాతీయ రహదారులు తదితర అభివృద్ధి ప్రాజెక్టులకు భూసేకరణ జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. అన్ని మండలాల్లో భూసేకరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో అర్హులైన రైతులకు చట్టప్రకారం పరిహారం, పునరావాసం, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూములు కోల్పోతున్న రైతుల సందేహా లను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ ప్రక్రియలో జాప్యానికి తావులేకుం డా చూడాలని ఆదేశించారు. భూసేకరణలో అర్హులైన ఏ ఒక్కరైతుకూ అన్యాయం జరగకుండా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాల ని ఓఎస్డీ మనోహర్ సూచించారు. చట్టాలు, నిబంధనలకు అనుగుణం గా భూసేకరణ ప్రక్రియలోని ప్రతి దశను పక్కాగా నమోదు చేయాలని, అవసరమైన చోట్ల సమావేశాల మినిట్స్‌తో పాటు వీడియో రికార్డింగ్ కూడా చేపట్టాలని తెలిపారు. భూములు ఇచ్చే రైతులను కేవలం భూమి ఇచ్చేవారిగా కాకుండా అభివృద్ధి ప్రాజెక్టుల్లో భాగస్వాములుగా గౌరవిం చాలని అన్నారు. అధికారుల వ్యవహారశైలి వల్ల రైతుల మనోభావాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అసైన్డ్, ప్రభు త్వ భూములకు సంబంధించి తలెత్తే వివాదాలను నిబంధనల ప్రకారం విచారించి పరిష్కరించాలని మనోహర్ తెలిపారు. ఆయా భూముల్లో సాగు చేసుకుంటున్న వారి అర్హతలను తహసీల్దార్లు క్షుణ్ణంగా పరిశీలిం చాలన్నారు. భూమి విస్తీర్ణం, హక్కులు, రికార్డుల వివరాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించా లని సూచించారు. కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఏఓ శ్రీనివాసులు, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది లు పాల్గొన్నారు.

ఘనంగా బాల గణేష్ నిమజ్జన శోభాయాత్ర



చింతపల్లి, (సింగిడి):మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్ వద్ద బాల గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ గణేష్ విగ్రహ నిమజ్జన శోభాయాత్రను గురువారం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా స్వామివారి లడ్డూలు, రూపాయల హారాన్ని వేలం వేయగా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వామివారి పెద్ద లడ్డును రూ. 2,27, 000లకు ఉప్పల మోహన్ బాబు, చిన్న లడ్డును రూ. 1,15,000లకు ఊరే కోట య్య, రూపాయల హారాన్ని రూ. 50, 000 లకు ఇంద్రకంటి మాధవా చారి వేలంలో దక్కించుకున్నారు. అంతకు ముందు రోజు స్వామివారికి 108 రకాల నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి చిన్నారుల చేత ఉట్లు కొట్టే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు భక్తులను, చిన్నారులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గురువారం నిర్వహించిన నిమజ్జన శోభా యాత్రలో గణేష్ విగ్రహాన్ని గ్రామ ంలోని పురవీధుల గుండా ఆట పాటలు, నృత్యాల మధ్య ఊరేగిం చారు. భక్తులు భక్తిశ్రద్ధ లతో పాల్గొని 'గణపతి బప్పా మోరియా' అంటూ నినాదాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం స్థానిక చెరువులో గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్ర మంలో దాచేపల్లి మధు, నీలకోటేష్, ఊరే శ్రీని వాస్, పందనపు ఆంజనే యులు, పాల్యా యి నిరంజన్, ఎన్నం శేఖర్, సోమ్లా నాయక్, ఉప్పల యాద య్య, రాఘు వేందర్, ఆగిరి రవీందర్, అల్లం పల్లి సంతోష్ కుమార్, రవి యాదవ్, నాళ్ల శివకుమార్ మంచుకొండ జంగయ్య, లతోపాటు బాల గణేష్ యూత్ అసోసియే షన్ సభ్యులు, మహిళలు, పాల్గొన్నారు.

కైతులకు కరెంటు.. నీళ్లు ఇవ్వాలి

కాంగ్రెస్ వచ్చాక కరెంటు కష్టాలు
రైతులకు 4–5 గంటలు కూడా విద్యుత్ ఇవ్వలేని దుస్థితి
సింగరేణిలో బొగ్గు నిల్వలు తగ్గాయి
కేటీపీపీకి సరఫరా పడిపోయింది



భూపాలపల్లి, (సింగిడి): రైతులకు సాగునీరు నిరంతర విద్యుత్ అందించడంలో రాష్ట్ర ప్రభుత్వ విఫలమైం దని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ శివారులోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ నేతల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కరెంటు లేక మోటార్లు నడవకపోవడంతో గోదావరిలో సమృద్ధిగా నీరున్న రైతులు సాగునీరు కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నా రు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కెసిఆర్ ప్రభుత్వం విద్యుత్తు రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొన్నారు. 2014లో రాష్ట్రంలో సుమారు 19 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, తమ ప్రభుత్వ హయాంలో దాదాపు 30 లక్షల కనెక్షన్లు ఇచ్చామని తెలిపారు. వ్యవ సాయానికి ఉచితంగా, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు భారీగా పెట్టుబడులు పెట్టినట్లు చెప్పారు. విద్యుత్ సామర్థ్యం పెంచాం 2014 నుంచి 2023 వరకు విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం,పంపిణీ రంగాల్లో సుమారు రూ. లక్ష కోట్ల మేర పెట్టుబడును పెట్టినట్లు పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. కాకతీయ, భద్రాది, తదితర విద్యుత్ కేంద్రాలతో పాటు భూపాలపల్లి, ఎన్టీపీసీ ప్రాజెక్టుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచామని తెలిపారు. రాష్ట్రంలో 5,500 మెగావాట్ల స్థాయి నుంచి 22 వేల మెగావాట్ల కు పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అని పేర్కొన్నారు. బొగ్గు సరఫరా పై కాకతీయ పవర్ స్టేషన్లు అవసరమైన స్థాయిలో బొగ్గు సరఫరా కావడంలేదని పళ్ళ ఆరోపించారు. అనంతరం మాజీ మంత్రి బిఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు చెల్పూర్ కేటీపీపీ ని సందర్శిచ డానికి వచ్చిన అనంతరం అనంతరం మాట్లాడు తూ... కెసిఆర్ హయంలో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తు అందిస్తే.. ప్రస్తుతం రైతులకు 4–5 గంటలు కూడా కరెంటు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది అన్నారు. తెలంగాణ ఏర్పడిన నాటికి 7,778 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ సామర్థ్యాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో 19,472 మెగావాట్లకు పెంచిందని చెప్పారు. 400 కేవి సబ్ స్టేషన్ లను 6 నుంచి 28 కు 220 కేవీ సబ్ స్టేషన్లను 51నుంచి103 కు పెంచి సుమారు 30 లక్షల వ్యవసాయ పంప్ సెట్లకు ఉచిత విద్యుత్తు అందించామని పేర్కొన్నారు. భూపాలపల్లి మార్చి ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పరిశ్రమలు,ఇల్లు, రైతులకు విద్యుత్తు కోతలు తప్పడం లేదని విమర్శించారు. విద్యుత్ సమస్యలపై బిఆర్ఎస్ కార్యక్ర మాన్ని అడ్డుకునేందుకు తెల్లవారుజా మునే నాయకులను అరెస్టు చేయడం ప్రభుత్వ బయానికి నిదర్శనం అన్నారు. అనంతరం 20 మంది బృందం కేటీపీపీ ని సందర్శించారు.

కేటీపీపీకి బొగ్గు కొరత

భూపాలపల్లి సింగరేణి ఓసి–1, ఓసి–2 ఓసి–3ల్లో బొగ్గు నిలువలు తగ్గిపో యాయని ఎర్రబెల్లి అన్నారు. రోజుకు సుమారు 5 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి కావలసి ఉండగా 2 వేల టన్నులు కూడా రావడం లేదు అని తెలిపారు. గడ్డి గాని పల్లి వద్ద భూసేకరణ జరగక ఓపెన్ కాస్ట్ విస్తరణ నిలిచిపోయింది అన్నారు. బొగ్గు కొరత కారణంగా కేటీపీపీ రెండు యూనిట్లలో ఆశించిన స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదన్నారు. స్టేజ్ –1 లో 500 మెగావాట్లు, స్టేజ్–2లో 600 మెగావాట్లు ఉత్పత్తి కావలసి ఉండగా ప్రస్తుతం రోజు కు 600 మెగావాట్లు కూడా ఉత్పత్తి రావ డం లేదన్నారు. సింగరేణి కి రాష్ట్ర ప్రభు త్వం సుమారు రూ. 52 వేలకోట్ల బకాయి లు చెల్లించాల్సి ఉందని, బకాయిలు చెల్లించి సంస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. నాసిరకం బొగ్గు వినియోగంతో జెన్కోకు రూ. 2,900 కోట్ల నష్టం వాటిల్లిందని ఆరోపించారు. సింగరే ణిలో 4,000 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నా మూడేళ్లుగా బూట్లు, సాక్స్ లు,డ్రిల్లింగ్ బిట్లు వంటి భద్రతా సామాగ్రి కూడా అందడం లేదని ఆరోపించారు. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్తు అందించి పంటలు ఎండిపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పౌర సేవలు ప్రజల ఇంటి వద్దకే

ప్రణాళికలు సిద్ధం చేసిన ప్రభుత్వం



హన్మకొండ, (సింగిడి): మీసేవా కేంద్రా ల ద్వారా అందించే పౌర సేవలను ప్రభుత్వం ఇకనుండి ప్రజల ఇంటి వద్దకే తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. మీసేవా కేంద్రాల ద్వారా ప్రజలు గంటలు, రోజులు తరబడి నిరీక్షించే ప్రక్రియకు స్వస్తి చెప్పనుంది. ఇక నుండి మీసేవ డోర్ డెలివరీ ద్వారా పలు ధృవీకరణ పత్రాలు, ఆధార్‌కు సంబంధించిన కొన్ని సేవలు, రిజిస్ట్రే షన్, పోలీస్ శాఖకు చెందిన సేవలను పొందే అవకాశం కల్పించింది. ఇంటి వద్దే మీ సేవ సర్వీసులను పొందేం దుకు 1100 టోల్‌ఫ్రీ నంబర్, మీసేవ పోర్టల్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొనే వెసులుబాటు కల్పించింది. పౌర సేవలను అందించేందుకు తొలుత ఎంపిక చేసిన ప్రాంతాలను మాత్రమే పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయబో తున్నారు. ప్రజలు స్పందించే తీరుకు అనుకూలంగా రాష్ట్రవ్యాప్తంగా పౌరసేవలను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకు ఇంటి వద్దకే మీసేవ సేవలను పొందే అవకాశం కల్పించారు. 'మీసేవ డోర్ డెలివరీ సర్వీసెస్'ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభిం చారు. ఈ విధానం ద్వారా పౌరులు తమకు అవసరమైన సేవలను ఇంటి నుంచే బుక్ చేసుకొనే వెసులుబాటును కూడా కల్పించింది. ఇందుకోసం 1100 టోల్‌ఫ్రీ నంబర్ కు ఫోన్ చేయడం, అధికారిక మీసేవ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకొనే అవకాశం కల్పించారు. స్లాట్ బుకింగ్ పూర్తైన తర్వాత నిర్ణయించిన సమయంలో మీసేవ ఎగ్జిక్యూటివ్, ఏజెంట్ నేరుగా దరఖాస్తుదారుడి ఇంటికి వచ్చి అవసరమైన పత్రాలను పరిశీలించి, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన సేవలను అంది స్తారు. మీసేవ డోర్ డెలివరీ ద్వారా పలు కీలకమైన పౌర సేవలను పొందే అవకాశం ఉంది. జనన, మరణ ధృవీకరణ పత్రాలు, వాటిలో అవసరమైన మార్పులు, పిల్లల పేర్లను చేర్చడం వంటి సేవలు అందుబాటులో ఉం టాయి. అలాగే కులం, ఆదాయం, నివాసం, పుట్టిన తేదీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, మైనారిటీ, ఓబీసీ వంటి ధృవీకరణ పత్రాల సేవలను కూడా ఇంటి వద్దే పొందవచ్చు. ఆధార్‌కు సంబంధించిన కొన్ని సేవలు కూడా ఈ విధానం లో అందుబాటులోకి తీసుకొచ్చారు. కొత్త ఆధార్ నమో దు, 5 ఏళ్లలోపు చిన్నారుల ఆధార్‌కు సంబంధించిన సేవ లు, జనాభా వివరాల్లో మార్పులు, పేరు, మొబైల్ నంబర్, చిరునామా మార్పు వంటి సేవలను కూడా ఇందులో ఉన్నాయి. ప్రజలకు అవసరమైన రిజిస్ట్రేషన్ శాఖ సేవలను కూడా డోర్ డెలివరీ విధానంలో అందించను న్నారు. ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) కాపీలు, ఐజీఆర్ ఎస్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్, సొసైటీ రిజిస్ట్రేషన్, పునరుద్ధరణ, ధ్రువీకరించిన ప్రతుల వంటి సేవలు ఇందులో ఉన్నాయి. పోలీస్ శాఖకు సంబంధించిన కొన్ని ధృవీకరణ సేవలను కూడా ఇంటి వద్ద నుంచే పొందే అవ కాశం కల్పించారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, ఉద్యోగాల కారణంగా సమయం కేటాయించలేని వారికి ఈ విధానం ఉపయోగపడే అవకాశం ఉంది. మీసేవ డోర్ డెలివరీ సేవలను పొందాలనుకునే వారు 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి తమకు కావాల్సిన సర్వీసును కస్టమర్ కేర్ ప్రతినిధికి తెలియజేయాల్సి ఉంటుంది.

1100 మెగావాట్లకు 550 మెగావాట్లే ఉత్పత్తి చేస్తారా?

కాంగ్రెస్ పాలనలో విద్యుత్ వ్యవస్థ గాడి తప్పింది: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రిలక్ష్మణ్ బాబు



ములుగు ప్రతినిధి, (సింగిడి):కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు విమర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యలు, ప్లాంట్లలో ఉత్పత్తి తగ్గుదల, దేవదూల ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా అంశాలపై నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం తెలంగాణ జెన్‌కో చీఫ్ ఇంజినీర్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశా రు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ 1100 మెగావాట్ల సామర్థ్యం ఉన్న చోట కేవలం 550 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడం వల్ల ములుగు జిల్లా రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. జెన్‌కోకు సమీపంలోనే బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యుత్ ఉత్పత్తి పెంచడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. విద్యుత్ కోతల కారణంగా ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని దేవదూల పంపులు సక్రమంగా పనిచేయక రైతులకు సాగునీరు అందడం లేదని, పర్వాకాలంలోనే పరిస్థితి ఇలా ఉంటే యాసంగి సీజన్‌లో రైతులకు నీరు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. నాణ్యమైన బొగ్గు సరఫరాపై ప్రభుత్వం తగిన చర్యలు తీసు

ప్రభాతనవ సింగిడి SINGIDI తెలుగు దినపత్రిక ప్రతి రంగూ ఓ నిజం

సింగిడి

సింగరేణి గనుల్లో.. పచ్చదనం పరిమళం



మంచిర్యాల, (సింగిడి): బొగ్గు ఉత్పత్తితో పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తూనే.. శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో ఏటా దాదా పు 2 లక్షల మొక్కలను నాటుతున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీరాంపూర్ ఓసిపి ప్రాజెక్టు ఆఫీసర్ కార్యాలయ ప్రాంగ ణంలో ఖాళీగా ఉన్న ఒక హెక్టారు స్థలంలో ఐదు రకాల 500 మామిడి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా విస్తృతంగా మొక్కలు నాటుతు న్నామని తెలిపారు. ముఖ్యంగా పండ్ల మొక్కలను పెంచడం ద్వారా భవిష్యత్‌లో కోతులు, ఇతర మూగజీవాలకు ఆహారం లభించేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో పచ్చద నం పెంచడంతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు ఇది దోహదప డుతుందని వివరించారు. సింగరేణి పరిధిలోని ఖాళీ స్థలాలను క్రమంగా పచ్చని ప్రాంతాలుగా తీర్చిదిద్దే ప్రయత్నాలు కొనసాగు తున్నాయి. మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టడం ద్వారా పర్యావరణ సమతుల్యత సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మామిడి వంటి పండ్ల మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల భవిష్యత్‌లో పచ్చద నంతో పాటు జీవజాలానికి ఆహార వనరులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

విస్తృతంగా మొక్కల పెంపకం

శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో ఏటా సుమారు రెండు లక్షల మొక్కలను నాటుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, మేనేజర్-1 శ్రీనివాస్, ప్రాజెక్టు ఇంజినీర్ నాగరాజు, ప్రాజెక్టు ఆఫీసర్ ఏ.వీ. రెడ్డి, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రెటరీ బాజీ సైదా, శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు లక్కాకుల మహేష్, డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, సివిల్ హెచ్ఓడీ రవికుమార్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు మరో న్యాయమా..?

ఇల్లు కడుతుంటే బెదిరింపులేంటి..?
అనుమతులున్న ఇంటికి బెదిరింపులా..?
నిబంధనల మేరకే నిర్మిస్తున్నాం..
అధికారులు న్యాయం చేయాలి..
ఒత్తిళ్లతో హడలేత్తిస్తున్నారంటూ
బండి రాధిక ఆవేదన..





సుల్తానాబాద్, (సింగిడి): పైసా పైసా కూడబెట్టుకొని స్థలం కొనుగోలు చేసి, మున్సిపల్ నిబంధనల ప్రకారం అనుమతి తీసు కొని ఇంటి నిర్మాణం చేపడుతుంటే కొందరు అడ్డం కులు సృష్టిస్తూ బెదిరింపుల కు గురిచేస్తున్నారని సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రంలో ని గణేష్‌నగర్ కు చెందిన బండి రాధిక ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు జోక్యం చేసుకుని వాస్తవాలను పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.రాధిక తెలిపిన వివరాల ప్రకారం.. 2024లో భూసారపు రాజ లింగు వద్ద సుల్తానాబాద్ శివారు గణేష్‌నగర్ లోని సర్వే నంబర్ 940/ఈ/1/1/1/1/1లో 25 0.50 గజాల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. గతంలో నిర్మిం చుకున్న ఇంటిని విక్రయించి వచ్చిన నగదుతో, మున్సిప ల్ నిబంధనల మేరకు ఆన్‌లైన్ అనుమతి పొందిన అనంతరం ఇంటి నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. అయితే నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తమపై ఒత్తిడి తెస్తూ పనులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్ర జాప్రతినిధి పలుకుబడిని ఉపయోగించి ఇంటి ముందు చేపడుతున్న ప్రహరీ గోడ పనులను సై తం నిలిపివేయించారని పేర్కొన్నారు. ఇప్పటికే 30 అడుగుల సెట్‌బ్యాక్ ఉంచినప్పటికీ మరింత స్థలం వదలాలని ఒత్తిడి చేస్తున్నా రని తెలిపారు. "పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు మరో న్యాయ మా?" అని రాధిక ప్రశ్నించారు. తమ కుటుంబం చిన్నస్థాయి వ్యాపారంతో జీవనం సాగిస్తోందని, ఎంతో కష్టపడి సంపాదించిన డబ్బుతో ఇంటి ని ర్మాణం చేపట్టా మని తెలిపారు. అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి సమస్యను వివరించి నప్పటికీ పరిష్కారం లభించలేదని ఆవేదన వ్య క్తం చేశారు.తమ ఇంటి నిర్మాణం నిబంధన లకు అనుగుణంగా ఉందో లేదో సంబంధిత అధికారు లు స్వయంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారిం చాలని రాధిక కోరారు. నిబంధనలు ఉల్లంఘిం చినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని, లేకపోతే నిర్మాణానికి అనవ సరంగా అడ్డంకులు కల్పించ కుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.తమ కుటుంబం తీవ్ర ఆందోళనకు గురవుతోం దని, ప్రాణహాని ఉం దని భయపడుతున్నట్లు ఆమె తెలిపారు. తమకు రక్షణ కల్పించడంతో పాటు ఇంటి నిర్మాణంపై ఏ ర్పడిన వివాదాన్ని నిష్పాక్షికంగా పరిశీ లించి న్యా యం చేయాలని మున్సిపల్, పోలీసు అధికారు

జాతీయ క్రీడ బరిలో ఐపీఎస్ విద్యార్థులు

థాంగ్-టా మార్షల్ ఆర్ట్స్‌లో నలుగురు విద్యార్థుల సత్తా
అభినందించిన ఐపీఎస్ అధినేతలు
మాటేటి కృష్ణప్రియ సంజీవ్ కుమార్



సుల్తానాబాద్, (సింగిడి): సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పా ఠశాల విద్యార్థులు థాంగ్-టా మార్షల్ ఆర్ట్స్‌లో స త్తా చాటారు. జాతీయ స్థాయి పోటీలకు పాఠశాల కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికై తమ ప్ర తిభను చాటారు. ఈ నెల 28, 29, 30 తేదీ ల్లో జ మ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో నిర్వహించనున్న జాతీ య స్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నారు. ఇటీ వల హైదరాబాద్‌లో రాష్ట్ర థాంగ్-టా మార్షల్ ఆర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థా యి పోటీ ల్లో ఐపీఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరి చి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఏ. అద్వైత్ 56 కిలోల విభాగంలో, ఎం. సంప్రీత్ 46 కిలోల విభాగంలో, కె. మైత్రి వరుణ్ 52 కిలోల విభాగంలో, టి. ధనుష్‌కుమార్ 56 కిలోల విభాగం లో జాతీయ స్థాయికి ఎంపికయ్యా రు.జాతీయ పో టీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అ భినందించారు. విద్యతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేం దుకు పాఠశాల కృషిచేస్తోందని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జాతీయ స్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. శ్రీనగర్‌లో జరిగే పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఉపా ధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలు తె లిపారు. కార్యక్ర మంలో ఉప ప్రిన్సిపల్ సునీత, మే నేజర్ శివ, వ్యాయామ ఉపాధ్యాయు లు సత్యనా రాయణ, సతీష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

లక్కీడ్రాలో పాత్రికేయుడికి ఐదు కేజీల లడ్డూ



సుల్తానాబాద్, (సింగిడి): సుల్తానాబాద్ మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలో భవాని యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బుధవారం నిర్వ హించిన లక్కీ డ్రాలో ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు ముతికెల శ్రీధర్ ఐదు కేజీ ల లడ్డూను గెలుచుకున్నారు. గణేశుడికి నైవేద్యం గా సమర్పించిన లడ్డూను భక్తులకు ఎలాంటి తా రతమ్యం లేకుండా అందించాలనే ఉద్దేశం తో నగ దు కూపన్ల ద్వారా లక్కీ డ్రా నిర్వహించినట్లు ఉ త్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం శ్రీధర్‌కు లడ్డూ ప్రసాదాన్ని అం దజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షు డు ఆకుల కరుణాకర్, ఆకుల అంజయ్యతో పా టు భవాని యూత్ సభ్యులు విష్ణువర్ధన్, మధు, సాయి, శివకుమార్, సందీప్, జయవర్ధన్, శ్రీనివా స్, దేవానంద, సాయికిరణ్, పూజా రి, సాయినాథ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సీనియర్ జర్నలిస్టు రమేష్ అకాల మృతి

కన్నీటి వీడ్కోలు.. కుటుంబానికి
అండగా ఉంటాం:
ఎమ్మెల్యే విజయరమణారావు





సుల్తానాబాద్, (సింగిడి): సుల్తా నాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు టీ. కే. రమేష్ గుండెపో టుతో ఆకస్మికంగా మృతి చెం దారు. ఆయన మృతి తో జర్నలిస్టు వర్గాల్లో, సుల్తా నాబాద్ పట్టణం లో విషాద ఛాయ లు అలుముకు న్నాయి. రమేష్ మృతివార్త తెలుసు కున్న ప్రభు త్వవిప్, పెద్దపల్లి ఎమ్మెల్యేచింతకుంటవిజయరమ ణారావు ఆయన నివాసానికి చేరుకుని పార్థివదే హానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనం తరం రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శిం చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమ యంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం తరఫున, వ్యక్తిగతంగా అన్ని విధాలా అండగా ఉంటామ ని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఆపదలో కుటుంబానికి తోడుగా నిలుస్తామని ధైర్యం చెప్పారు. రమేష్ మృతి పట్ల జిల్లా గ్రంథాల య సంస్థ చైర్మన్ అంతటి అన్న య్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, పలువు రు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకు లు, స్థానిక విలేక రులు సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు.

సింగరేణి భవిష్యత్‌కు.. కొత్త బ్లాక్ లే భరోసా

బొగ్గు బ్లాక్ ల పై బిడ్ వేయాలి



మంచిర్యాల,(సింగిడి):: తెలంగాణకు గుండెకాయ లాంటి సింగరేణి సంస్థ భవిష్యత్ అవసరా లను దృష్టిలో పెట్టుకుని కొత్త బొగ్గు బ్లాక్‌లను దక్కించు కోవాల్సిన అవసరం ఉందని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య పేర్కొన్నాడు. బుధవారం శ్రీరాంపూర్ లో ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యా ప్తంగా 25 బొగ్గు బ్లాక్‌ల వేలానికి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో.. ఇల్లందులోని కోయగూడెం ఓసీపీ-3, మందమర్రిలోని శ్రావణపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు బ్లాక్‌ల వేలంలో సింగరేణి సంస్థ తప్పనిసరిగా పాల్గొనాలని డిమాండ్ చేశాడు. సెప్టెంబరు 17న కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ 16వ విడత బొగ్గు బ్లాక్‌ల వేలానికి నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం జరిగే ఈ వేలం ప్రక్రియలో సింగరేణి పోటీపడి బ్లాక్‌లను సాధించే ందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందిం చుకోవాలని సూచించారు. సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు గనులు లభించడం ద్వారా భవిష్యత్‌లో ఉత్పత్తి కొనసాగింపుతో పాటు సంస్థ విస్తరణకు అవకాశం ఉంటుందని తెలిపారు. బొగ్గు నిల్వల లభ్యత పెరిగితే సంస్థ ఆదాయ వృద్ధికి, ఉత్పత్తి సామర్థ్య విస్తరణకు దోహదపడటంతో పాటు వేలాది మంది కార్మికులు, ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు మేలు జరుగుతుందని పేర్కొంది. అందువల్ల బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని సాధారణ వాణిజ్య ప్రక్రియగా కాకుండా సింగరేణి భవిష్యత్‌కు సంబంధించిన కీలక నిర్ణయంగా పరిగణించాలని యాజమాన్యాన్ని కోరింది. కేంద్ర ప్రభుత్వం పారదర్శక వేలం విధానం ద్వారా బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు ప్రక్రి యను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ కూడా వేలంలో పాల్గొని బొగ్గు బ్లాక్‌లను పొందేందుకు అవకాశం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో సంస్థకు అవసరమైన ఆర్థిక వనరులు, సాంకేతిక సామర్థ్యం, పరిపాలనా అనుమతులు, న్యాయపరమైన అంశాలను సమన్వయం చేసుకుని పోటీ బిడ్డింగ్‌కు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల భవిష్యత్ కోసం బీఎంఎస్ నాయకత్వం కేంద్ర బొగ్గు--గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి వేలంలో సింగరేణి పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. సింగరేణి వేలంలో పాల్గొంటే బ్లాక్‌లు దక్కేలా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్ర మంత్రి ఇచ్చిన హామీని కార్యరూపంలోకి తీసుకురావా ల్సిన బాధ్యత సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం పై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సింగరేణి యాజమాన్యంతో సమన్వయం చేసుకుని అవసరమైన ప్రభుత్వ స్థాయి సహకారం అందించాలని కోరారు. సింగరేణి ఉత్పత్తి కార్యకలాపాలకు భవిష్యత్‌లో అవసరమైన బొగ్గు నిల్వలను సమకూర్చుకోవడం సంస్థకు కీలకమని పేర్కొన్నారు. కొత్త బ్లాక్‌లు లభిస్తే సంస్థ విస్తరణతో పాటు కార్మికుల ఉపాధి, సామాజిక భద్రతకు దీర్ఘకాలిక ప్రయోజనం ఉంటుందని తెలి పారు. ఈ సమావేశంలో ఏరియా కార్యదర్శి రాజారాం కిరణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ జెళ్ల తిరుపతి, ఆర్గనై జింగ్ సెక్రటరీలు అప్పల వీరయ్య, కనవేన సాగర్, మిట్ట మధుకర్, బుర్ర అరుణ్‌కుమార్ గౌడ్, కొమ్మ బాపు, గోళ్ల సురేష్, కుంట రాజు, బూమ్‌పెల్లి రమేష్, చల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి





లింబా (కే) లో మహిళా సమైక్య భవనం హెల్త్ సెంటర్ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

నిర్మల్ ప్రతినిధి,కుంటాల (సింగిడి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ప్రతి గ్రామానికి అభివృద్ధి పనుల కోసం 60 లక్షల నుండి కోటి రూపాయల వరకు నిధులు ఇవ్వడం జరిగిం దని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అన్నారు.లింబా కె గ్రామం లో 20లక్షల నిధులతో నిర్మించినా మహిళ సమైక్య భవనం, అదే విధంగా హెల్త్ సెంటర్ ప్రారంభం, అదే విధంగా 12 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న అంగన్ వాడి భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన సంద ర్భంగా మాట్లాడారు.. అదే విధంగా లింబా బి గ్రామం లో 30 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న గోదాం నిర్మాణానికి భూమి పూజ చేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పటేల్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రతి గ్రామానికి పెద్ద మొత్తం లో నిధులు ఇవ్వడం జరిగిందని, ఐక్యంగా ఉండి, గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలింది గా సూచించారు.. పది సంవత్స రాల పాలకుల నిర్లక్ష్య వైఖరి మూలంగా గ్రామాలు అభివృద్ధి లో వెనుక బడ్డాయన్నారు..

ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేకు లింబా కె, లింబా బి గ్రామాల్లో ఘన స్వాగతం లభించింది. డప్పుచప్పులతో, మహిళలు మంగళ హారతులు, పూలు చల్లుతూ స్వాగతం పలికారు.. ఈ సందర్భం గా సర్పంచులు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు ఇస్తున్న ఎమ్మెల్యేకు వారు ధన్యవాదా లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి విజయలక్ష్మి తో పాటు, నాయకులు అధికారులు సర్పంచ్ లు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ష్ రాజకీయం.. నో అభివృద్ధి

ర్యాలీలకు పరుగులు.. సమస్యలకు బ్రేకులు



మంచిర్యాల, (సింగిడి): మంచిర్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఎంపీ వర్గాల మధ్య నెలకొన్న రాజకీయ విభేదాలు అభివృద్ధిపై ప్రభావం చూపుతున్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆరోపించారు. బుధవారం మంచిర్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొంతకాలంగా ఎమ్మెల్యే, ఎంపీ వర్గాలు నిర్వహిస్తున్న పోటాపోటీ కార్యక్రమాలు రాజకీయ ఆధిపత్య ప్రదర్శ నగా మారుతున్నాయని విమర్శించారు. ఎవరి బలం ఎంత అనేది చూపించుకునే ప్రయత్నం కంటే ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, రహదారులు, ఉపాధి, పారిశుధ్యం, ఇతర సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల ని సూచించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్‌లో దళితులకు ఇచ్చిన హామీ ల్లో ఇప్పటివరకు ఎన్ని అమలు చేశారో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హామీల అమలుపై సమాధా నం చెప్పకుండా దళితులతో బల నిరూపణ సభలు నిర్వ హించడంపై పోటీ పడటం వల్ల ప్రజలకు ఏం ప్రయోజ నమని ప్రశ్నించారు. మంచిర్యాల జిల్లాలో అనేక ప్రజా సమస్యలు, అభివృద్ధి అవసరాలు ఉన్నప్పటికీ అధికార పార్టీ నేతలు వాటిపై సమగ్రంగా దృష్టి సారించడం లేదని రఘునాథ్ ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై కార్యాచరణ ప్రక టించాలని కోరారు. మంచిర్యాలలో గంజాయి బ్యాచ్ ఉందంటూ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ఒకవైపు గంజాయి సమస్యను ప్రస్తావిస్తూ, మరోవైపు దాన్ని అరికడతామని ప్రకటించడం రాజకీయంగా విరుద్ధమైన వ్యాఖ్యలుగా ఉన్నాయని విమర్శించారు. యువతను మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉంచేం దుకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నా రు. ప్రజలు రాజకీయ ఆధిపత్య పోరును కాకుండా నియోజకవర్గ అభివృద్ధిని కోరుకుంటున్నారని రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ రాజకీయ విభేదాలను పక్కనపెట్టి మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టి వెంకట కృష్ణ, కమలాకర్‌రావు, బియ్యాల సతీష్‌రావు, అమిరిశెట్టి రాజ్‌కుమార్, నాంపల్లి శ్రీనివాస్, పల్లి రాకేష్, జయరామరావు, ఆడే ప్రేమ్‌సింగ్, గాజుల ప్రభాకర్, ముల్లాల కుమార్, కొండ వెంకటేష్, రెడ్డిమల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గణనాథునికి ఘన వీడ్కోలు



మంచిర్యాల, (సింగిడి): కొన్ని రోజులుగా పూజలు.. పూల అలంకరణలు.. భక్తి గీతాలతో సందడిగా కనిపించిన గణనా థుడి మండపాలు బుధవారం వీడ్కోలు వేళ భావోద్వేగంగా మారాయి. ఇంటిల్లిపాదినీ ఒక్క చోట చేర్చిన ఆ గణపయ్యను సాగనంపే సమ యంలో భక్తుల్లో ఒకవైపు ఉత్సాహం.. మరో వైపు వీడ్కోలు బాధ కనిపించింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో గణేశ్ నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే మండపాల వద్ద సందడి నెలకొంది. ప్రత్యేకం గా అలంకరించిన వాహనాలపై వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తులు ర్యాలీలుగా బయలుదేరారు. యువత డీజే పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేయగా.. మహిళలు, చిన్నారులు కోలాటాలతో ఆకట్టుకున్నారు. గణపతి బప్పా మోరియా.. జై బోలో గణేశ్ మహారాజ్ అంటూ చేసిన నినాదాలతో ర్యాలీ మార్గాలు మార్మోగాయి. వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న ప్రతి అడుగులోనూ భక్తి కనిపించింది. మండపాల్లో రోజూ పూజలు చేసిన భక్తులు చివరిసారిగా గణనాథుడిని దర్శించుకుని హారతులు ఇచ్చారు. చిన్నారులు విగ్రహాన్ని చూస్తూ ఆనందపడుతుండగా.. పెద్దలు మాత్రం తమ ఇంటి సభ్యుడిని సాగనం పుతున్నట్టుగా భావోద్వేగానికి లోనయ్యారు. వినాయక నిమజ్జన ర్యాలీలు కేవలం ఉత్సవ కార్యక్రమా లుగా కాకుండా సామాజిక ఐక్యత కు వేదికలుగా మారాయి. కులమతా లకు అతీతంగా వివిధ వర్గాల ప్రజలు ర్యాలీల్లో పాల్గొ న్నారు. యువతతో పాటు మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని గణనాథుడి కి ఘన వీడ్కోలు పలికారు. ర్యాలీలు నిమజ్జన ప్రాంతాలకు చేరుకున్న అనంతరం ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. అనంతర ం భక్తులు జై గణేశ్ నినాదాల మధ్య విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేశారు. విగ్రహం నీటిలో కలిసిపోతున్న క్షణంలో భక్తుల కళ్లలో ఆనందంతో పాటు వీడ్కోలు బాధ కనిపించిం ది. వచ్చే ఏడాది మళ్లీ రావాలంటూ గణనాథు డిని ప్రార్థిస్తూ భక్తులు చేతులు జోడిం చారు. పండుగ ముగిసినా.. ఆ జ్ఞాపకాలు మాత్రం ప్రతి ఇంటిలో మిగిలి పో యాయి. గణపయ్యకు వీడ్కోలు పలికిన భక్తుల మనసుల్లో 'వచ్చే ఏడాది మళ్లీ రావాలి' అన్న ఆకాంక్షతో నిమజ్జన వేడుకలు ముగిశాయి.

చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో

ఘనంగా వినాయక నిమజ్జనం

భక్తిశ్రద్ధలతో గంగమ్మ ఒడికి చేరిన లంబోదరుడు
భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన మంత్రి





చెన్నూరు, (సింగిడి): చెన్నూరు నియోజ కవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినాయక నిమజ్జన వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధ లతో జరిగాయి. అనంతరం మంత్రి వివేక్ వెంకటస్వామి పలు వినాయక మండపాలను సంద ర్శించి పూజలు నిర్వహించారు నవరా త్రుల పాటు నిత్య పూజలందుకున్న గణనాథుడికి బుధ వారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్య కర్తలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ నిమజ్జన మహో త్సవంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ సీనియర్ నాయ కులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయం నుండి ప్రారంభమైన గణేశుడి శోభా యాత్ర స్థానిక పురవీధుల గుండా కోలాహలంగా సాగింది. నాయ కులు, కార్యకర్తలు, భక్తులు నృత్యాలు చేస్తూ, జై బోలో గణేష్ మహారాజ్ కి జై అంటూ నినాదాలు చేస్తూ బాణాసంచా కాల్చారు. అనంతరం శాస్త్రోక్తంగా పూ జా కార్యక్ర మాలు నిర్వహించి, వినా యక విగ్రహాన్ని గంగమ్మ ఒడికి చేర్చారు. ఈ కార్యక్ర మంలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియ ర్ నాయకులు మాట్లాడుతూ.. నియోజ కవర్గ ప్రజలందరిపై విఘ్నేశ్వరు డి ఆశీస్సులు ఉండాలని, అందరికీ ఆయు రారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగా లని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో పట్టణానికి చెందిన ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు అభి మానులు భారీగా పాల్గొన్నారు...

నిర్మల్ ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా

రాథోడ్ రమేష్ బాధ్యతల స్వీకరణ



నిర్మల్ ప్రతినిధి, (సింగిడి): నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా డీఆర్వో రాథోడ్ రమేష్ బుధవా రం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన అధికారి కంగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంత రం పలువురు జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు రాథోడ్ రమేష్‌ను మర్యాదపూర్వ కంగా కలిసి పుష్పగుచ్ఛాలు అంద జేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిపాలన లోని వివిధ అంశాలు, రెవెన్యూ శాఖకు సంబంధించిన కార్యక్ర మాలపై అధికారులు ఆయనకు వివరాలు అందజేశారు. కార్యక్ర మంలో డీపీఆర్వో విష్ణువర్ధన్, సివిల్ సప్లై డీఎస్ఓ రాజేందర్, డీఎం సుధాకర్, ఏఓ ప్రవీణ్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనానికి రూ. 30 లక్షలు మంజూరు



నిర్మల్ ప్రతినిధి, (సింగిడి): నిర్మల్ పట్టణంలోని అంబేద్కర్ భవన సౌకర్యాల కోసం సాంఘిక సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రూ. 30 లక్షల నిధుల మంజూరికి హామీ ఇచ్చారని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజక వర్గ బాధ్యుడు కుచాడి శ్రీహరి రావు తెలిపారు. బుధవారం హైదరాబాద్ లోని అయన నివాసం లో కలిసి అంబేద్కర్ భవన పరిస్థిని మంత్రికి వివరించి వినతి పత్రాన్ని అందజేశారు. భవనం లోపల ప్రతి ధ్వని నివారణ, అతిథుల సౌలభ

ప్రభాతనవ సింగిడి SINGIDI తెలుగు దినపత్రిక ప్రతి రంగూ ఓ నిజం

సింగిడి

ప్రశాంతంగా వినాయకుడి నిమజ్జనం





నాయిని చెరువు పై నిమజ్జనానికి సర్వం సిద్ధం
చేసిన మున్సిపల్ పాలకవర్గం
ఏర్పాట్లను పర్యవేక్షించిన అడిషనల్ కలెక్టర్ హరిప్రసాద్

జమ్మికుంట, (సింగిడి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన నిర్వాహకులు బుధవారం సాయంత్రం స్వామివారిని నిమజ్జనానికి పట్టణంలోని నాయిని చెరువు కు తరలించి నిమజ్జనం చేశారు. గత నాలుగు రోజుల నుండి మున్సిపల్ పాలకవర్గం కమిషనర్ ఆదేశాలతో నాయిని చెరువు వద్ద నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సర్వం సిద్ధం చేశారు. బుధవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో మొదటి విగ్రహాన్ని అడిషనల్ కలెక్టర్ హరిప్రసాద్ హుజు రాబాద్ ఆర్డిఓ జల కుమారి మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ తమ చేతుల మీదుగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టణ ప్రజలు వీలైనంత త్వరగా వినాయక నిమజ్జనం జరిపించుకోవాలని వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిన సూచనతో వీలైనంత త్వరగా నిమజ్జనం జరుపు కోవాలని నిర్వాహకులను కోరారు. ఒకవైపు వర్షం మరోవైపు నిమజ్జనం జరుగుతుండగా వర్షంలో తడుస్తూ అధికారులు సైతం సంతోషంతో స్వామివారి నిమజ్జనాన్ని ప్రారంభించారు. గత రెండు రోజులుగా వర్షాలు లేక నిమజ్జనం చేయడం ఎలా అని ఆలోచిస్తున్న సమయంలో బుధవారం సాయంత్రం నుండి వర్షం ప్రారంభం కావడంతో పట్టణ ప్రజలతో పాటు అధికారులు సైతం సంతోషం వ్యక్తం చేశారు. నాలుగున్నరకు మొదలైన నిమజ్జన కార్యక్రమం రాత్రి 12 గంటల వరకు పూర్తి కావచ్చునని అధికారులు అంచనా వేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని మండప నిర్వహకులు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. హుజరాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి ఆదేశాల మేరకు పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ తమ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జావేద్ కౌన్సిలర్లు రెవెన్యూ ఇన్స్పెక్టర్ గడ్డం శంకర్ తోపాటు మున్సిపల్ సిబ్బంది వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా గణేశ నిమజ్జనోత్సవం

భక్తిశ్రద్ధలతో ముగిసిన విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలు
అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి



కరీంనగర్, (సింగిడి): అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలు నిమజ్జనోత్సవంతో ఘనంగా ముగిశాయి. వేదపండితుల మార్గదర్శకత్వంలో కుంకుమార్చన, లింగార్చన, మహానైవేద్యం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నిమజ్జనోత్సవానికి హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, నవరాత్రుల సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. గణనాథుడి ఆశీస్సులతో విద్యార్థులు విద్యా, ఇతర రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ భక్తితో భగవంతుడిని స్మరించి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ ఏడాది కూడా అన్ని విద్యాసంస్థల ప్రాంగణాల్లో మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు తెలిపారు. నిమజ్జనోత్సవంలో సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ గణనాథుడికి వీడ్కోలు పలికారు. ప్రాంగణాలు గణేష్ నామస్మరణతో మారుమోగాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్ఎండీ కాలనీలో ఘనంగా
వినాయక నవరాత్రి ఉత్సవాలు

పూజల్లో పాల్గొన్న కరీంనగర్ మేయర్
కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, (సింగిడి): తిమ్మాపూర్ మండలంలోని మహాత్మానగర్ గ్రామ పరిధి ఎల్ఎండీ కాలనీలో శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల తో ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజులపాటు నిత్య పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించ డంతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నప్రసాద వితరణలో భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతిరోజూ సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చిన్నారులు, యువతను అలరించాయి. శివాజీ యువజన సంఘం ఆహ్వానం మేరకు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ, మహాత్మానగర్ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శివాజీ సేన యువజన సంఘం బాధ్యులు, బీజేవైఎం నాయకులు దుర్యోధి అజయ్, కుంట మల్ల ప్రేమ్‌చాంద్, కూర శివారెడ్డి, అక్షయ్‌తో పాటు గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్
నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కాంగ్రెస్ నేత



జమ్మికుంట, (సింగిడి): తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరుడిని పూజించి బుధవారం పట్టణంలోని నాయిని చెరువు లో నిమజ్జనం చేయడానికి మున్సిపల్ అధికారులు పాలకవర్గం భారీ ఏర్పాట్లు చేయగా ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సంద ర్భంగా రమేష్ మాట్లాడుతూ, గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరిం చుకొని పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధలతో స్వామివారిని ప్రత్యేక అలంకరణలతో తొమ్మిది రోజులపాటు ఘనం గా పూజించాలని అంతే ఘనంగా నిమజ్జనం చేయడానికి చెరువు వద్దకు రావడం జరుగు తుందని ఇక్కడ మున్సిపల్ అధికారులు పాలకవర్గం అన్ని ఏర్పాట్లు చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ బాబు ఆదేశాల మేరకు నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించడం జరిగిందని ఏర్పాట్లలో అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా ఏర్పా ట్లు ఉన్నప్పటికీ జాగ్రత్త వహిస్తూ నిమజ్జనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి మున్సిప ల్ వైస్ చైర్మన్ పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకు లు సాయిని రవి కౌన్సిలర్లు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల గణేశుడి ఆకృతిలో మానేరు విద్యార్థుల వినూత్న ప్రదర్శన

భక్తి, ఐక్యత, సృజనాత్మకతను చాటిన విద్యార్థులు



కరీంనగర్, (సింగిడి): గణనాథుడి నిమజ్జనాన్ని పురస్కరించు కుని కరీంనగర్‌లోని మానేరు విద్యా సంస్థల విద్యార్థులు బుధవారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థు లంతా కలిసి బాల గణేశుడి ఆకృతిలో నిలిచి భక్తి, ఉత్సాహాన్ని చాటుకున్నారు. విద్యలో రాణించడంతో పాటు గణనాథు డి ఆశీస్సులు తమపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్ర మాన్ని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినాయక చవితిని ప్రజలు దేశవ్యాప్తం గా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, నవరాత్రు ల అనంతరం గణనాథుడిని నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోందన్నా రు. మానేరు విద్యాసంస్థల్లోనూ ప్రతి ఏటా వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సృజనాత్మకంగా గణనా థుడి ఆకృతిని రూపొందించడం అభినం దనీయమని, ఇటువంటి కార్యక్రమాలు వారిలో భక్తి, ఐక్యత, సృజనాత్మకత, సమష్టి భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం

కొత్తపల్లి నూతన నిమజ్జన కేంద్రాన్ని ప్రారంభించిన
మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, (సింగిడి):: నగరంలో తొమ్మిది రోజులపాటు భక్తుల పూజలు, భజనలు, విశేష అభిషేకాలు అందుకున్న గణనాథుడి నిమజ్జనోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొత్తపల్లి వద్ద ఏర్పాటు చేసిన నూతన నిమజ్జన కేంద్రంలో విగ్రహాల నిమజ్జన ప్రక్రియను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ లాంఛనంగా ప్రారంభించారు. కొత్తపల్లి నిమజ్జన కేంద్రానికి శోభాయాత్రగా తరలివచ్చిన తొలి గణేష్ విగ్రహానికి మేయర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్రేన్ సాయంతో విగ్రహాన్ని నిమజ్జనం చేసి విఘ్నేశ్వరుడికి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు.

పద్మశాలి కులస్తుల ఐక్యత అభినందనీయం

మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్
పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా
అరకాల వీరేశలింగం
ఏకగ్రీవానికి సహకరించిన
ఎన్ ఎం రమేష్



జమ్మికుంట, (సింగిడి): జమ్మికుంట పట్టణ పద్మశాలి సేవా సమితి పద్మశాలి కుల సంఘం ఎన్నికల్లో బరిలో ఉన్న అరుకాల వీరేశలింగం ఎన్ ఎం రమేష్ ల మధ్య ఉన్నపోటీ నుండి రమేష్ స్వచ్ఛందంగా ఎన్నికల బరిలో నుండి తప్పుకోగా పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా సీనియర్ నాయకులు అరకాల వీరేశ లింగం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. పద్మశాలి సంఘం ఎన్నికల బరిలో ఇద్దరు వ్యక్తులు బరిలో ఉండగా పద్మశాలి కుల బంధువులు ఒకరికి ఒకరు సమన్వయంతో వారి ఐకమత్యాన్ని చాటుకుంటూ ఎన్నికను ఏకగ్రీవం చేయ డానికి కృషిచేసి అరకాల వీరేశలింగము ను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ వారిని అభినందించారు. ఐకమత్యం తో ముందుకు వెళ్తే ఏదైనా సాధ్యమని మరోసారి పద్మశాలి కులస్తులు దానిని గుర్తించి ఎన్నిక లేకుండా సంఘం నాయకుడిని ఎన్నుకోవడం అభినందనీ యమని భవిష్యత్తులో వారికి అండగా ఉంటూ వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తానని ప్రశాంత్ కుమార్ తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన వీరేశలింగం కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని చైర్మన్ పేర్కొన్నారు. పద్మశాలి కులస్తులతో తనకు విడదీయలని అనుబంధం ఉందని తాను గతంలో రెండు సార్లు కౌన్సిలర్గా పోటీ చేస్తే వారి సహాయ సహకారాల తో తన గెలుపుకు కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సంఘం ఎన్నికల్లో పోటీ లేకుండా వీరేశలింగం గెలుపుకు సహకరించిన రమేష్ ను చైర్మన్ ప్రత్యేకంగా ప్రశంసిస్తూ అభినందించారు. రమేష్ స్వచ్ఛందంగా ఎన్నికల భరి నుండి తప్పుకుంటు న్నట్లు ఎన్నికల అధికారులకు లేఖ సమర్పించడం తో పాటు అరకాల వీరేశలింగం ఎన్నికకు తన పూర్తి మద్దతు ప్రకటించారు. ఇదే ఐకమత్యంతో పద్మశాలి కుల స్తులందరూ ఐకమత్యంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దిడ్డి రాము కంటెస్టెడ్ అభ్యర్థి రమేష్ కొండా శ్రీధర్ రమేష్ తోపాటు ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

భగత్‌నగర్‌లో వినాయక నిమజ్జన వేడుకలు

గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన డిప్యుటీ
మేయర్ యాదగిరి సునీల్ రావు



కరీంనగర్, (సింగిడి): నగరంలోని భగత్‌నగర్‌లో వినాయక నిమజ్జన వేడుకలు వైభవంగా జరిగాయి. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు పలు వినాయక మండపాలను సందర్శించి గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. భగత్‌నగర్‌లోని తన శిబిర కార్యాలయం వద్ద భగత్‌నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో చివరి పూజలో పాల్గొన్న సునీల్ రావు, అనంతరం చైతన్య, పెద్దమ్మ, ఆదర్శ, మహాదేవ్ యువజన సంఘాల ఆధ్వర్యంలోని మండపాలతో పాటు కాశ్మీర్ గడ్డ మైసమ్మ చెట్టు వద్ద ప్రతిష్ఠించిన గణనాథులకు పూజలు చేశారు. తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న కలశాలను ఆయన స్వీకరించగా, అర్చకులు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండపాల నిర్వాహకులు, యువజన సంఘాల సభ్యులు, కాలనీవాసులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గణేశుడి శాపం కౌశిక్‌కి తగిలింది

కాంగ్రెస్ వైపు జోరు వాన..
కన్నీళ్లు బీఆర్ఎస్ వైపు



జమ్మికుంట, (సింగిడి):: గణేశుడి శాపం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి, బీఆర్ఎస్ నాయకులకి తగిలిందని కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజక వర్గ ఇన్ ఛార్జి ప్రణవ్ వొడితల విమర్శిం చారు. హుజు రాబాద్ నియోజకవ ర్గంలో భారీ వర్షం కురవడం పట్ల ఆయన బుధవారం హర్షం వ్యక్తం చేశారు. భారీ వర్షం కురవడంతోఆనందంతో పల్లెలు, పట్టణాలు పరవశిస్తు న్నాయని పేర్కొన్నా రు. ఎల్ ని నో పరిస్థితి నుండి జోరు వానతో వినాయకుని నిమజ్జనానికి నీటితో గంగమ్మ స్వాగతం పలుకుతుం టే.. తీన్మార్ స్టెప్పులతో యువత ఉత్సాహంగా ఉన్నారని పేర్కొన్నారు. నిమజ్జన సమ యంలో,నిమజ్జనానికి తరలిస్తున్న క్రమంలో కరెంట్ స్తంభాలు విషయంలో జాగ్రత్తలు పాటించాలని యువ తను,నిర్వాహకులను ప్రణవ్ కోరారు. వర్షాలపై తన ఆనందాన్ని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియో జకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి జరగాలని తొలి పూజలు అందుకునే భగవం తుడు లంబోదరుడిని వేడుకున్నట్టు తెలిపారు.



మొదటి గణపతిని నిమజ్జనం చేసిన మున్సిపల్ చైర్పర్సన్

గణపతి నవరాత్రి దినోత్సవాల్లో భాగం గా తొమ్మిది రోజులపాటు భక్తుల పూజ లు అందుకున్న బొజ్జ గణపయ్య నిమ జ్జనాన్ని బుధవారం హుజరాబాద్ పట్ట ణంలో ఘనంగా నిర్వహించారు. హుజు రాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని మొదటి వినాయకుడిని మున్సిపల్ సిబ్బందితో కలిసి ఎస్సారెస్పీ కెనాల్ లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బం దులు ఏర్పడకుండా కెనాల్ లో నీటిని నిల్వ చేయడం జరిగిందని దానికి తోడు నిమజ్జనం రోజున భారీ వర్షం పడడంతో ప్రజలతోపాటు భక్తుల్లో ఆనందం వెల్లి విరిసిందని ఆమె అన్నారు. ప్రశాంత మైన వాతావరణంలో నిమజ్జనం కొనసాగేలా మున్సిపల్ పాలకవర్గం అధికారు లు అన్ని ఏర్పాట్లు చేశారని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయగా ప్రశాంతంగా నిమజ్జనం కొనసాగు తుంది. ఈ కార్యక్రమంలో హుజురాబా ద్ పట్టణ సిఐ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాలను సందర్శించిన
మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

క్షేత్ర పర్యటనలో భాగంగా
జంతువుల వ్యాధులు,
నివారణ చర్యలపై అవగాహన
కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్
డి.వరలక్ష్మి



కరీంనగర్, (సింగిడి):
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) జంతుశాస్త్ర విభాగం విద్యార్థినులు బుధవారం క్షేత్ర పర్యటనలో భాగంగా కరీంనగర్‌లోని జిల్లా పశువైద్యశాలను సందర్శిం చారు. ఈ సంద ర్భంగా పశువైద్య నిపుణులు డాక్టర్ ఎన్. లింగారెడ్డి గొర్రె శవపరీక్షను ప్రత్యక్షంగా నిర్వ హించి, అంతర్గత అవయవాలను వివరిస్తూ మరణానికి గల కారణాలను విద్యార్థినులకు వివరించారు. డాక్టర్ శైలజ జంతువులకు వచ్చే వివిధ వ్యాధులు, వాటి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కోడి శవపరీక్షను కూడా నిర్వహించి, వ్యాధి నిర్ధారణ విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. పరాన్నజీవుల వల్ల కలిగే నష్టాలు, వ్యాధుల నివారణ, టీకాల ప్రాధాన్యతను తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ ఫెసర్ డి. వరలక్ష్మి మాట్లాడుతూ, క్షేత్ర పర్యటనల ద్వారా విద్యార్థినులకు పుస్తక జ్ఞానంతో పాటు ఆచరణా త్మక అవగాహన లభిస్తుందన్నారు. జంతువుల ద్వారా వ్యాపించే వ్యాధులు, వాటి నివారణ, టీకాల ప్రాధాన్యతపై అవగాహన పెంపొందు తుందని తెలిపారు. ఈ పర్యటనలో జీవశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం. మనోజ్ కుమార్, అధ్యాపకులు వై. నారాయణ, జె. అనిత, జి. యాకంబరం, కె. మౌనిక, సి. హెచ్. రమ్యతో పాటు జంతుశాస్త్ర విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వినూత్నంగా గణేష్ నిమజ్జనం

మట్టి గణపతి లను పూజించి
పర్యావరణాన్ని కాపాడాలి
ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు
లెంకలపల్లి శరత్



జమ్మికుంట, (సింగిడి): గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జమ్మికుంట పట్టణం లోని శివాలయం ఆవరణంలో జమ్మి కుంట పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ నిమజ్జనాన్ని వినూత్నంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి వినాయకుడిని గత తొమ్మిది రోజులుగా వివిధ రకాలుగా స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిం చిన భక్తులు బుధవారం నిమజ్జనాన్ని కూడా అంతే పవిత్రంగా నిమజ్జనం చేశారు. ఎక్కడైతే స్వామివారిని ప్రతిష్ఠించి పూజలు చేశారు అదే చోట వినాయకుడి విగ్రహంపై షవర్స్ ఏర్పాటు చేసి అక్కడే నిమజ్జనం చేసి తమ భక్తిని చాటుకు న్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు లెంకలపల్లి శరత్ మాట్లాడు తూ, గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆర్యవైశ్య సంఘం పట్టణ శాఖ ఆధ్వర్యంలో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పవిత్రంగా ప్రత్యేక పూజలు చేయడం జరిగిందని ఉత్సవాల అనంతరం సైతం అంతే పవిత్రంగా స్వామివారి ని నిమజ్జనం చేయాలని సంకల్పించి వాటర్ ట్యాంకర్ ద్వారా ఏర్పాటు చేసి మట్టి విగ్రహాన్ని నిమజ్జనం చేయడం జరిగిందని తెలిపారు. భవి ష్యత్తులో కూడా పిఓపి విగ్రహాలు కాకుండా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావరణానికి ఇబ్బందులు లేకుండా ఇలాంటి మాత్రమే కార్యక్రమా లు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

singidinews@gmail.com

సిన్మా సింగిడి
Cinma Singidi
శనివారం
25-9-2026

కీలకదశకు చేరుకున్న ‘వారణాసి’..

మహేశ్ బాబు న్యూ లుక్ పోస్ట్ వైరల్



సూపర్ స్టార్ మహేశ్ బాబు హీరోగా దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న చిత్రం ‘వారణాసి’. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ కీలక దశకు చేరుకుంది. దాదాపు రెండేళ్లుగా వారణాసి చిత్రానికే అంకితమైపోయిన మహేశ్ బాబు తన పాత్ర షూటింగ్‌ను చిత్రంలో ఇంట్రడక్షన్ సీన్లో వచ్చే షాట్‌తో తాజాగా ముగించారు. షూటింగ్ పూర్తి చేయడంతో పాటు ఇప్పటికే డబ్బింగ్‌ను కూడా ప్రారంభించినట్లు సమాచారం. 90%కు పైగా షూటింగ్ పూర్తవగా, మిగిలిన ప్యాచ్‌వర్క్‌ను వారణాసిలో పూర్తి చేసి షూటింగ్‌కు గుమ్మడికాయ కొట్టేందుకు టీమ్ సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు నెట్టింట వైరల్ అవుతుండగా.. మహేశ్ బాబు ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. ఇక షూటింగ్ ముగింపు దశకు చేరుకోవడంతో ఎఫీశ, ఎడిటింగ్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వంటి పోస్ట్ ప్రొడక్షన్ పనులపై రాజమౌళి ఫోకస్ పెట్టనున్నారు. కాగా.. సైన్స్ ఫిక్షన్ అండ్ హిందూ మైథాలజీ కలగలిపిన గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ పాత్ర పోషిస్తున్నాడు. ఎం.ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నాడు. ప్రపంచస్థాయి



విజువల్స్‌తో వారణాసి చిత్రం ఏప్రిల్ 7, 2027న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్

సోనాలి బేంద్రే సమర్పిస్తున్న తొలి చిత్రం ‘సోహ్లా’..

ఆకట్టుకుంటోన్న ఫస్ట్ లుక్ పోస్టర్



కప్పుడు తెలుగు ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా దూసుకుపోయిన ప్రముఖ నటి సోనాలి బింద్రే సెకండ్స్ ఇన్నింగ్స్‌పై ఫోకస్ పెట్టారు. ఈ మేరకు ఆమె తొలిసారిగా ప్రజెంట్ చేస్తున్న సరికొత్త మరాలీ సినిమా ‘సోహ్లా’. ‘సోహ్లా’ అంటే మరాలీలో ఉత్సవం లేదా వేడుక అని తెలుస్తుండగా.. ‘పశ్యా’ అనే 13ఏళ్ల చురుకైన బాలుడి చుట్టూ తిరిగే ఒక అందమైన ఎమోషనల్ డ్రామాగా డైరెక్టర్ సాయికత్ బాగ్బన్ తెరకెక్కిస్తున్నాడు. ప్రవీణ్ దాలింబ్కర్, దేవదత్త ప్రశాంత్ గోనే, వర్షా మాల్వడ్కర్, వైష్ణవి సంజయ్ ఘోడ్కే, అలెస్సాండ్రా వీలన్ మెరెడిజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీ అక్టోబర్ 16న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. నలుగురు పిల్లలు సంతోషంగా ఉన్నట్లు కనిపిస్తున్న ఈ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నది. కాగా.. గోల్డీ బెహల్‌తో పాటు సచిన్ శ్రీవాస్తవ్, రత్నా శ్రీవాస్తవ, కవిత బాగ్‌బన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసే బాధ్యతను

నాని “ప్యారడైజ్”లో కేసీఆర్..

సోషల్ మీడియాలో వైరల్



నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన ది ప్యారడైజ్ సినిమా బుధవారం ప్రేక్షకుల ముందకు వచ్చింది. బుధవారం రాత్రి ప్రీమియర్స్ వేయగా గురువారం ఉదయం నుండి పాన్ ఇండియా లెవల్‌లో విడుదల చేశారు. సినిమాకు ఎక్కడ చూసినా పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. సినిమాలో యాక్షన్ సన్నివేశాలు, తల్లి సెంటిమెంట్ ఎంతగానో ఆకట్టుకున్నాయని ప్రేక్షకులు చెబుతున్నారు. ఇక ఈ చిత్రానికి సంబంధించిన కొన్ని సన్నివేశాలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఓ సన్నివేశంలో ఎమ్మెల్యే శంకర్ అన్న అనే పాత్ర అచ్చం మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పోలి ఉండటం ఆసక్తికరంగా మారింది. ప్రియదర్శి ఈ పాత్రలో నటించగా మాట్లాడే విధానం, ఆయన లుక్ కేసీఆర్‌ను పోలి ఉన్నాయి. దీంతో కేసీఆర్ రిఫరెన్స్ తోనే ఈ పాత్రను రూపొందించి ఉంటారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుండా ఈ పాత్ర సినిమాలో ఎంతో కీలకమైనదిగా తెలుస్తోంది. సినిమాలో ఓ సన్నివేశంలో గద్దర్‌కు సంబంధించి కూడా సన్నివేశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు దివంగత నేత ఎన్టీరామారావు పాత్ర కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. పారడైజ్ సినిమా తెలంగాణలోని గోదావరిఖని నేపథ్యంలో వచ్చిన సంగతి తెలిసిందే. చిత్రానికి శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించారు. ఇందులో నానికి జోడిగా కాయదు లోహర్ హీరోయిన్ గా నటించింది. కీర్తి సురేష్ సినిమాలో స్పెషల్ సాంగ్ తో అదరగొట్టింది.





Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737